# లాకర్ నెం-112

నవల

– తుర్లపాటి రామానుజరావు




శ్రీ
కౌముది
మీ మునివేళ్ళపై సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 217

కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి అక్టోబర్ 2019 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

ఒక్క మాట

అవును ఒక్కటే మాట!

"ఈ నవలలోని పాత్రలూ, సన్నివేశాలు అన్నీ కల్పితం. సదర్భానుసారంగా ఊళ్ళ పేర్లు లాంటివి కొన్ని తీసుకోవడం జరిగింది తప్ప, ఈ కథ కేవలం నా స్వంత సృష్టి." – ఇది మామూలుగా అందరు రచయితలూ, ముఖ్యంగా డిటెక్టివ్ నవలా రచయితలూ చెప్పేది. ఇది మాత్రమే కాకుండా, నేను ప్రత్యేకంగా "ఒక్క మాటంటూ" చెప్పేది మరొకటుంది.

అసలు ఈ డిటెక్టివ్ నవల ఎలా మొదలు పెట్టానో, బ్యాక్ గ్రౌండ్ వివరించడమే ఈ ఒక్క మాట. మొదట ఈ కథ ఒక మామూలు కథగా పుట్టింది. దీన్ని డిటెక్టివ్ నవలగా రాస్తే ఎలా ఉంటుందని అనుకోకుండా వచ్చిన ఒక ఐడియా ఈ కథ జీవితాన్నే మార్చేసింది. వారసత్వం నా వెన్ను తట్టింది. మా అన్నయ్య నాగేశ్వరరావు, విశ్వభరత్ పేరుతో, 300లు పైగా డిటెక్టివ్ నవలలు రాసిన రచయిత. అతని రచనా సామర్ధ్యం అమోఘం. తను రెండు నవలలు ఒకేసారి డిక్టేట్ చేస్తూ రాయించడటం నేను చాలా సార్లు చూశాను. ఆర్ధికంగా అతనికి సహాయ పడ్డానే కానీ, అతని రచనల్లో ఏనాడు నేను తలదూర్చలేదు. నా చదువు, ఆ తర్వాత నేనూ, నా బ్యాంకు ఉద్యోగం-అదే నా జీవితం. ఆ తర్వాతెప్పుడో, కొన్ని కథలు, అప్పుడప్పుడూ మాత్రమే రాశాను. కథలు రాయడంలో కూడా, నేనేమీ చెయ్యి తిరిగిన వాడ్ని కాదు. మామూలు కథలు రాయడం వేరూ, డిటెక్టివ్ కథలు రాయడం వేరు. కథ కంటే, డిటెక్టివ్ నవల రాయడం మరింత కష్టమనే నా అభిప్రాయం. ప్రథమ ప్రయత్నం ఒక డిటెక్టివ్ నవల రాయడం కష్టమే అయినా, ఇది మాత్రం నేనెందుకు రాయలేనని ఒక పట్టుదల నా చేత ఈ ప్రయత్నం చేయించింది. నవలలో కొంత ముందు కథ మాత్రమే చదివి, పూర్తిగా రాయమని ప్రోత్సాహించిన మిత్రులు శ్రీ కిరణ్ ప్రభ గారికి నా చేత ఈ నవల రాయించిన క్రెడిట్ దక్కుతుంది.

ఈ నవలలో కొన్ని చోట్ల నాకు సలహాలిచ్చిన నా మిత్రుడు కమలాకర్ తమ్ముడు లాయరు దుర్గాప్రసాదు గారికి, మరొక లాయరు మిత్రుడు మనోహరు బాబు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

రామానుజ రావు.

## (ప్రారంభం)

**"తప్పుకోండి, తప్పుకోండి"** పోలీసులు వెనక్కి నెట్టేస్తుంటే, మూగివున్న జనం ఇనస్పెక్టరుకు త్రోవ ఇచ్చారు. రోడ్డు పక్కగా పడి వున్న శవాన్ని చూసి ఇనస్పెక్టర్ ప్రసాద్ పక్కనున్న కానిస్టేబులుకు సైగ చేశాడు.

కానిస్టేబులు నేలమీద ముడుచుకుని పడిపోయిన శవం వెల్లకిలా తిప్పాడు. కొద్దిగా మాసిన గడ్డంతో, ప్యాంటూ, చొక్కా వేసుకుని వున్నఆ మనిషి చూడటానికి మధ్య తరగతి వాడిలా వున్నాడు. వేసుకున్న బట్టలు అంత ఖరీదైనవి కాకపోయినా, మరీ తేలికరకం కాదు. కింద పడడం వల్లనేమో కళ్ళజోడు అద్దం ఒకటి పగిలింది. అంటే, అతను అకస్మాత్తుగా కిందపడి చనిపోయి ఉండాలి. ఎడమ చేతి మణికట్టు మీద పెద్ద పుట్టు మచ్చ వుంది. పక్కనే ఒక చేతి సంచి పడి వుంది.

ఇనస్పెక్టర్ చుట్టూ చూశాడు. గుడి మెట్ల క్రింద కొన్ని ఖాళీ క్యారేజీ గిన్నెలు వున్నాయి. అప్పుడే అందరూ భోజనాలు చేసిట్లుంది, దూరంగా పారేసిన ఎంగిలి ఆకులు కుక్కలు పీక్కుతింటున్నాయి. కొంత దూరంలో కొన్ని ఆటోలు, తోపుడు బళ్ళూ ఆగి వున్నాయి.

"ఎవరు చూశారీ శవాన్ని ముందు? ఇతన్ని ఎవరన్నా తాకారా?" అందర్నీ కలియచూస్తూ ప్రశ్నించాడు ఇనస్పెక్టర్ ప్రసాద్.

వాళ్ళంతా రెక్కాడితే గానీ, డొక్కాడని వాళ్ళే. వాళ్ళలో కొంతమంది అడుక్కుతినే వాళ్ళు కూడా వున్నారు. అక్కడ అనుమానించదగ్గ వాళ్ళెవరూ కనిపించలేదు అతనికి.

"మేమెవరం ముట్టుకోలేదండి" అందరూ భయం భయంగా జవాబిచ్చారు.

అక్కడ మూగి వున్న జనంలోంచి ఒక వ్యక్తి ముందుకు వచ్చాడు.

"నువ్వేనా ఇతన్ని ముందు చూసింది? నీ పేరూ?" ప్రశ్నించాడు.

"అవునండయ్యా! నా పేరు నాగేసండీ" జవాబిచ్చాడు.

"ఏం చేస్తుంటావు?" ప్రశ్నించాడు.

"నేను ఆటో రిక్షా తోలుతుంటానండి. ఈయన ప్రతి గురువారం, శనివారం ఇక్కడ మా అందరికీ భోజనాలు పెట్టి పోతాడండీ. ఇవాళ కూడా అలాగే మా అందరికీ భోజనాలు పెట్టాడండి. మేము చేతులు కడుక్కుని, ఇవతలికి వచ్చి చూసేసరికి, పడిపోయి ఉన్నాడండి". ఔనన్నట్లు తలాడించారందరూ.

"పేరేమిటో, ఎక్కడ వుంటాడో ఏమైనా తెలుసా?" అడిగాడు మళ్ళీ.

"తన పేరు రాఘవ రావని ఒక సారి అడిగినప్పుడు చెప్పాడండి. ఎక్కడుంటాడో మాకు తెలవదండి".

"చనిపోయాడని మీకెలా తెలిసింది?"

"ఆ బాబలా పడిపోయే సరికి, వెంటనే గుడి పక్కనే వున్న డాక్టరు గారిని తీసుకు వచ్చామండీ. అప్పటికే చనిపోయారని డాక్టరుగారు చెప్పారు".

"ఎవరా డాక్టరు?" ప్రశ్నించాడు ఇనస్పెక్టరు.

ఇంతలో ఒక మనిషి వెళ్ళి డాక్టరును తీసుకు వచ్చాడు. డాక్టర్ శివరామప్రసాద్ చాలా మంచి వాడు, పేదవాళ్ళకు ఉచితంగా వైద్యం చేస్తాడని పేరు.

అతన్ని చూస్తూనే ఇనస్పెక్టరు "ఓ నమస్తే డాక్టరు గారు, మీరేనా ఇతన్ని చూసిందీ?"ప్రశ్నించాడు.

"అవునండీ, నేను నాడి పట్టుకు చూసే సరికి, అప్పటికే ప్రాణం పోయింది. నేనే మీకు ఖబురు పెట్టమని చెప్పాను".

"మీరు ఇదివరకు ఇతన్నెరుగుదురా?" డాక్టరు గారిని ప్రశ్నించాడు.

"ఇలా వారంలో రెండు రోజులు బీదవాళ్ళకు భోజనం పెడుతుండటం చూశాను. అప్పుడప్పుడూ, నేను కూడా అన్నదానం కోసం అయిదారు వందలు అతనికి ఇచ్చి పంపిస్తుండే వాడిని. మొదట్లో ఒక సారి పేరూ, ఊరూ అడిగాను. తన పేరు రాఘవ రావనీ, ఊరు బందరనీ చెప్పాడు. అంతకంటే వివరాలు అతను చెప్పలేదు, నేను అడగనూ లేదు."

"సరే లెండి, అవసరం అయితే, మీరు ఒక సారి స్టేషనుకు రావాలి" అన్నాడు ఇనస్పెక్టరు.

"అలాగే" అని చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు.

కానిస్టేబులును పిలిచి, శవం పక్కనే వున్న చేతి సంచీ తెప్పించి చూశాడు. సంచిలో ఒక డైరీ తప్ప ఏమీ లేవు. ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీసాక, శవాన్ని పరీక్షకు పంపాడు. అక్కడ వున్న విలేఖర్ల ప్రశ్నలకు, "వివరాలు ఇంకా తెల్సుకోవాల్సి ఉంది. అతని పేరు రాఘవరావని మాత్రమే తెలుస్తోంది. పేపర్లో న్యూస్ వేస్తే, వివరాలేమైనా తెలుస్తాయేమో చూడాలి" జావాబు చెప్పి పంపేశాడు.

"ఈ సంచీ ఎవరైనా ఇంతక్రితం చూశారేమో కనుక్కో. ఈ సంచీని కూడా ల్యాబ్ కు పంపి, దీనిమీద వేలిముద్రలు ఎవరెవరివి ఉన్నాయో పరీక్ష చేయించు" కానిస్టేబులుకు చెప్పి, ఇనస్పెక్టరు డైరీ తీసుకుని స్టేషనుకు వచ్చేశాడు.

స్టేషనులో పనంతా చూసుకుని ఇంటికి వెళ్లేందుకు బయల్దేరాడు ప్రసాద్. బయటకు వచ్చాక, పొద్దుటి కేసులో శవం పక్కన చూసిన డైరీ గుర్తొచ్చింది. కానిస్టేబులుని పిలిచి, టేబుల్లో పడేసిన డైరీ తీసుకురమ్మన్నాడు. జీపు ఇంటికి చేరేలోగా ఒకసారి పేజీలన్నీ తిరగేశాడు. అతని పేరు, వూరు

తప్ప మరే విషయాలు రాసి లేవు. పేజీలన్నీ ఖాళీగానే వున్నాయి. మరి ఇలాంటి డైరీ ఎందుకు తెచ్చుకున్నాడో? డైరీ పక్కన పడేయబోతుంటే, అనుకోకుండా ఒక చోట బ్లాక్ ఇంకుతో ఏదో రాసి వుండడం గమనించి, వెంటనే ఆ పేజీ తెరిచాడు. యారో మార్కులతో కొన్ని అంకెలు కలిపి, చిత్రమైన రాత కనబడింది. 'ఇదేమిటో ఆలోచించాల్సిందే' అనుకుంటూ ఆ పేజీ దగ్గర మడత పెట్టి, డైరీ తన బ్యాగ్గులో పడేశాడు.

"ఎమ్మెల్యే గారూ!" పిలుపు విని మెట్లెక్కుతున్న సుదర్శన్ వెనెక్కి తిరిగి చూశాడు.

సర్పంచి వేణు మాధవ్ అతన్ని కలుసుకోవాలని గబగబా మెట్లెక్కి వస్తున్నాడు.

అతన్ని చూడగానే మొహం చిట్లించాడు సుదర్సన్.

సర్పంచిగా ఎన్నికైనది మొదలు, ఇతను నిధుల కోసమనో, మరొకటనో, తనని కలుస్తూనే వున్నాడు. వేణు మాధవ్ కుర్రాడు. ఏదో చెయ్యాలనే తపనతో వున్నాడు. తను ఎమ్మెల్యే ఎన్నికలో గెలవటానికి అతను చాలా వరకు కారకుడు. ఆ కృతజ్ఞత తోటే ఇన్నాళ్ళూ అతనికి మద్దతునిస్తూ వచ్చాడు.

అయితే, ఇప్పుడు పరిస్థితులు మారాయి. గత కొద్ది కాలంగా, తన అనుచరులు అతనికి సహాయం చెయ్యడంపై కినుకతో వున్నారు. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. వేణు మాధవ్ కున్న మంచి పేరును బట్టి, అపోజిషన్ పార్టీవాళ్ళు రేపు అతనినే తనకు పోటీగా నిలబెట్ట వచ్చు. ఇంకా అతనికి సపోర్టు ఇచ్చి నందువల్ల వూరిలో ఏ మంచి పని జరిగినా, అతని ఖాతాలోకే వెళ్ళే అవకాశం ఇచ్చినవారమవుతామని, తన అనుయాయులంతా ఒకటికి పదిసార్లు గోల చెయ్యడంతో సుదర్శన్ ఆలోచనలో పడ్డాడు.

ఈ సంవత్సరం వర్షాలకు, ఊరిలోని ప్రభుత్వ పాఠశాల ఆరోతరగతి గది గోడ నాని, కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయానికి స్కూలు వదిలేయడం వల్ల, ఎవరికీ ఏ హానీ జరగలేదు. గత కొన్ని నెలలుగా, వేణు మాధవ్ స్కూలు బాగు చెయ్యాలని నిధుల కోసం తనవెంట పడుతున్నాడు. ఆ నిధులు తనే శాంక్షను చేయించినట్లు ప్రజలలో బలంగా గుర్తింపు రావాలనీ, అందుకోసం కొంతకాలం పన్లు జరగకుండా ఆపాలని అతని శ్రేయోభిలాషులు నొక్కి చెప్పడంతో, సుదర్శన్ సర్పంచితో మునుపటి లాగా కలవడం లేదు.

బాగా దగ్గరికి వచ్చేదాకా అతన్ని చూడనందుకు అనుచరులపై చిరాకు పడ్డాడు సుదర్శన్.

ఇక తప్పదనుకున్నాడో ఏమో " ఏమయ్యా, వేణు , బాగున్నావా?" అడిగాడు మొహంపై చిరునవ్వు పులుకుని.

"తమరి దయ వల్ల బాగానే వున్నాను. మనూరి స్కూలు విషయం మీకు గుర్తు చేద్దామని..." అడిగాడు వేణు.

"నాకు గుర్తు లేకపోవడమేమిటి? దానికోసమే మొన్న విద్యా శాఖ మంత్రి గారి అపాయింట్మెంట్ తీసుకున్నాను కూడా".

"అయితే, మంత్రి గారికి మన స్కూలు విషయం చెప్పారన్నమాట!" ఉత్సాహంగా అడిగాడు వేణు.

"అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇంకేం? ఆ రోజు అపాయింట్మెంట్ సమయానికి ముందుగానే నేను వారి ఆఫీసుకు వెళ్ళి కూర్చున్నానా, మరో పది నిముషాల్లో వస్తారనగా, ముఖ్యమంత్రి గారి నుంచీ ఖబురు వచ్చింది, హడావుడిగా వెళ్ళిపోయారు. ఆ రోజు నుంచీ, ఇవాల్టి దాకా మళ్ళీ అపాయింట్మెంట్ దొరకలేదు. ఛ్! ఏం చేస్తాం! "

"సరే, కానివ్వండి మనం చెయ్యగలిగింది చెయ్యడమే! మరొక సారి ట్రై చెయ్యండి సార్!" బాధ పడుతూ అడిగాడు వేణు.

"అలాగే, నువ్వు నాకు చెప్పాలటయ్యా, అది నా బాధ్యత" అంటూ గబగబా ముందుకు వెళ్ళిపోయాడు సుదర్శన్. వేణు వంక వంకరగా నవ్వుతూ చూసి, ఎం ఎల్ ఏ ను అనుసరించారు అనుచరులు.

అతని చుట్టూ ఉన్న అనుచర వర్గంలోని వాళ్ళంతా అకారణంగా తనపై కత్తికట్టిన వాళ్ళే అవడంతో, ఇప్పుడు ఏం.ఎల్.ఏ. వెంట వెళ్ళినా ప్రయోజనం లేదని వెనక్కి తిరిగాడు వేణు.

**"జనార్ధనరావ్,**

ఇదే నా చివరి హెచ్చరిక! నువ్వు నీ తప్పు దిద్దుకోక పోతే, కుక్క చావు చస్తావు. నిన్ను ఎవడూ రక్షించలేదు.

**ఇట్లు**

ప్రపంచ పౌరుడు"

చదివి కాగితాన్ని అటూ ఇటూ తిప్పి చూశాడు ఇనస్పెక్టర్ నిశ్చల్. ఆ రెండు ముక్కలూ తప్ప మరేం రాసిలేదు ఆ కాగితంలో. ఉత్తరం తాలుకూ కవరును మరొక సారి పరీక్షించాడు. అడ్రసు నీటుగా టైపు చేసి వుంది.

"ఈ కవరు మీకు ఎవరిచ్చారు?" మళ్ళీ అడిగాడు.

"ఎవరో నా కిమ్మని ఇచ్చారంటూ ఒక కుర్రాడు తీసుకొచ్చి, ఇచ్చి పోయాడు. ఆ అబ్బాయేవరో నేనింత వరకూ చూడలేదు" జవాబిచ్చాడు జనార్ధనరావు.

జనార్ధనరావు ఆ వూరిలో ప్రముఖ వ్యాపారి. పోలీస్ కమీషనర్ గారికి మంచి స్నేహితుడు.

"ఇదే మొదటి సారా? లేక, అంతక్రితం కూడా ఇలాంటి హెచ్చరికలు వచ్చాయా?" అడిగాడు సర్కిల్ ఇనస్పెక్టర్ రఘువీర్, నిశ్చల్ అందించిన ఉత్తరం తెరిచి చూస్తూ.

"ఇది రెండోదండి! ఇంతక్రితం ఇలాంటిదే ఒక ఉత్తరం వచ్చింది. అయితే, ఎవడో పిచ్చాడు రాసిందని నేను లెక్కపెట్టలేదు" అంటూ తన జేబులోంచి మరొక ఉత్తరం తీసి ఇచ్చాడు.

రఘువీర్ ఆ ఉత్తరం కూడా పరీక్షగా చూశాడు. రెండింటిలో ఒకటే చేతి రాత. అంతకంటే, చెప్పుకోదగ్గ క్లూ ఏమీ దొరకలేదు. నిశ్చల్ అతని దగ్గర కంప్లైంట్ తీసుకున్నాడు. కమీషనర్ ఫోను చేసి, గట్టిగా చెప్పడంతో రఘువీర్ అతనింటికి కాపలా ఏర్పాటు చేయమన్నాడు.

"ఇద్దరు కానిస్టేబుల్సు మీ ఇంటి దగ్గర సెక్యూరిటీగా వుంటారు. ఈ ప్రపంచ పౌరుడ్ని పట్టుకునే దాకా, మీరు బయట ఊళ్లకు ఎక్కడికీ వెళ్ళకండి. మీకేం భయం లేదు, ఇక నిశ్చింతగా వుండండి" అని చెప్పి పంపేశాడు నిశ్చల్.

"ఏయ్, ఒన్ నాట్ టు అండ్ ఒన్ నాట్ త్రీ, మీ ఇద్దరి డ్యూటీ ఇవాల్టి నుండీ జనార్ధనరావు గారి ఇంటి దగ్గరే. నాకు ఎప్పటికప్పుడు అక్కడి విషయాలు చెప్పాలి. ఇది కమీషనరు గారి పర్సనల్ కేసు. జాగ్రత్త!" హెచ్చరించాడు రఘువీర్.

ఇనస్పెక్టర్ నిశ్చల్ వంక చూసి చెప్పాడు.

"నిశ్చల్, నేను రేపటి నుంచి సెలవులో వెడుతున్నాను. మా అబ్బాయి పెళ్ళి, నీకు తెలుసుగా? జనార్ధనరావు గారి విషయంలో కమీషనరు గారు ప్రత్యేకంగా చెప్పారు, జాగ్రత్తగా చూసుకో. ఏ కాస్త తేడా వచ్చినా కమీషనరు గారు ఫైర్ అవుతారు" హెచ్చరించి వెళ్ళిపోయాడు.

నిశ్చల్ తల ఊపి మళ్ళీ తన పనిలో పడ్డాడు. ఒకటి, రెండు దొంగతనం కేసులు ఎంక్వయిరీ చెయ్యాల్సి వుంది. వాటి గురించి కూడా పై నుంచీ ఫోన్లు వస్తున్నాయి. మళ్ళీ ఇప్పుడు ఇదొకటి. ఉన్న వాళ్ళలో ఇద్దర్ని డ్యూటీలో బయటకు పంపాలి. రేపు ఒక దొంగతనం కేసులో, దొంగను కోర్టులో హాజరు పరచాలి. అక్కడి తతంగం అయ్యాక మళ్ళీ స్టేషనుకు తీసుకొచ్చి లాకప్పులో పెట్టాలి. సూపరింటెండెంట్ ఆఫీసుకు ఫోన్ చేసి, పరిస్థితి వివరించి ఒక ఇద్దరు కానిస్టేబుల్సును పంపాల్సిందిగా కోరాడు. వాళ్ళు కొన్ని ప్రశ్నలడిగి, చివరికి సరే అన్నాక ఇంటికి భోజనానికి వెళ్ళాడు.

**ప్రసాద్ ఇంటికి** రాగానే భార్య రాగిణి ఎదురొచ్చి, కోపంగా "ఇవాళ చంటాడికి జ్వరం తగిలింది. మీకు ఎన్ని ఫోన్లు చేసినా స్టేషన్ లో లేరనే చెప్పారు. నేనే వెళ్ళి డాక్టర్ గారికి చూపించాను."

"అయ్యో అలాగా, ఎలా వుందిప్పుడూ?" ఆదుర్దాగా అడుగుతూ ఉయ్యాలలో పడుకున్న బాబు నుదిటిపై చెయ్యి పెట్టి చూశాడు. వేడిగా లేకపోయే సరికి, 'అమ్మయ్య' అనుకున్నాడు.

భార్య వైపు తిరిగి, "ఇవాళ ఒక చిత్రమైన కేసు తగిలింది. దాంతో రోజంతా సరిపోయింది" అంటూ ఆమెకు జవాబిచ్చుకున్నాడు.

“మీకు ఎప్పుడు పని లేదు కనుక? దేశంలో ఎక్కడేమి జరిగినా మీకే కావాలి” అంటూ మూతి తిప్పింది రాగిణి.

“లేదు రాగిణీ, ఇవాళ గుడి దగ్గర ఎవరో చచ్చిపడున్నారని కబురొస్తే అటు వెళ్లాను. ఎవరో బిచ్చగాడేమో అనుకున్నాను. కానీ, వారంలో రెండు రోజులు బీదవాళ్లకు అన్న దానం చేస్తుంటాడట. చేతి సంచీలో డైరీ కనబడితే చూశాను. డైరీ అంతా ఖాళీ. ఒక్క పేజీలో మాత్రం చిత్రమైన బొమ్మలు! అదేదో సింబాలిక్ గా వుంది కానీ, తమాషాకు రాసినట్లు లేదు” ఆలోచిస్తూ అన్నాడు ప్రసాదు.

“సర్లెండి, ముందు స్నానానికి లేవండి. స్నానం చేసి, భోజనం చేశాక, తీరుబడిగా దాన్ని గురించి ఆలోచిద్దురుగాని”.

ప్రసాదు మాట్లాడకుండా స్నానం చేసి, భోజనానికి వచ్చాడు. రాగిణి అతనికి కంచంలో అన్నం, కూరా వడ్డించి, తను కూడా వడ్డించుకునేంతలో, ఉయ్యాలలో బాబు లేచి ఏడవటం మొదలుపెట్టాడు. రాగిణి లేచి బాబుని ఎత్తుకుంది. పాలు పట్టి, మళ్ళీ ఉయ్యాలలో పడుకోపెట్టింది. అందాకా ప్రసాదు కంచంలో అన్నం కలుపుకోలేదు.

“అయ్యో, మీరు తినేస్తుండాల్సింది. ఎందుకాగారు? పొద్దున్న ఎప్పుడనగా తిన్నారో?” రాగిణి నొచ్చుకుంది.

“మరేం పరవాలేదులే. రాత్రి పూటన్నా ఇద్దరం కలిసి తిందాం” అంటూ ప్రేమగా చెప్పాడు.

రాగిణి తన కుర్చీ జరుపుకుని అతని పక్కనే కూర్చుంది.

భర్త ఏవో పాత కేసుల ఎలా పరిష్కరించిందీ చెబుతుంటే, మధ్య మధ్యలో తనకు తెలియని విషయాలు అడిగింది. ఇద్దరూ భోజనాలు పూర్తి చేశాక, రాగిణీ గిన్నెలు, కంచాలు తీసేసి శుభ్రం చేస్తుంటే, ప్రసాదు తన బ్యాగ్గు తీసి, ఆ డైరీ తిరగేశాడు. అంకెలు, గీతలతో ఉన్న ఆ చిత్రం వంకే పరీక్షగా చూశాడు. రాసి చూస్తే ఏదైనా క్లూ దొరకవచ్చేమో అని, ఒక తెల్ల కాగితంపై అదే బొమ్మలను గీశాడు.

అతను దాని వంకే దీక్షగా చూడడం చూసి, “మళ్ళీ మొదలు పెట్టారా, ఇంటికి వచ్చిన తర్వాతన్నా ఆఫీసు విషయాలు వదిలేసి, హాయిగా ఉండచ్చు గదా?” చేతులు తుడుచుకుంటూ వచ్చి అతని పక్కనే కూర్చుంది రాగిణి.

“ఈ బొమ్మ నీకేమైనా అర్థం అవుతుందేమో చూడు” కాగితం ఆమె చేతికిచ్చాడు. దానివంకే పరీక్షగా చూసింది రాగిణి.

“ఏమో, ఆ యారో మార్కులూ, ఆ అంకెల గోలేమిటో నాకేం అర్థం కావడం లేదు. దాని సంగతి రేపాలోచిద్దురుగాని, ఆకాగితం అవతల పడేసి, పడుకోండి. పొద్దుపోయింది” ఆవులిస్తూ చెప్పింది రాగిణి.

ప్రసాదు ఆ కాగితంపట్టుకుని దాని వంకే పరీక్షగా చూశాడు. ఆ బొమ్మ చూస్తూనే పడుకున్నాడు. పడుకున్నాడన్నమాటే గానీ, అతని కళ్ళలో అవే బొమ్మలు కదలాడుతున్నాయి. రాగిణీ ఒకసారి లేచి, అతనికేసి చూసింది.

“ఇంకా పడుకోలేదా?” అడుగుతూ, బాబు పక్క బట్టలు మార్చి, మళ్ళీ పడుకుంది రాగిణి.

కచ్చితంగా ఆ రాఘవరావేదో చెప్పదలుచుకునే అలా రాసి ఉండొచ్చు. అది రహస్యంగా ఉంచాల్సిన విషయమై ఉండాలి. అయితే, అతనికి తను ముందే చనిపోతాడని తెలుసా? ఎవరైనా చంపుతారని భయపడ్డాడా? అంటే, ఎవరైనా బెదిరించి ఉంటారా? అతని వివరాలు అసలేమీ తెలియకుండా, ఈ కేసు ఎలా పరిశోధించాలి?

బందరులో పోలీసులకు అతని వివరాల కోసం రాస్తే? వాళ్లకు కూడా తేలికగా వివరాలు దొరుకుతాయా? ఆ పట్టణంలో రాఘవరావులు ఎంతమంది ఉన్నారో, అందరిలో ఇతనెవరో తెలుసుకోవడం కష్టమే. ఏమైనా ప్రయత్నించి చూడడంలో తప్పులేదు. పేపరు న్యూస్ ఇచ్చినా, సమాచారం దొరకలేదు. చాలా సేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు ప్రసాదు. ఎప్పుడో తెల్లవారుఝామున అతనికి నిద్ర పట్టింది.

రెండ్రోజుల తర్వాత, "సాహితి మనింటికి డిన్నరుకు వస్తుంది. తనకు కూడా వంట చెయ్యి" ఫోనులో చెప్పాడు ప్రసాదు.

రాగిణి ఫోను పెట్టేసి, ఫ్రిజులో కూరలు ఏం వున్నాయో చూసింది. సాహితికి దొండకాయ కూర కారం పెట్టి చేస్తే ఇష్టం. దొండకాయల కోసం వెనక వీధిలో దగ్గరే ఉన్న కూరల బడ్డీకి వెళ్ళి, అర కిలో దొండకాయలు, దోసకాయలు, పచ్చి మిరపకాయాలు కొన్నది. దొండకాయ కారం పెట్టి వేయించింది. సాంబారు పెట్టి, చట్నీ చేద్దామనుకునేంతలో, బాబు లేచి ఏడవటం మొదలుపెట్టాడు. ఇక చట్నీ ఆలోచన వదిలేసి, వాడికి నీళ్ళు పోసి, పౌడర్ అద్ది, చొక్కా తొడిగింది. తను కూడా స్నానం చేసి, తయారయ్యిందో లేదో, కాలింగు బెల్లు మోగింది. తలుపు తీసేసరికి ప్రసాదు, అతని వెనకే సాహితి ఇంట్లోకి వచ్చారు.

సాహితి, ప్రసాదు కన్నా ముందే ఇనస్పెక్టరుగా చేరింది. సర్కిల్ ప్రమోషన్ వచ్చి ట్రాన్స్ఫర్ కావడంతో, ఇంటిలో కుదరక ఉద్యోగం మానేసింది. పిల్లల ఆలనా పాలనా చూసేందుకు ఇంట్లో నౌకర్లు ఉన్నా, వాళ్ళ మీద వదిలేయడం ఆమెకు ఇష్టంలేక పోయింది. ఆమె భర్తకు తమిళనాడులో తేయాకు తోటలున్నాయి. నెలలో ఇరవై రోజులు అక్కడే ఉంటాడు. పది రోజులు మాత్రం ఇంటికి వచ్చి, ఇంటి వ్యవహారాలూ, లెక్కలు చూసుకుని మళ్ళీ వెళ్ళిపోతాడు. అతను ఇంట్లో ఉండేది తక్కువ కావడంతో ఉద్యోగం చేస్తూ, పిల్లలను చూసుకుంటూ అవస్థ పడే బదులు, మానేసి మంచిపని చేశా నంటుదామె.

చాలా తెలివైనదనీ, "లా" కూడా చదవుకున్నదని ఆమెకు డిపార్ట్మెంటులో మంచి పేరు. పిల్లలు హై స్కూలు చదువులకు వచ్చాక, ప్రైవేటు డిటెక్టివుగా ప్రాక్టీసు మొదలుపెట్టింది. రిస్కుతో కూడుకున్నదని ఆమె భర్త వద్దని చెప్పినా, తనకు పోలీసు ఉద్యోగానుభవం వుండటం వల్లా, ఆ పరిచయాలవల్లా మరేం భయపడాల్సిన అవసరం లేదని నచ్చ చెప్పింది.

ప్రసాదుకు, మరికొందరు తనతో చేసిన ఇనస్పెక్టరులకు, కేసులు పరిష్కరించడంలో సాహితి సహాయ పడుతుంటుంది. అలాంటి సమయాల్లో, ప్రసాదు ఆమెను తమ ఇంటికి పిలిచి, కేసు గురించి ఆమెతో చర్చిస్తాడు. కొన్ని సమయాల్లో రాగిణి కూడా వాళ్ళ సంభాషణలో పాల్గొంటుంది. తను మరొక విధంగా అపార్థం చేసుకోకుండా వుండడం కోసమే ప్రసాదు ఆమెను ఇంటికి రమ్మంటాడని రాగిణి అర్థం చేసుకుంది.

భార్యాభర్తల మధ్య దాపరికాలు అపార్థాలకు దారి తీస్తాయని అతని నమ్మకం. అతనలా చెయ్యడం రాగిణికి కూడా నచ్చింది.

"హడావుడి పడుతున్నావేమో, నేను కాస్త సాయం చేద్దామని మీ వార్ని తొందరపెట్టి లాక్కొచ్చాను" నవ్వుతూ చెప్పింది సాహితి.

రాగిణి నవ్వేసింది. "మీ కిష్టమైన దొండకాయ కూర చేసి, సాంబారు పెట్టానో లేదో, వీడు లేచి కూర్చున్నాడు. దోసకాయ పచ్చడి చేద్దామనుకున్నాను, చెయ్యనిస్తేనా?" అంది బాబుకు పాలు పట్టి పడుకోపెడుతూ.

“పోనిలేత్తూ, కూరా, సాంబారు ఉంటే ఇంకా ఏం కావాలి? అసలు బాబుతో గడపడమే గొప్ప ఆనందం. ఆ సంతోషాన్ని మించింది ఏముంటుందీ?” అంటూ బాబును ఎత్తుకుంది సాహితి.

“రాగిణి, త్వరగా వంట పూర్తి చెయ్యి. భోజనాలు కానిచ్చి, మేము కేసు గురించి చర్చించాలి” తొందర పెట్టాడు ప్రసాదు.

“చాల్లే, ఇంకా ఏం వండాలేమిటి? నువ్వేం చెయ్యకు రాగిణీ, ఉన్నవి చాలు. కాస్తాగి తిందాం, తొందరేం లేదు. ఈ లోగా విషయం ఏమిటో వివరంగా చెప్పవయ్యా” నవ్వుతూ అంది.

ప్రసాదు జరిగిందంతా పూసగుచ్చినట్లు ఆమెకు చెప్పాడు.

“ఏదీ, ఆ డైరీ నన్ను చూడనీ. ఏమీ రాయని డైరీ అతనెందుకు వెంటపెట్టుకుని తిరుగుతున్నట్లు?” అడిగింది సాహితి.

అక్కడే ఉన్న టేబుల్ పైన డైరీ కోసం వెతికాడు ప్రసాదు. టేబుల్ సొరుగు లాగి చూశాడు.

“ఇదేమిటి, డైరీ ఇక్కడే పెట్టానే, ఏమైంది? రాగిణీ, నువ్వేమన్నా తీశావా?” అడిగాడు ప్రసాదు.

“నేను దాని వంకే చూడలేదు. మీరు వెళ్ళాక , బాబుకు పాలు పట్టి, వాడ్ని పడుకోపెట్టి, నేను కూడా కాసేపు పడుకున్నాను. మీ ఫోను విని, లేచాను” జవాబిచ్చింది రాగిణి.

“ఏమైనట్లు? అదేమీ ప్రషర్ వచ్చే కేసు కాదు, అందుకే నేను కూడా ఈ రెండు రోజులు ముఖ్యమైన కేసులుంటే అవి అటెండు అయ్యాను. అందులో ఏదో రహస్యం ఉందనిపిస్తోంది. ఆ కోడ్ ఏమిటో ఆలోచిద్దామని ఇక్కడే పెట్టాను. నేను ఆఫీసుకు తీసుకెళ్ల లేదు” ఆలోచిస్తూ అన్నాడు.

“అవునూ, దొండకాయలు వండాలంటే బండ చాకిరి అంటూ వద్దన్నావని మొన్న కూరలు తెచ్చేటప్పుడు తేలేదు. ఇప్పుడు ఎక్కడి నుంచీ వచ్చాయి?” అడిగాడు వెంటనే.

“బాబు నెత్తుకుని, ఇంటి వెనక బడ్డీ కొట్టుకు వెళ్ళి, కూరలు కొన్నాను. ఏం, ఏమిటలా అడుగుతున్నారు?” ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

ప్రసాదు తల పంకించాడు.

“బహుశా నువ్వు ఇంటి పక్కనే కదాని, తలుపు దగ్గరకేసి వెళ్ళి ఉంటావు. డైరీ అవసరం ఎవడికో వుండి ఎత్తుకు పోయాడు”.

“అమ్మో, దొంగాడా? పోలీసుల ఇళ్ళకేసి దొంగలు రారన్నారు కదండీ?”

“వీడు దొంగ కాదు. అంతకు మించిన వాడు”.

“నీ బుర్ర బాగానే ఆలోచిస్తోంది. సరే, వాడెవడో తర్వాత చూద్దాం, ముందు ఆ డైరీలో ఉన్న రహస్యం ఏమిటో ఎలా కనుక్కోవాలి? చేతిలో ఉన్న క్లూ కాస్తా పోయింది కదా?” అడిగింది సాహితి.

“లేదు, సాహితి. నేను ఆ బొమ్మ ఒక కాగితం మీద గీసి చూశాను, ఏదైనా క్లూ దొరుకుతుందేమోనని. ఇక్కడే ఉండాలా కాగితం” అంటూ దిండు కింద వెతికి, కాగితం బయటకు తీశాడు.

అతని మోహంలో చిరునవ్వు చూసి, “చూశావా, ఏదో మామూలుగా చేసిన పని ఎలా ఉపయోగపడిందో?” నవ్వింది సాహితి.

‘అమ్మయ్య, మొగుడి తిట్లు తప్పాయి, అయినా ఇక నుంచీ జాగ్రత్తగా ఉండాలి బాబూ’ అనుకుంది రాగిణి.

“సరే, భోజనాలు చేసేద్దామా? మరో గంటలో మా చిన్నవాడు సుజిత్ ఇంటికి వచ్చేస్తాడు” చెప్పింది సాహితి.

సుజిత్ సాహితి రెండో కొడుకు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజి అయిపోగానే, క్లబ్బుకు వెళ్ళి, అక్కడ టెన్నిస్ ఆడుకుని వస్తాడు. పెద్దబ్బాయి అవినాష్ అమెరికాలో ఎం.ఎస్.చేస్తున్నాడు.

రాగిణి తొందరగా భోజనాలు వడ్డించింది. సాహితి, ప్రసాదు, రాగిణీ ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు పూర్తి చేసే సరికి తొమ్మిదయ్యింది.

“ఇక నేను బయల్దేరుతాను, రాగిణీ. నీ వంట అద్భుతం. అందుకే మీ ఆయనకో షరతు పెట్టాను. నా సహాయం కావాలంటే, రాగిణి చేతి వంట తింటే కానీ చెయ్యనని” నవ్వుతూ చెప్పింది సాహితి. రాగిణీ, ప్రసాదు ఇద్దరూ నవ్వేశారు.

ప్రసాదు లేచి మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు. రాగిణికి బై చెప్పి సాహితి ప్రసాదు వెనక బండి ఎక్కి కూర్చుంది.

“ఈ కాగితం నేను తీసుకుంటున్నాను. దీని మర్మం ఏమిటో ఆలోచిస్తాను. తెలియగానే, నీకు ఫోన్ చేస్తాను. అన్నట్లు ఆ రాఘవరావు మరణం గురించి పేపర్లో వేయించావా? అతని కోసం ఎవరైనా రావడం కానీ, ఫోను చెయ్యడం కానీ జరిగిందా? పోస్టుమార్టం ఏమని వచ్చిందీ?” ఇంటి దగ్గర దిగిపోతూ అడిగింది సాహితి.

ప్రసాదు “ పేపర్లో వేయించాను. ఇంతవరకు ఎవరూ అతన్ని గురించి ఎంక్వయిరీ చెయ్యలేదు. రిపోర్టు వచ్చింది. అతని మరణం మాసివ్ హార్ట్ ఎటాక్ వల్ల వచ్చిందని రిపోర్టులో ఇచ్చారు. సో, అతనిది హత్య కాదు.” చెప్పాడు.

“సాహితీ, ఆ బొమ్మ వివరం ఏమైనా తట్టిందా?” రెండ్రోజుల తర్వాత స్టేషనుకు వచ్చిన సాహితిని అడిగాడు ప్రసాదు.

“లేదు. అసలు దాన్ని గురించి ఆలోచించే వీలు కుదరలేదు”.

కాసేపు ఆ క్లూ ఏమి ఉండవచ్చో ఇద్దరూ ఆలోచించారు. ఇంటి నెంబరు కావచ్చు. ఏదైనా పుస్తకంలో పేజీ కావచ్చు. “ఖైదీ నెంబరు కూడా కావచ్చు” నవ్వుతూ అన్నాడు ప్రసాదు. సాహితి తల ఊపింది.

“మా ఇంటికి పోదాం. రాత్రి భోజనం చేసి వెడుదువుగాని”.

“ఇంకా నయం. నేను ఇంటికి వెళ్ళాలి. సుజిత్ ఇవాళ టెన్నిసుకు వెళ్ళడం లేదు. రాగిణీ చంటిపిల్లాడితో పనిచేసుకోవాలి! అది గుర్తుంచుకో. ఇలా మాటిమాటికి భోజనానికి పిలిస్తే, మీ ఆవిడ నిన్నూ, నన్నూ కలిపి తిట్టుకుంటుంది. నేను బయల్దేరుతాను” చెప్పింది సాహితి.

సాహితి ఇంటికి వచ్చేసరికి, సుజిత్ ఇంకా కాలేజీ నుంచి రాలేదు. టీ కలుపుకుని తాగింది. ప్రసాద్ ఇచ్చిన కాగితం తీసుకుని, ఆ బొమ్మల అంతరార్ధం ఏమై ఉంటుందాని ఆలోచించింది

కాసేపు కంప్యూటర్లో సీక్రెట్ కోడ్సు ఏవైనా దొరుకుతాయేమోనని వెతికింది. ఉన్న వాటిలో ఏది సరిపడ లేదు. ఒక వేళ మిలిటరీ సీక్రెట్ కోడ్ ఏమైనానా? ఏమో మిలిటరీ కోడ్ కూడా కావచ్చు.

అనుకోకుండా కీ బోర్డు వంక చూసింది సాహితి. ఒకసారి చేతిలో కాగితం వంక పరీక్షగా చూసింది.

ఒక వేళ మొదటి అంకెలన్నీ కీ బోర్డు మొదటి వరుసలో ఉన్న అంకెలనుకుంటే, మరి యారో పక్కనా, కింద కూడా అంకెలే వున్నాయే? కీ బోర్డులో మొదటి వరుస అంకెల తర్వాత మూడు వరుసలున్నాయి. అవన్నీ అక్షరాలే కానీ, అంకెలు కావు.

సాహితి మరోమారు కాగితం వంక జాగ్రత్తగా చూసింది. మొత్తం ఆరు అంకెలు, వాటి కింద వరుసగా ఆరు బాణం గుర్తులు, బాణం గుర్తుల పక్కనే ఆరు అంకెలూ వున్నాయి. అంటే, ఆరు అక్షరాల మాట సూచిస్తున్నాయా? బాణం గుర్తులన్నీ కింది వైపుకే వున్నాయి. మొదట ఒక అంకె, దాని కిందనే యారో మార్కు వుంది. యారో మార్కు పక్కనే ఒక అంకె, కింద మరొక అంకె వున్నాయి. అన్ని యారోల పక్కనున్న అంకెలు 1 గానీ,2 గానీ, 3 గానీ వున్నాయి. కీ బోర్డులో మొదటి అంకెల వరుస వదిలేస్తే, దానికింద అక్షరాల వరుసలు కూడా మూడున్నాయి. యారో పైన వేసిన నెంబర్లు కీబోర్డులో మొదటి వరుసలో ఉన్న నెంబర్లు అనుకుందాం. కింద వేసిన యారో పక్కన ఉన్న అంకె ఎన్నో వరుస అక్షరమో సూచిస్తున్నదా?

మొదటి అంకె 9 అంకె కింద చూసింది. యారో పక్కనే అంకె 2. అంటే, రెండో వరుస అవవచ్చు. అయితే, కీ బోర్డులో 9 కింద 2 వ వరుసలో రెండు అక్షరాలు K,L కనిపిస్తున్నాయే? ఏది తీసుకోవాలి?

సాహితి మరొక పేపరు తీసుకుని రెండు అక్షరాలూ వేర్వేరు గడులలో రాసింది.

బొమ్మలో రెండో సారి గూడా 9 రాసివుంది. దాని కింద యారో, యారో పక్క1 వేసి వుంది. అంటే, 9 కింద ఉన్న మొదటి వరుసలో I,O రెండింటిని తీసుకుని, ఇందాకటి K కింద I, L కింద O రాసింది.

మూడో అంకె 4. దానికింద యారో, పక్కనే 3. కీ బోర్డులో 4 కింద 3 వరుసలో చూసింది. X, C తీసుకుంది. వాటిని రెండు గడులలో రాసింది.

**తర్వాత అంకె** 8.దాని కింద యారో. యారో పక్కనే 2 వేసివుంది. అంటే 8 కింద రెండో వరుస. రెండో వరుసలో ఉన్న J, K లను రెండు గడులలో రాసింది.

ఒక సారి రెండు గడులను చూసింది.

| | |
|---|---|
| K | L |
| I | O |
| X | C |
| J | K |

మొదటి గడిలో అక్షరాలు అర్ధవంతంగా లేవు. రెండో గడి లో లాక్ (తాళం) సూచిస్తోంది. అయితే, బొమ్మలో ఇంకా రెండు అంకెలు, యారో మార్కులు వున్నాయి. బహుశా పూర్తి మాట లాకర్ అయివుండవచ్చు. అయినా, ఆ మిగిలిన రెండు కూడా డీకోడ్ చేస్తే నిర్ధారణ అవుతుంది. సాహితి మిగిలిన రెండు అంకెలు చూసింది. 3 అంకె, దానికింద యారో, ఆపక్కనే 1 వుంది. అంటే, W,E అన్న మాట. ఆ రెంటిని చెరొక గడిలో వేసింది. చివరగా 4 అంకె, దానికింద యారో, ఆపక్కనే 1. అంటే 4 కింద ఒకటో వరుసలో ఉన్న అక్షరాలూ E,R. వాటిని చెరొక గడిలో రాసింది.

ఇప్పుడు రెండు గడులలో ఉన్న అక్షరాలూ చూసేసరికి మొదటి గడిలో అక్షరాలూ పూర్తిగా అర్ధం లేకుండా వున్నాయి. రెండవ గడిలో లాకర్ అని వచ్చింది.

| | |
|---|---|
| K | L |
| I | O |
| X | C |
| J | K |
| W | E |
| E | R |

అయితే, తను డీకోడ్ చేసింది ఎంత వరకు కరెక్టో ఎలా తెలుస్తుంది? మరొక సారి బొమ్మ వంక చూసింది సాహితి. బొమ్మకు ఒక పక్కగా 112 అంకె వేసి వుంది. అంటే, అది తప్పక లాకర్ నెంబరు అయివుండాలి. ఆ నిశ్చయానికి రాగానే, సాహితి వెంటనే ప్రసాదుకు ఫోన్ చేసింది.

"మీరు ఎన్ని సార్లు తిరిగినా, మీకు సహాయం చేసే ఉద్దేశ్యం ఏం.ఎల్.ఏ. గారికి ఏ కోశానా లేదు, వేణు గారూ! నా మాట నమ్మండి" అన్నాడు సుబ్రహ్మణ్యం. సుబ్రహ్మణ్యం పంచాయితీ ఆఫీసు సెక్రటరీ.

పెద్ద చదువులు చదువుకుని, చేస్తున్న మంచి వుద్యోగం వదులుకుని, తమ పల్లెటూరుకు వచ్చి, ఇక్కడి పరిస్థితుల్ని బాగుచెయ్యాలని తాపత్రయ పడుతున్న వేణు అంటే, సుబ్రహ్మణ్యంకు వల్లమాలిన అభిమానం ఏర్పడింది. వేణు పంచాయితి ప్రెసిడెంటు అయిన రోజే, తను కూడా చేతనైనంత వరకూ వూరు అభివృద్ధికి పాటుపడాలని అతను నిర్ణయించుకున్నాడు.

"మరేం చేద్దామంటావో చెప్పు?నాకేం తోచడం లేదు. అసలు ఆయనకు నేను చేసిన అపకారం ఏమిటి? ఆయన ఏం.ఎల్.ఏ. ఎన్నికల్లో గెలిచేందుకు నేను సహాయపడ్డాను కదా" నిరుత్సాహం తొంగి చూసింది వేణు గొంతులో.

"మీరు అలా నిరుత్సాహ పడకండి. ఇలాంటివి మన దేశంలో మామూలే. మీరెక్కడ తనకు పోటీ అవుతారో అన్నదే ఆయన భయం. మీరు ఎన్నిసార్లు పదవులపై ఆశ లేదని అన్నా, ఆయన చుట్టూ చేరిన వాళ్ళు నమ్మరు, ఆయన్నూ నమ్మనీయరు. చెయ్యాలని పట్టుదల వుంటే, మనం ఏదైనా సాధించగలం. నాకు తోచిన సలహా చెబుతాను, వినండి. మనమే చందాలు వేసుకుని, డబ్బులు సేకరించి, ఆ గోడ కట్టించెయ్యడం ఒక పద్ధతి".

"అలా చేస్తే, మనం ఆయన చేతగానితనం వేలెత్తి చూపిస్తున్నామని అనుకోవచ్చు. మనపై ద్వేషం పెంచుకోవచ్చు" అన్నాడు వేణు.

"నిజమే, ఆయన అనుకోకపోయినా, చుట్టూ చేరిన వాళ్ళు నూరిపోస్తారు. మన దగ్గర డబ్బుంటే, మనమే చెయ్యడం మంచిది. అలా అయినా ఆయనకు కోపం రావచ్చు. అయినప్పటికీ, పోనిలే, తన డబ్బే ఖర్చు పెట్టుకున్నాడు, మనదేం పోయిందని కొంత సమాధాన పడవచ్చు. ఇక మూడవ మార్గం సరాసరి విద్యాశాఖ మంత్రి గారి వద్దకు వెళ్ళి ఆయన్నే రిక్వెస్ట్ చెయ్యడం. అప్పుడు మనం ఏం.ఎల్.ఏ. గారికి శత్రువులుగా మారడం ఖాయం. అలా చెయ్యడం అంత మంచిది కాదేమో. మీపై కక్షతో ఆయన ఏమైనా చెయ్యవచ్చు".

"నన్నేమైనా చేస్తాడేమోనన్న భయం నాకేం లేదుగానీ, ఒక గోడ కట్టడం కోసం ఆయనతో విరోధం అనవసరం. ఇలా చిన్న చిన్న కారణాలతో ఆయన గ్రామాభివృద్ధికి అడుగడుగునా అడ్డు తగిలి, ఆటంకాలు కలిగించడం నాకు ఇష్టం లేదు. అదీగాక, ఈ ఊరికి ఏదైనా మంచి చెయ్యాలన్నదే నా ఉద్దేశ్యం గానీ, ఆయనతో పోటి పడటం కానీ, విరోధం తెచ్చుకోవడం గానీ, నాకు అసలు ఇష్టం లేదు. నువ్వు చెప్పినట్లు, నా డబ్బులు ఖర్చు పెట్టి, ఈ గోడ కట్టిస్తాను. అప్పుడు ఆయనకు మనపై అంత కోపం రాకపోవచ్చు".

"ఒక వేళ కోపం వచ్చినా, మీరు సర్ది చెప్పవచ్చు. స్కూళ్ళు తెరిచే రోజులు దగ్గర పడ్డాయి. మళ్ళీ వానాకాలం మొదలైతే, ఆ గోడలన్నీ పూర్తిగా పడిపోతాయని నా డబ్బుతోటి కట్టించేశానని అనవచ్చు".

"సరే, వచ్చే ఆదివారం నేను ఊరు వెడతాను. గోడ పూర్తిగా పడగొట్టి, కట్టడానికి ఎంత ఖర్చు అవుతుందో మన మేస్త్రి చేత లెక్క వేయించు. వచ్చాక కావాల్సిన డబ్బు సర్దుబాటు చెయ్యవచ్చు. నా సొంత డబ్బు పెట్టి కట్టిస్తున్నానని ఇప్పుడే ఎక్కడా బయటకు రాకూడదు సుమా!"

"అలాగే, వేణు గారు. మన పని పూర్తి అయ్యేదాకా, మీ పేరు ఎట్టి పరిస్థితుల్లోనూ బయట పెట్టను. మీరు నిశ్చింతగా వుండండి".

"ఇక్కడ నాకున్న ముఖ్య స్నేహితులు ఇద్దరే ఇద్దరు. ఆ ఇద్దరూ సుబ్రహ్మణ్యం పేరు గలవాళ్ళే. మీ ఇద్దర్నీ నమ్మకుండా ఎలా వుంటాను?" చెప్పాడు వేణు.

సుబ్రహ్మణ్యం ఆప్యాయంగా వేణు చేతిలో చెయ్యి వేశాడు.

"మి లార్డ్, నా వాదనను ఫైనల్ గా ముగించే ముందు ఈ కేసు వివరాలు ఒకసారి పూర్తిగా తమ ముందు ఉంచేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రార్థిస్తున్నాను" ప్రాసిక్యూటర్ శ్రీహరి, జడ్జి గారి వంక చూశాడు.

"పర్మిషన్ గ్రాంటెడ్" అన్నారు జుడ్జి గారు.

ప్రాసిక్యుటర్ ఒక సారి గొంతు సవరించుకున్నాడు. "సుబ్రహ్మణ్యం అనబడే ఈ ముద్దాయి కృష్ణా జిల్లాలోని దోడబెట్ట గ్రామ పంచాయితీ సెక్రటరీ. సుమారు నాలుగేళ్ళుగా అక్కడే పనిచేస్తున్నాడు. అందుకు నిదర్శనంగా ఎగ్జిబిట్ P –2 మీకు సమర్పించబడింది. అందువల్ల, ఆ పంచాయతీ ఆదాయ, వ్యయాలు, పంచాయతీ వ్యవహారాలూ, అన్నీ అతనికి పూర్తిగా కొట్టిన పిండి. హతుడు వేణు మాధవ్ అమెరికాలో తాను చేస్తున్న ఉద్యోగం వదిలేసి, దొడబెట్ట గ్రామానికి మంచి చెయ్యాలన్న సద్బుద్ధితో వచ్చాడు. వేణు మాధవ్ మంచితనం, మానవతా దృక్పదం, ఆ వూరి స్కూలు హెడ్ మాస్టరు ఇచ్చిన స్టేట్మెంట్ చదవితే మనకు అర్థం అవుతుంది మి లార్డ్! ఇది తమరికి ఎగ్జిబిట్ P –3 గా సబ్మిట్ చేయడం జరిగింది. ఈ స్టేట్మెంట్ ఒకసారి చదవటానికి పర్మిషన్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను".

జడ్జి గారు 'పర్మిషన్ గ్రాంటెడ్' అనగానే, పబ్లిక్ ప్రాసిక్యుటర్ తన దగ్గర కాపీ తీసి చదవడం ప్రారంభించాడు.

"వేణు గోపాల్ సర్పంచ్ కాకపూర్వం మా స్కూల్లో ఉచితంగా పిల్లలకు చదువు చెప్పేవాడు. వాళ్ళ కోసం మోరల్ క్లాసులు తీసుకునేవాడు. అతను బీదవిద్యార్థులకు బట్టలు, పుస్తకాలు కొని ఇచ్చేవాడు. ప్రభుత్వం మధ్యాన్న బోజన పథకం మొదలుపెట్టక పూర్వమే, వేణు మా స్కూల్లో, పిల్లలకు ఉడకబెట్టిన గ్రుడ్డు, పాలు ఉదయం పూటా, మధ్యాన్నం భోజనమూ పెట్టేవాడు. పిల్లలు ఉన్నత ఆశయాలతో, మానవీయ విలువలతో పెరిగి, మన దేశానికి వన్నె తేవాలన్న సంకల్పం అతనిది. దాని కోసమే పాటుబడిన మనిషి అతను. సర్పంచ్ అయినా కూడా, వారానికి మూడు రోజులు పిల్లలకు చదువు చెబుతుండేవాడు. ఇతని లాంటి గొప్ప మనిషిని, ఉన్నతమైన ఆశయాల కోసం పాటుబడేవాడినీ, నేనింతవరకూ చూడలేదు. హత్య జరిగిన రోజు రాత్రి కూడా పది గంటల దాకా వూరు బాగు గురించీ, వచ్చే విద్యా సంవత్సరంలో చెయ్యాల్సిన పనుల గురించీ నాతో మాట్లాడుతూనే వున్నాడు. మా ఇంట్లో భోజన చెయ్యమని బలవంతపెట్టినా, పొద్దున్న చేసిన చపాతీలు వున్నాయని ఆ పూటకు అవి చాలని చెప్పి, పది దాటిన తర్వాత ఇంటికి వెళ్ళిపోయాడు. అర్థరాత్రి అయ్యేసరికి అతని మరణ వార్త వినాల్సి వచ్చింది. చాలా దురదృష్టం. అలాంటి మనిషిని కోల్పోయి, మా ఊరు చాలా నష్ట పోయింది."

ఎంతో మంచి వాడని అందరిలోనూ పేరు తెచ్చుకున్న హతుడు వేణు మాధవ్ సుమారు రెండేళ్ళ క్రితం ఆ గ్రామానికి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైనాడు. ఇతనికి పూర్వం, ప్రస్తుత ఏం.ఎల్.ఏ. ఆ ఊరికి సర్పంచిగా వుండేవారు. ఇది గ్రామ పంచాయితీ రికార్డుల నుంచీ గ్రహించిన డేటా ఎగ్జిబిట్ P -4 . వేణుమాధవ్ సర్పంచిగా ఎన్నికైన దగ్గర నుంచీ పంచాయితీ సెక్రటరీ సుబ్రహ్మణ్యం మీద ఆధారపడుతూ వచ్చాడు. కారణం, హతుడు ఒక కంప్యుటర్ ప్రొఫెసర్, టీచింగ్ సైడు ఉన్న వ్యక్తి. పంచాయితీ వ్యవహారాలు, రాజకీయాలు, ఏమాత్రం తెలియని వాడు. ఎప్పుడైతే వేణు మాధవ్ నిజాయితీ పరుడని, కల్లాకపటం ఎరుగని మనిషనీ, తెలిసిందో, అప్పటి నుంచీ ముద్దాయి సుబ్రహ్మణ్యం ఎంతో అణకువ, మంచితనం ప్రదర్శించి హతుడికి దగ్గరైనాడు. అయితే, హతుడి ముక్కుసూటి తత్త్వం, నిజాయితీ, అన్యాయాన్ని సహించ లేకపోవడం, ముద్దాయికి నచ్చలేదు. పంచాయితీ నిధుల్లో మూడు లక్షల వరకూ దుర్వినియోగం జరిగిందని గ్రహించిన వేణుమాధవ్, ఇతన్ని నిలదీశాడు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి, పంచాయితీ అధికారులు ఇచ్చిన అఫిడవిట్ ఎగ్జిబిట్ P -5 మీముందు సమర్పించడం జరిగింది. వేణు మాధవ్ ఉంటే, తను చేసే అక్రమార్జనలకు అడ్డం అని అంతకు ముందునించే అనుకుంటున్న ముద్దాయి, ఇక తన ఆటలు సాగవని గ్రహించి, వేణుమాధవును చంపడానికి ప్లాను వేశాడు. అర్ధ రాత్రి తర్వాత, సర్పంచి నిద్రపోతున్న ఇంటి తలుపులు గొళ్ళెం పెట్టి, పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఇతని కుట్ర తెలియక, ఆదమరిచి నిద్రపోతున్న వేణుమాధవ్ మంటలలో చిక్కుబడి, బయటకు రాలేక అక్కడే కాలి, చనిపోయాడు. ఆ విధంగా ఈ సమాజం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయింది. ముద్దాయిని హత్యా స్థలంలో పట్టుకోవడం జరిగింది. ఆ హడావుడిలో ముద్దాయి పాంటు చివర కొద్దిగా కాలింది, మసి బారింది కూడా. ముద్దాయి ఆరోజు తన లూనా బండి నిండా పెట్రోల్ కొట్టించుకుని, విడిగా క్యానులో మరో పది లీటర్ల పెట్రోల్ కొన్నట్లు బంకు కుర్రాడి సాక్ష్యంతో పాటు, కాలి మసిబారిన పాంటు– ఎగ్జిబిట్సు P -6,7 గా మీకు సమర్పించడమైంది. హతుడి డెత్ సర్టిఫికేట్, పోస్టుమార్టం రిపోర్టు ఎగ్జిబిట్ P-8,9 గా మీకు సమర్పించడమైనది. "ఎంబజిల్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఫండ్స్" నేరం రుజువవటంతో సి.ఆర్.పి.సి సెక్షన్ 409 కింద, ఐ.పి.సి. సెక్షన్ 300 కింద పోలీసు వారు ఫైల్ చేసిన ఎఫ్.ఐ .ఆర్. ఎగ్జిబిట్ P -1 గా మీకు సమర్పించడం జరిగింది.

మిలార్డ్, ఈ విధంగా ప్రిప్లాన్డు మర్డర్ చేసిన ఈ ముద్దాయి కోల్డు బ్లడెడ్ మర్డరర్. ఇతనికి ఐ. పి. సి. సెక్షన్ 302 కింద కఠినంగా శిక్షి విధించాలని కోరుతున్నాను" వాదన ముగించి కూర్చున్నాడు ప్రాసిక్యుటర్.

"డిఫెన్సు లాయరు గారు చెప్పేది ఏమైనా ఉందా?" ప్రశ్నించారు జుడ్జి గారు.

"నో, మీ లార్డ్, ముద్దాయిపై దయ చూపాలని మాత్రం నేను ప్రార్ధిస్తున్నాను".

"ముద్దాయి చెప్పుకోవాల్సినది ఏమైనా ఉందా?" సుబ్రహ్మణ్యం వంక చూస్తూ ప్రశ్నించారు జుడ్జి గారు.

"జుడ్జి గారు, ఈ నేరం నాపై రుద్దారు. నాకేం తెలియదు సర్! సర్పంచి గారికి ఏమైన్దోనని నేను వారింటికి పరిగెత్తుకు వెళ్ళాను. నేనే ఇంటికి నిప్పంటించి, ఆయన్ను చంపానని నాపై కేసు పెట్టారు. మా పంచాయితీ లెక్కలు కూడా సరిగా వున్నాయి. కిందటేడు జరిగిన ఆడిట్ లో మా గ్రామ పంచాయితీకి సర్టిఫికేట్ కూడా వచ్చింది. ఆఫీసు రికార్డులన్నీ ఎవరో తారుమారు చేసారు. నేను ఏ పాపమూ ఎరుగను" చెప్పాడు సుబ్రహ్మణ్యం గుడ్ల నీరు కక్కుకుంటూ.

“నో, మి లార్డ్ ! ఒక వేళ అటువంటి సర్టిఫికేట్ వుంటే, డిఫెన్సు లాయరుగారు మీకు సమర్పించి ఉండేవారు. ఇతనిపై ఆరోపణ వచ్చిన తర్వాత ఆడిట్ చేసిన పంచాయితీ అధికారులు, లెక్కలో తేడా వున్నట్లు తమ రిపోర్టులో తెలిపారు. ఇతను చెప్పేదంతా నిజం కాదు. అంతే కాదు, ఈ ముద్దాయి హతుడికి వంగి వంగి నమస్కారాలు పెట్టేవాడని, ఇతను మేక వన్నె పులి అని తాము ఎన్నో సార్లు హెచ్చరించినా సర్పంచి వినలేదని, వూరిలో ఇద్దరు పెద్ద మనుషులు ఇచ్చిన వాగ్మూలం మీకు సమర్పించడం జరిగింది” ప్రాసిక్యూటర్ శ్రీధర్ లేచి చెప్పాడు.

“ప్రభుత్వ నిధులకు సరైన లెక్కలు చూపించకపోవడం, సొంతానికి వాడుకోవడం నేరం. అంతే కాక, ముద్దాయి తనకు అడ్డం వస్తున్నాడని సర్పంచి వేణుమాధవ్ ను చంపినట్లు ప్రసిక్యూషను వారు సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టారు. డిఫెన్సు లాయరు గారు ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు చూపించలేక పోయినందువల్లా, ప్రాసిక్యూషన్ వారు ప్రవేశ పెట్టిన ఆధారాలు పరిశీలించిన మీదట, ముద్దాయి పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసి, అడ్డు వస్తున్నాడని సర్పంచి వేణు మాధవును చంపినట్లు రుజువైంది. ముద్దాయికి ఐపిసి సెక్షన్ 302 కింద యావజ్జీవ కారాగార శిక్ష విధించడమైనది” జడ్జి గారి తీర్పు విని, సుబ్రహ్మణ్యం బోనులో కుప్పకూలిపోయాడు.

జైల్లో ఒక గోడ మూలకు వాలిపోయాడు సుబ్రహ్మణ్యం. జరిగిందంతా ఒక కలలా వుంది అతనికి. తన జీవితం ఇలా జైల్లో ముగిసి పోవాలని రాసిపెట్టి వుంది కాబోలు. ఆలోచించిన కొద్దీ అతనికి దుఖం ముంచుకొస్తోంది.

పొద్దున్న తన భార్య, మామగారు, పిల్లలిద్దర్నీ తీసుకు వచ్చారు. భార్య దుఖం చూస్తున్నకొద్దీ, తనకూ దుఖం ఆగలేదు.

మామగారు, తీర్పుపై హై కోర్టులో అప్పీల్ చేస్తున్నామని, భయపడవద్దని ధైర్యం చెప్పాడు. అక్కడ ఏం జరుగు తుందో, ఏం తీర్పు వస్తుందో తెలియదు. ఒకవేళ అక్కడ కూడా ఇదే తీర్పు వస్తే?

తనకు జీవిత ఖైదు ఖాయం అయితే, తన భార్యా, ఇద్దరు పిల్లల గతేమిటి? వాళ్ళు వీధిన పడతారు. ఆమె పుట్టింటి వాళ్ళు కొంతవరకూ ఆదుకోగలరేమో కానీ, పిల్లలు పెరిగి పెద్దయ్యేదాకా చూడాలంటే జరిగేపనేనా? ఈ ఊరికి ట్రాన్స్ఫర్ అయినపుడు, మొదట తన భార్య ఇష్టపడలేదు. అంతక్రితం ఉన్న వూరు ప్రశాంతంగా, హాయిగా వుంది. పట్నంకి దగ్గర కూడా. తనే కొన్ని రోజులు ఇక్కడ పనిచేస్తే, ప్రమోషన్ వచ్చే అవకాశం ఉంటుందని ఒప్పించాడు. ఇప్పుడు ఏకంగా ఈ నరకానికి ప్రమోషన్ వచ్చింది. తను ఎవరికీ అపకారం చెయ్యలేదు. మరి తనపైన, వేణు గారి పైనా ఎవరు, ఎందుకు ఇంత కక్ష ఎందుకు పెంచుకున్నారో అర్థం కావడం లేదు. ఇదంతా ఏం.ఎల్.ఏ. గారి కనుసన్నలలో జరిగిందేమోనని అనుమానంగా వుంది. ఆయన దగ్గర పనిచేసిన అనుభవం వుండటంతో, అతను ఇంత దారుణానికి వొడిగడతాడని తను అనుమానించలేదు. ఆయన కాకపోతే, మరెవరికి ఇలా చేసే దమ్ముంది? ఇంకెవరినీ అనుమానించే అవకాశమే కనిపించడం లేదు. ఈ కుట్ర అంతా ఒక ప్లాను ప్రకారం జరిపించారు. పాపం, ఎక్కడినుంచో వచ్చి, వేణు గారు, వూరు బాగు కోసం అన్యాయంగా బలి అయిపోయారు. అసలు వేణు గారిని ఇంత అకస్మాత్తుగా చంపుతారని తను ఊహించలేదు. శత్రువులు దెబ్బకొట్టాలని కాచుకున్నారని తను ఊహించాడు. ఆయనను ముందరే హెచ్చరించాడు కూడా. అయినా ఆయన ఏనాడు లెక్కపెట్టలేదు. ఆయనలాంటి మంచి మనిషికి ఇలా దారుణమైన చావు వస్తుందని అనుకోలేదు. తను మాత్రం? ఈ రాజకీయ చదరంగంలో బలిపశువు కాలేదూ? ఆ వేణుగారితో కలిసి ఉండకపోతే, తనకీ దిక్కుమాలిన అవస్థ వచ్చేది కాదేమో. అసలు ఆయన పరిచయమే ఒక విచిత్రంగా జరిగింది.

ఏదో పని మీద హెడ్ మాస్టర్ గారి కోసం, ఒక రోజు తను స్కూలుకు వెళ్ళాడు. అక్కడ వేణుమాధవ్ ని చూశాడు.

“హెడ్ మాస్టారు గారూ, నా పేరు వేణు మాధవ్. మీరు వేణు అని పిలవవచ్చు. నేటి విద్యార్ధులకు అవసరమైన కొన్ని నైతిక విలువల గురించి, జీవితంలో ఉన్నత ఆశయాలను సాధించుకోగల సామర్ధ్యం అలవరచుకోవడం గురించి , ఆర్ధిక అవసరాల నియంత్రణ గురించీ, పాఠశాలలో క్లాసులు తీసుకుని చెప్పాలని వచ్చాను. చిన్న వయసులోనే వాళ్లకు మార్గ నిర్దేశం చేసినందువల్ల, ఒక ఆశయంతో బాగా చదువుకుంటారు. చదువుకున్న పిల్లలు, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమర్ధులైన యువకులుగా పెరుగుతారు. వాళ్ళ వల్ల సమాజానికి కూడా మేలు జరుగుతుంది. నిజాయితీ పరులు, సమర్ధులైన యువకులు సమాజానికి, దేశానికీ ఇప్పుడు చాలా అవసరం. ఈ నూతన సమాజ నిర్మాణంలో మీరు నాకు చేయూతనిస్తే, మనం ఇక్కడి నుంచే ఈ ఆశయాన్ని అమలు చేద్దాం. దీన్నొక ఉద్యమంగా ఊరూరా పాకిద్దాం. మీరు అనుమతిస్తే, నేను మీ స్కూల్లో రేపటి నుంచీ మీరు తీసుకోమన్న టైముకు క్లాసు తీసుకుని చెబుతాను”.

హెడ్ మాస్టరు సుబ్రహ్మణ్య శర్మ తలెత్తి అతని వంక పరీక్షగా చూశాడు. అతన్ని కూర్చోమన్నట్లు సైగ చేశాడు. మనిషి చూస్తే సాదాసీదాగా ఉన్నాడు. జీన్సు ప్యాంటూ, టీషర్టు వేసుకున్నాడు. పెద్దంత వయసు ఉన్నట్లు లేదు. కళ్ళజోడు వల్ల అతనికి సైటు ఉన్నట్లు తెలుస్తోంది. చదువుకున్న వాడి లాగానే ఉన్నాడు.

“మేము చదువుకునే రోజుల్లో మా హైస్కూల్లో మోరల్ సైన్సు క్లాసులు ఉండేవి. అవి ఎప్పుడో తీసేశారు. ఆ తర్వాత దాన్ని గురించి పట్టించుకున్న నాధుడే లేడు. ఇప్పుడు మీరు అకస్మాత్తుగా ఎక్కడి నుంచో వచ్చి, ఏవో మోరల్ క్లాసులు తీసుకుంటానంటే నేనెలా అనుమతివ్వ గలను? అసలు మీరెవరు, ఎక్కడి నుంచీ వచ్చారు? మీరు ఏం చదువుకున్నారు? మీరు చెప్పే పాఠాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంటే, నా నెత్తి మీదకు వస్తుంది. అందువల్ల మీ వివరాలు, మీ ఉద్దేశాలు, లేదా ఆశయాలు సరిగా చెప్పండి. అప్పుడు నేనేదైనా చెయ్యగలనేమో ఆలోచిస్తాను” నిదానంగా చెప్పాడు.

అతను చిరునవ్వు నవ్వి, తన జేబులోంచి విజిటింగ్ కార్డు తీసి ఇచ్చాడు.

“**ప్రొఫెసర్ వేణు** మాధవ్, ఎం. ఏ. ఎం. ఎస్.సి.,, పి హెచ్ డి. విజిటింగ్ ప్రొఫెస్సర్ , స్టాన్ ఫర్డ్ యునివర్సిటీ” పైకి చదివి ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం. ఆ కార్డు హెడ్ మాస్టర్ శర్మకి ఇచ్చాడు.

“ఇంకా మీకు నమ్మకం కలగకపోతే, నా పి. హెచ్. డి. సర్టిఫికేట్ చూడండి” అంటూ తన బ్యాగ్గులోంచి ఖరగ్పూర్ ఐ.ఐ.టి లో పి.హెచ్.డి. చేసిన సర్టిఫికేట్, దానితో పాటు అక్కడే చదివిన ఎం.ఎస్.సి సర్టిఫికేటు రెండూ తీసి చూపించాడు.

శర్మ ఒక్కసారి తబ్బిబ్బయాడు. లేచి నుంచుని, “మీలాంటి వారు మాదగ్గరికి వచ్చి, పని చేస్తాననటమే అదృష్టం. ప్రభుత్వ పాఠశాలలో మేము ఎంత బాగా చదువు చెప్పినా, అదేమిటో స్కూలుకు మంచి పేరు అంత తేలికగా రాదు. అలాంటిది మీ అంతట మీరు వీళ్ళను మంచి పౌరులుగా తీర్చి దిద్దుతానంటే, మాకు కావాల్సిందేముంది? నేను మీకు చెప్పే వాడిని కాదు కానీ, మీరు ఏం చెప్పదలుచు కున్నారో ఒకటి రెండు క్లాసులు చూసి గానీ, మీకు రెగ్యులరుగా చెప్పేందుకు అనుమతివ్వలేను. మీరు ఎంత ఉచితంగా చెప్పినా, నా పరిమితులు నాకున్నాయి”.

“అలాగే, మీకు నమ్మకం కుదిరాకే నాకు పర్మిషన్ ఇవ్వండి” నవ్వుతూ చెప్పాడు.

“ఇప్పుడే క్లాసు తీసుకుంటారా?” అడిగాడు శర్మ.

“అలాగే, నేనెప్పుడూ రెడియే” అన్నాడు వేణుమాధవ్.

“అది సరే, మీకు తలుచుకుంటే గొప్ప ఉద్యోగం పిలిచి ఇస్తారు. ఇంత పెద్ద చదువు చదువుకుని, మీరు ఈ పల్లెటూరుకు వచ్చి, ఇక్కడ పాఠాలు చెప్పాలని ఎందుకు అనుకున్నారు?” క్లాసు అయిపోయాక బయటకు వస్తున్న వేణుని అడిగాడు సుబ్రహ్మణ్యం.

హెడ్ మాస్టర్ శర్మ కూడా అవునన్నట్లు సమాధానం కోసం వేణు వంక చూశాడు.

“శర్మ గారూ, నేను సంపాదన కోసం రాలేదు. నేను ఒంటరి వాడిని. నాకు కావాల్సిన దానికన్నా ఎంతో ఎక్కువ సంపాదించుకున్నాను. దేశం కోసం ఏదైనా చెయ్యాలని అనిపించి, చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇక్కడికి వచ్చేశాను” చెప్పాడు వేణు.

“మీకు ఇక్కడికే రావాలని ఎందుకనిపించింది? అవును, మీరు ఇంకా పెళ్ళి చేసుకోలేదా?” ఆశ్చర్యంగా అడిగాడు సుబ్రహ్మణ్యం.

“ఈ ఊరు మా ముత్తాత గారు నివసించిన ఊరని చిన్నప్పుడు మా అమ్మ చెప్పింది. అందుకే ఈ ఊరుకు వచ్చాను. ఇక పెళ్ళంటారా, మనుషుల మధ్య అనుబంధాలు, అనురాగాలూ మృగ్యం అయిపోతున్న ఈ రోజుల్లో, పెళ్ళి అనేది ఒక సినిమా సీన్ లాగానే అనిపిస్తుంది నాకు. అందుకే పెళ్ళి వద్దనుకున్నాను” వేణు నవ్వుతూ చెప్పాడు.

అలా మొదలైన పరిచయం, ఆ ముగ్గురి మధ్యా స్నేహానికి దారి తీసింది. అప్పుడప్పుడూ ముగ్గురూ కలుసుకుని చదువుల గురించి, రాజకీయాల గురించి మాట్లాడుకునేవారు.

ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. అప్పటిదాకా సర్పంచిగా ఉన్న సుదర్శన్ అధికార పార్టీ తరఫున ఏం.ఎల్.ఏ.గా పోటీ చెయ్యడంతో, సుబ్రహ్మణ్యం ఆయన తరఫున ప్రచారం చెయ్యక తప్పలేదు. ఊళ్ళో వేణు మాధవుకు ఉన్న మంచి పేరు చూసి, సుదర్శన్ అతన్ని పిలిపించి, తన వైపు ప్రచారం చెయ్యమని కోరాడు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తాడన్న ఆశతోనూ, అతని పై ఆరోపణలు కూడా ఏమీ లేకపోవడంతోనూ, వేణు ప్రచార బాధ్యత తన భుజాలపై వేసుకుని, ఊరూరా, ఇంటింటా తిరిగి ప్రచారం చేశాడు. దాని ఫలితంగా అవతలి వ్యక్తి చిత్తుగా ఓడిపోవడం, సుదర్శన్ పెద్ద మెజారిటీతో గెలవడం జరిగింది.

చివరకి సుదర్శన్ తన పదవి కాపాడుకునేందుకు ఎంతకు తెగించాడంటే, అతని గెలుపుకు కారణమైన వేణుగారిని, తనని కూడా బలిపెట్టాడు. రాజకీయం ఎంత క్షుద్రమైనదో, తలచుకుంటేనే చీదర పుడుతోంది అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

“సాహితీ, మన సూపరింటెండెంట్ ఆఫీసు నుంచి బందరు సూపరింటెండెంట్ ఆఫీసుకు ఫోను చేయించాను. బందరులో ఉన్న అన్ని బ్యాంకులకు ఇన్ఫర్మేషన్ పంపించాను. రాఘవరావు పేరుతో ఏదైనా లాకర్ ఉన్నా లేక, 112 నెంబరు లాకర్ ఉన్న కస్టమరు పేరు రాఘవరావు అయినా వెంటనే నాకు కబురు చెయ్యాలని నోటీసు పంపించాను. పంపికూడా వారం రోజులయ్యింది. ఇంత వరకూ ఎలాంటి సమాచారం రాలేదు” చెప్పాడు ప్రసాదు సాహితితో.

"బ్యాంకులకు మన ఇన్ఫర్మేషన్ సరిగా చేరిందో లేదో? ఒక వేళ ఆ మనిషికి బందరు బ్యాంకులలో లాకరు లేకపోయిుండ వచ్చు. లేదా, లాకరు ఆ పేరుతో ఉండకపోవచ్చు".

"నేనే పర్సనల్ గా వెడదామని అనుకుంటున్నాను. రేపు సూపరింటెండెంట్ ఆఫీసు నుంచీ ఇనస్పెక్టర్ సంతోష్ వస్తున్నాడు, రెండ్రోజులు డెప్యుటేషన్ పైన. నేనే ప్రతి బ్యాంకుకు వెళ్ళి స్వయంగా వెరిఫై చేస్తే, తొందరగా తేలవచ్చు. ఈ కేసు మొదటి నుంచీ సస్పెన్సే. తొందరగా దీని సంగతి తేల్చాలి".

"నువ్వు ఎలాగూ వెడుతున్నావు కనుక, బందరు చుట్టు పక్కల బ్యాంకులలో కూడా వెరిఫై చెయ్యి. అక్కడ కూడా లేకపోతే, లేకపోవచ్చు. అయినా నిరాశ పడకూడదు. మన ప్రయత్నం మానకూడదు. ఎందుకైనా మంచిది, ఇక్కడ బ్యాంకులకు కూడా నోటీసు ఇవ్వబోయావా?" సలహా ఇచ్చింది సాహితి.

" ఆ లాకరు ఇక్కడ ఉంటుందంటావా?"

"ఏమో చెప్పలేం. ఇది నా అనుమానం కూడా కావచ్చు. ఏదైనా ప్రయత్నించి చూడటంలో తప్పు లేదు. అన్నట్లు ఈ రహస్యా న్వేషణలో మనకు పోటి వున్నారు. జాగ్రత్త!" హెచ్చరించింది.

మర్నాడు సాయంత్రం ఫోన్ చేశాడు ప్రసాదు "నేతబట్టలు రాట్నాలపై తయారు చేసే పెదన వుంది! రాత్రయ్యింది కదా, చిలకలపూడి పాండురంగడి గుడి పగలే చూడాలి".

"ఏదైనా ముఖ్యంగా బాగుంటే ఫోటోలు తియ్యి. నీకు ఆల్బంలో పెట్టుకుంటానికి బాగుంటుంది. వచ్చేటప్పుడు ప్రసాదం వదలకుండా తీసుకురా" సాహితి వెంటనే జవాబిచ్చింది.

మర్నాడు పొద్దున్న పదిగంటల కల్లా, ప్రసాదు బ్యాంకుకు వెళ్ళాడు. అప్పటికే మేనేజరు గదిలో సూటూ బూటు వేసుకున్న వ్యక్తి కూర్చుని ఉన్నాడు. ప్రసాదును చూస్తూనే, మేనేజరు ఎదురుగ ఉన్న కస్టమర్లకు తగిన సమాధానం చెప్పి పంపేశాడు.

తనముందు కూర్చున్న ఆ పెద్ద మనిషిని పరిచయం చేస్తున్నట్లుగా, "వీరే రాఘవ రావు గారు. లాకర్ 112 వీరిదే!" అని చెప్పాడు.

"మిస్టర్ ఇనస్పెక్టర్, నా లాకర్ ఆపరేట్ చెయ్యనివ్వద్దన్నారట. కారణం చెబుతారా?" కోపంగా అడిగాడాయన.

"ఒక కేసులో మాకు ఈ లాకర్ 112 గురించి తెలిసింది. అందువల్ల, ఆపరేట్ చెయ్యనివ్వద్దని పై నుంచి ఆర్డర్స్ వచ్చాయి. వివరాలు తెలుసుకునేందుకు, నేను బయల్దేరి వచ్చాను"

"మీరు ప్రభుత్వోద్యోగి కనుక మీ పనికి మేము అడ్డు రాకూడ దంటారు. కానీ, అర్థం లేని కోడ్ లు, కాగితాలు పట్టుకుని మమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టమని మీకు ప్రభుత్వం అధికారం ఇచ్చిందా? వాట్ నాన్సెన్స్ యు ఆర్ టాకింగ్? మీమూలంగా ముఖ్యమైన మీటింగు కాన్సిల్ చేసుకోవాల్సి వచ్చింది. ఐ విల్ రిపోర్టు టు యువర్ ఐ.జీ."

ఉలిక్కిపడటం ప్రసాదు వంతయ్యింది.

“రాఘవరావు గారు మా పాత కష్టమరు. దామోదర్ ఇండస్ట్రీస్ చైర్మను, ఊళ్ళో ప్రముఖ వ్యక్తి. చాలా సంస్థలు ఈయన దాతృత్వంతో నడుస్తున్నాయి. దాదాపు ఇరవై ఏళ్ల నుంచీ వారికి ఇక్కడ లాకరు వుంది. నిన్న సాయంత్రం ఫోను చేసి, ఆయన భార్య వచ్చి లాకరు ఆపరేట్ చేస్తారనీ, బ్యాంకు లాకర్లు తెరిచే టైం చెప్పమంటే, నేను మీరు పంపిన ఆర్డరు గురించి చెప్పాను. ఊరు వెళ్ళాల్సిన ఆయన, ప్రయాణం కాన్సిల్ చేసుకుని, ఇక్కడికి వచ్చారు” మేనేజరు వివరించాడు.

“మిస్టర్ ప్రసాద్, ఎక్కడో, ఏదో ఒక నెంబరు చూసి, అది నా లాకరే అయివుంటుందని నిర్ధారణకు ఎలా వచ్చారు? మీరు లాకరు స్వంతదారుని గురించి వివరాలు అడిగారా? అది తెలుసుకోకుండా లాకరు తెరవడానికి అడ్డం పడితే, అది నా పనులకు ఆటకం కలిగించినట్లు కాదా? నా పనికి భంగం కలిగించే హక్కు మీకు ఎవరిచ్చారు? నో, ఐ యాం నాట్ గోయింగ్ టు లీవ్ ఇట్ !” కోపంగా అన్నాడు రాఘవ రావు.

ప్రసాదు గొంతు సవరించుకున్నాడు. “ఇక్కడ జరిగిన విషయాన్ని మీకు వివరంగా చెప్పాలి. మేము ముందు నోటీసులు ఇచ్చినప్పుడు ఏ బ్యాంకు నుంచీ మాకు ఇన్ఫర్మేషన్ రాలేదు. వారం రోజులు వెయిట్ చేసి, నేను బయల్దేరి వచ్చాను. ఈ ఊళ్ళో బ్యాంకులన్నీ వెరిఫై చేసుకుంటూ, మీ బ్యాంకుకు వచ్చేసరికి సాయంత్రం అయిపోయింది. మీ మేనేజరు ‘స్ట్రాంగ్ రూం క్లోజ్ చేసి అందరూ వెళ్ళిపోయారు, ఇక పొద్దున్న బ్యాంకు తెరిచాక చూడాల్సిందే’ అని చెప్పారు. అందుకే నేను రాత్రి ఆగిపోయి, ఇప్పుడు వచ్చాను. నేను వచ్చి లాకరు వివరాలు తెలుసుకునే లోపల, మీరు ఏదేదో మాట్లాడుతున్నారు” అన్నాడు ప్రసాదు. మేనేజరు వెంటనే కల్పించుకున్నాడు.

“రాఘవరావు గారూ, మీకు నేను క్షమాపణలు చెబుతున్నాను. మీరు మాకు వాల్యుబుల్ కష్టమరు. మీ ప్రయాణం ఆపినందుకు నన్ను క్షమించండి. ఇందులో ఇనస్పెక్టరు గారి తప్పేమీ లేదు. అనుకోకుండా అలా జరిగింది. ప్లీజ్, మాపై దయవుంచి, ఈ విషయాన్ని ఇద్దరూ ఇంతటితో వదిలెయ్యండి” అంటూ రాఘవరావు చేతులు పట్టుకున్నాడు మేనేజరు.

రాఘవరావు, ఇనస్పెక్టర్ ఇద్దరూ కూల్ అయ్యారు.

రాఘవరావు “సరే, ఇనస్పెక్టర్ గారూ, ఇక నేను లాకరు ఆపరేట్ చేసుకోవచ్చా? మేము 20 సంవత్సరాల నుండీ ఈ బ్యాంకు కస్టమర్లం. లాకరు కూడా దదాపు అప్పటి నుంచీ వుంది. మీరు చెప్పే ఆ రాఘవరావు ఎవరో నాకు తెలియదు” అన్నాడు ప్రసన్నంగా.

ఇనస్పెక్టర్ ”ఓ .కే. రాఘవరావు గారు, మీకు ఇబ్బంది కలిగించినందుకు వెరీ సారీ” చెప్పాడు.

“ఇదిగో, అలా జరిగింది సాహితి నా ఇన్వెస్టిగేషన్! మళ్ళీ మొదటికి వచ్చాం!” ఫోన్లో నిరాశగా చెప్పిన ప్రసాదు మాట విని నవ్వింది సాహితి.

“ఇంత మాత్రానికే డల్ అయిపోతే ఎలానోయ్! ఆ పేరుతో ఆ నెంబరు లాకరు వుండటం యాదృశ్చికం అయి ఉండచ్చు. అసలు, ఆ చనిపోయిన వ్యక్తి పేరు రాఘవరావు కాదేమో?”

"అవవచ్చు. అంతే కాదు, మనం మాట్లాడుకున్నది ఎవరో విని, నన్ను ఫాలో అయినట్లు అనిపిస్తోంది. నేను బ్యాంకులోకి వెళ్ళిన వెంటనే ఒకతను లోపలకి వచ్చి, మేము కనబడేటట్లు బయట కూర్చున్నాడు. నాకు, ఆ రాఘవరావుకు మధ్య చర్చ అయినాక నేను బయటకు వచ్చాను. అతని మోహంలో చిరునవ్వు కనిపించినా, నేను అనుకున్న పని కాకపోవడంతో, ఆ విసుగులో అతన్ని పెద్దగా పట్టించుకోలేదు. నేను బయటకు వచ్చాక, ఎందుకో వెనక్కి తిరిగి చూసేసరికి, నా వెనకే అతనూ  వెళ్ళిపోయాడు. ఇప్పుడనిపిస్తోంది, అతనే మన శత్రువు"

"ఎప్పుడయితే మీ ఇంట్లో డైరీ ఎత్తుకు పోయాడో, అప్పుడే అర్ధమయ్యింది ఈ కేసు అనుకున్నంత సింపుల్ కాదని. రేపు పొద్దున్న  నేను ఆఫీసుకు వస్తాను" చెప్పింది సాహితి.

"ఓ.కె., సాహితి  బై" ఫోన్ పెట్టేసాడు ప్రసాదు.

"సార్, నేను పి.సి.ఒన్నాట్ టు సార్, జనార్ధనరావు గారి ఇంటి దగ్గర  డ్యూటిలో ఉన్నాను"

"ఓ నువ్వా! ఇవాళ  ఏమిటీ పరిస్థితి ? అంతా బాగుందిగదా?"

"ఎస్ సార్, అంతా బాగానేవుంది సార్. అనుమానించదగ్గ  మనుషులు కానీ, పరిస్థితులు కానీ ఈ రెండు రోజుల నుంచీ ఏమీ కనిపించలేదు సార్!"

"ఓకే! రేపటి నుంచీ నిశ్చల్ కు ఫోన్ చెయ్యి. నేను హడావుడిగా ఉన్నాను. కాసేపట్లో బయల్దేరుతున్నాం పెళ్ళికి.  ఒక నాలుగు రోజులు దాకా బిజీగా వుంటాను" ఫోను పెట్టేశాడు సి.ఐ. రఘువీర్.

ఒన్నాట్ త్రీ సుబ్బయ్య తన కూతురికి జ్వరంగా ఉందని ఇవాళ సెలవు పెట్టాడు. దాంతో డ్యూటీలో స్వామినాధం ఒక్కడే అయిపోయాడు. బయటకు వెళ్ళి భోజనం చేసి, అప్పుడే తిరిగి వచ్చాడు. శీతాకాలం కావడంతో రాత్రి తొమ్మిది  గంటలకే చలి వేస్తోంది. బయట గేటు మూసి, లోపలివైపు గొళ్ళెం వేశాడు. వరండాలో అరుగు మీద దుప్పటి పరుచుకుని కూర్చున్నాడు. ఒక దమ్ము లాగితే కానీ ఈ చలి బాధ తగ్గదని, సిగరెట్ తీసి నోట్లో పెట్టుకున్నాడు.

ఇంతలో ఒక కారు స్పీడుగా మూసిన గేటు తలుపులు తోసుకుంటూ, లోపలికి దూసుకువచ్చింది. కారులో ఇద్దరు  ముసుగు వ్యక్తులు వుండటం గమనించి, స్వామినాధం  తుపాకి గురిపెట్టేలోపలే, వెంట వెంటనే నాలుగు గుళ్ళు అతని వైపు దూసుకు వచ్చాయి. ఒకటి అతని నోట్లో సిగరెట్ ఎగరగొడితే, మరొకటి అతని భుజంలోంచీ, ఇంకొకటి చాతిలో నుండీ,  నాల్గవది తలలోంచి దూసుకుపోయాయి. స్వామినాధం అమాంతం కుప్ప కూలిపోయాడు.

"పేపర్" అంటూ పేపరు కుర్రాడు విసిరేసిన ఆంధ్ర జ్యోతి పేపరు తీసుకుని చూసింది సాహితి. పెద్ద హెడ్డింగుతో పేపరు మొదటి పేజీలో "ప్రముఖ వ్యాపారి జనార్ధనరావు మరణం, ముందుగా హెచ్చరించిన హంతకుడు" అంటూ రాసిన వార్త పూర్తిగా చదివింది సాహితి. ఇంతలో సెల్ ఫోను మోగటంతో అందుకుని, "ఆ ప్రసాద్ చెప్పు!" అంది.

“సాహితీ ఇవాళ పేపరు చూశావా? జనార్ధనరావు గారిని ఎవరో కాల్చి చంపారు!”చెప్పాడు ప్రసాదు.

“ఇప్పుడే చూశాను” జవాబిచ్చింది సాహితి.

“మన కేసుకీ, దీనికి సంబంధం ఉండచ్చంటావా?” అడిగాడు ప్రసాదు.

“ఏమో, వివరాలు పూర్తిగా తెలిస్తేగాని చెప్పలేం. అయినా నేను విజయవాడ వెడదామని అనుకుంటున్నాను” చెప్పింది సాహితి.

“ఓకే. నువ్వు కల్పించుకుంటే అది తెలిపోయినట్లే. ఇది కూడా అలాగే తేల్చేయ గలవు” అన్నాడు ప్రసాదు.

“ఒకొక్క పొగడ్తకు ఒకొక్క పట్టు చీర డిమాండ్ చేస్తాను” నవ్వుతూ చెప్పింది సాహితి.

విజయవాడ కమీషనరు ఆఫీసు. ఇనస్పెక్టర్ నిశ్చల్, కానిస్టేబుల్ సుబ్బయ్యలను జనార్ధనరావు హత్య జరిగిన రోజే సస్పెండ్ చేయడం జరిగింది. ఎక్స్ ప్లనేషన్ రాసిచ్చి వెళ్ళి పోబోతున్న కానిస్టేబుల్ సుబ్బయ్య, అప్పుడే ఆఫీసులోకి వస్తున్న సాహితిని చూసి, పరుగున ఆమె దగ్గరికి వెళ్ళాడు.

“అమ్మా, మీరే నన్ను రక్షించాలి. జనార్ధనరావు గారి ఇంటిదగ్గర ఆయనకు ప్రొటెక్షన్ కోసం నాకూ, స్వామినాధంకూ డ్యూటీ వేశారు. హత్య జరిగిన రోజు మాఅమ్మాయికి జ్వరంగా ఉండటంతో నేను సెలవు పెట్టాను. సెలవ పెట్టానని సస్పెండ్ చేశారు. మూడు రోజుల నుంచీ జ్వరం అమ్మాయికి. ఇంట్లో మా ఆవిడ, మూడు రోజుల నుంచీ పిల్లకి జ్వరం కాస్తున్నా పట్టించుకోకుండా డ్యూటీకి పోతున్నానని గోల. తెలిసిన డాక్టరు కు చూపించి ఆయనిచ్చిన మందులు వాడినా కూడా తగ్గలేదు. ఇక తప్పనిసరై సెలవు పెట్టానమ్మా. అప్పటికి మూడు రోజుల నుంచీ జ్వరంగా ఉందన్న సంగతి మా స్వామిగాడికి తెలుసు. కానీ ఇప్పుడు వాడే లేకపోయే. పిల్లలు గలవాడిని, మీరే నన్ను కాపాడాలి.” కనీళ్ళు పెట్టుకున్నాడు సుబ్బయ్య.

“అలాగే, నీకు సాయం చేస్తాను. ముందు నేను కమీషనరు గారిని కలుసుకోవాలి. సారున్నారా?”అడిగింది సాహితి.

“మీరు వెళ్ళండి మేడం, మీకు అడ్డేముంది?’ అంటూ కమీషనర్ గారి రూం స్వింగ్ డోర్ తెరిచాడు సుబ్బయ్య.

“సార్, మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యడం లేదు గదా?’ అంటూ లోపలి ప్రవేశించింది సాహితి.

“ఓ, సాహితీ, రామ్మా, రా! డిస్టర్బెన్స్ ఏమీ లేదు. నిజానికి ఇప్పుడు నువ్వు సమయానికి వచ్చావు. ఈ జనార్ధనరావు గారి హత్య గురించి నువ్వు పేపర్లో చదివే ఉంటావు. దాని గురించే ఇప్పుడు ముఖ్య మంత్రీ గారి దగ్గర నుంచీ ఫోను! అసలే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. అప్పోజిషను వాళ్ళు దీనిపై రభస చేసేలా వున్నారు, హంతకులను త్వరగా పట్టుకోవాలని ఆర్డరు! వాళ్ళ బాధలు వాళ్ళవి, మన కష్టాలు మనవి.”

“నేను పేపరు చదివే వచ్చాను. దాని విషయంలోనే మిమ్మల్ని కలవాలని వచ్చాను.”

“నువ్వు టేకప్ చేస్తే, ఈ కేసు సులభంగా తేలిపోతుందని నా నమ్మకం. నీకు ఏం కావాలన్నా, నాకు ఫోన్ చెయ్యి. కేసు ఫైలు రఘువీర్ దగ్గర తీసుకుని చదువు. నేనతనికి ఫోను చేస్తాను, నీకు ఈ కేసులో కావాల్సిన సహాయం చెయ్యమని.”

“ఒకే, సార్! మరి నేను వస్తాను” కమిషనరు గారి దగ్గర సెలవు తీసుకుంది సాహితి.

బయట వేచివున్న సుబ్బయ్యను చూసి జాలిపడింది సాహితి.

“సుబ్బయ్యా, కొద్ది రోజులు ఓపిక పట్టు. కేసు ఒక కొలిక్కి రాగానే, నిన్ను తిరిగి డ్యూటీలో వేయిస్తాను.”

“థాంక్స్ అమ్మా! నేనే కాదు, సబ్ ఇనస్పెక్టర్ నిశ్చల్ ను కూడా సస్పెండ్ చేశారు. ఆ సారు కూడా మిమ్మల్ని కలుసుకోవాలని అనుకుంటున్నారు.”

“ఇదిగో నా విజిటింగ్ కార్డు. అతన్ని నాతో మాట్లడమను. ఈ కేసు సంగతి నేను చూస్తాను. నువ్వేం దిగులు పెట్టుకోకు”.

సుబ్బయ్య సంతోషంతో మరోమారు నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు.

సాహితి తిన్నగా సర్కిల్ ఇనస్పెక్టర్ రఘువీర్ దగ్గరకు వెళ్ళింది. రఘువీర్ ఆమెను చూస్తూనే మొహం చిట్లించాడు. అంతకు పూర్వం ఒకటి రెండు కేసుల్లో, ఆమె జోక్యంతోనే అసలు దోషుల్ని పట్టుకోవడం జరిగింది. కమీషనర్ గారికి కూడా ఆమె మీదే ఎక్కువ నమ్మకం. ఉద్యోగం మానేసి చాలా ఏళ్ళు అయినా, ఈమె ఎందుకో అనవసరంగా తమ కేసుల్లో కల్పించుకుంటుంది.

సాహితి అతని ముఖ కవళికలను కనిపెట్టి నవ్వుకుంది. ‘ఇతనికెందుకో తనపై కోపం. బహుశా తన వల్ల కాని పని నేను చేస్తున్నానని కాబోలు’ అనుకుంది సాహితి.

రఘువీర్ మర్యాదకు ఆమెను పలకరించి కేసు ఫైలు ఆమెకు ఇచ్చాడు.

సాహితి ఆ ఫైలులో వివరాలు పరిశీలించి, డెత్ రిపోర్టు, ఆ ఇంట్లో వాళ్ళనుంచి సేకరించిన వాగ్మూలం చదివి ముఖ్యమైన పాయింట్లు రాసుకుంది.

“ఇంతేనా, ఇంకేమైనా విషయాలు చెప్పగలరా?” అడిగింది.

“లేదు మేడం, నేను ఆ సమయానికి మా అబ్బాయి పెళ్ళి హైదరాబాదులో జరగటంతో అక్కడ ఉన్నాను. విషయం తెలియగానే, మర్నాడే వచ్చేశాను. ఇది ఆ రోజు మన నిశ్చల్ తీసుకున్న రిపోర్టు.”

“ఒకే. థాంక్స్. ఏదైనా అవసరం వస్తే మళ్ళీ వస్తాను.” చెప్పింది సాహితి.

రఘువీర్ “అలాగే”అన్నాడు.

సాహితి మర్నాడు జనార్ధనరావు ఇంటికి వెళ్ళింది.

బయట కాపలా ఉన్న కానిస్టేబుల్ ఆమెను చూస్తూనే నమస్కారం చేశాడు.

"ఏం కనకయ్యా, బాగున్నావా?" అడుగుతూ, "ఇంట్లో జనార్దనరావు గారి భార్య వున్నారా? నేను కలుసుకోవడానికి వచ్చానని చెప్పు."

మరో నిముషంలో జనార్ధనరావు భార్య లోపలనుంచి వచ్చింది. హాలులో కూర్చున్న సాహితిని చూస్తూనే నమస్కారం చేసి సోఫా లో కూర్చుంది.

సాహితి తలెత్తి చూసే సరికి ఆమె నిశ్శబ్దంగా ఏడుస్తున్నది.

సాహితి వెంటనే లేచి, సోఫాలో ఆమె పక్కన కుర్చుని ఓదార్చింది.

"చూడండి, మీకు కలిగిన నష్టం ఎవరూ తీర్చలేనిది. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. మీరు ధైర్యంగా ఉండాలి. మీకు ఎలాంటి సహాయం కావాలన్నా మేమున్నాము. ఈ సమయంలో మిమ్మల్ని ప్రశ్నించి మరింత బాధ పెట్టడం నాకు ఇష్టం లేదు. కానీ, ఆ హంతకుడిని వెంటనే పట్టుకోవాలన్న ఉద్దేశ్యంతో మిమ్మల్ని కొన్ని వివరాలు అడగాలని వచ్చాను. మీరు సహకరిస్తే, మా పని మరింత సులువు అవుతుంది. మీరు మీ బాధను కాస్త దిగమింగి, నా ప్రశ్నలకు జవాబిస్తే మీకు కూడా మంచిది."

జనార్ధనరావు భార్య కళ్ళు తుడుచుకుని,"అడగండి"అన్నది.

"అసలు ఆ రోజు ఉదయం నుంచీ ఏం జరిగిందో గుర్తు చేసుకుని చెప్పండి?"

" ఆ రోజు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదండీ. ఆయన ఎందుకనో ఒక రెండు రోజుల ముందు నుంచీ ఆందోళనగా వున్నారు. ఒకటికి రెండు సార్లు ఎందుకలా వున్నారని అడిగిన నాపై విసుక్కున్నారు కూడా. ముందు రోజు మాత్రం, పది గంటలకు బ్యాంకుకు వెళ్ళాలి అని చెప్పారు అంతే. కానీ, వెంటనే వెళ్ళ లేదు. సాధారణంగా ఆయన ఒక్కరే వెళ్ళేవారు. మా అబ్బాయి కాలేజీ నుంచీ మధ్యాన్నం భోజనానికి వచ్చేదాకా ఆగి, అప్పుడు కారులో ఇద్దరూ కలిసి బ్యాంకుకు వెళ్లివచ్చారు. బ్యాంకుకు వెళ్ళి వచ్చాక కూడా ఆయనలో ఆందోళన తగ్గ లేదు. మామూలుగానే, ఆ రోజు కూడా రాత్రి ఎవరి గదిలో వారు పడుకున్నాము. అబ్బాయి గదివేరే. నా గది వేరే. లోపల తలుపు గడియ వేసుకున్న ఆయన గది తలుపులు తీసి ఆయనను కాల్చారు. నేను రాత్రుళ్ళు నిద్ర పట్టడానికి ట్రికా వేసుకుని పడుకుంటాను. అందువల్ల నాకు తొందరగా మెలకువ రాలేదు. అర్ధరాత్రి మా అబ్బాయి కంగారు పడుతూ నా గదిలోకి వచ్చి, నన్ను నిద్ర లేపేదాకా నాకు ఏంజరిగింది తెలియదు."

"జనార్ధనరావు గారికి స్నేహితులు గానీ, శత్రువులు గానీ వున్నారా? మీ పెళ్ళి కాకపూర్వం పూర్వం ఆయన ఏం చేసేవారు? మొదటినుంచి ఇదే ఇండస్ట్రిలో వున్నారా?"ప్రశ్నించింది సాహితి.

"ఆయన పెళ్ళి కాకపూర్వం, అమెరికాలో ఐ.టి. ఇండస్ట్రి ఏదో నడిపే వారు. మా పెళ్ళయిన తర్వాత కూడా చాలా సంవత్సరాలు అక్కడే ఉన్నాము. ఒక రోజు అనుకోకుండా వచ్చి సామాన్లు సర్దమన్నారు. దేనికీ, సంగతేమిటనిఅడిగితే, పార్టనర్స్ తో ఏవో విభేదాలు వచ్చాయనీ, మన వంతు షేర్ అమ్మేసి, ఇండియా వెళ్ళిపోదామని చెప్పారు. అలా వచ్చేశాక ఇన్నాళ్ళ తర్వాత ఎవరో, ఎందుకో ఆయనపై కోపంతో చంపేశారు" దుఖంతో ఆమె గొంతు జీరబోయింది.

"ప్లీజ్, మీరు కాస్త తేరుకుని, ఆ పార్టనర్స్ పేర్లు మీకు తెలిస్తే చెప్పండి? ఒక వేళ వాళ్ళెవరైనా మీ వారిని చంపే అవకాశం ఉందా?" అడిగింది సాహితి.

"వాళ్ళెవరో నాకు తెలియదు. అసలు ఆయన బయటి విషయాలు నాతో చెప్పేవారు కాదు. ఆఫీసు విషయాలు ఆఫీసులోనే మరిచిపోవాలనే వారు. అందువల్ల, వాళ్ళెవరైనదీ, ఆయన చావుకు వాళ్ళే కారణమా అన్నది నేను చెప్పలేను".

"ఓకే. అమ్మా, మిమ్మల్ని ఇబ్బంది పెట్టినందుకు క్షమించాలి. మీ అబ్బాయిని ఒకసారి పంపించండి".

కాసేపట్లో జనార్ధనరావు కొడుకు విశాల్ వచ్చాడు. వెనకే పనిపిల్లతో ట్రేలో సాహితికి ఒక ప్లేట్లో బిస్కెట్లు, కాఫీ పంపించింది జనార్ధనరావు గారి భార్య. విశాల్ ఆరడుగుల పొడుగు. ధృడంగా వున్నాడు. సుమారు పాతికేళ్ళు ఉంటాయి.

"ముందు బిస్కెట్లు తిని, కాఫీ తాగండి. తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు విశాల్ తను కూడా కాఫీ కప్పు తీసుకుంటూ. సాహితి అతని మర్యాదకు సంతోషించింది. మొహమాట పడుతూనే, రెండు బిస్కెట్లు తిని, కాఫీ తాగింది. అప్పటికి విశాల్ కూడా కాఫీ తాగడం పూర్తి చేశాడు. పనిపిల్ల వచ్చి ట్రేలో ఖాళీ కప్పులు తీసుకుని వెళ్ళిపోయింది.

"ఇప్పుడు చెప్పండి, ఏం వివరాలు కావాలో మీకు?" అడిగాడు.

"థాంక్స్, చక్కటి కాఫీ ఇచ్చారు. ఇక అసలు విషయానికి వద్దాం. ఈ కేసు, పోలీసు వారికి సహాయంగా నేను పరిశోధిస్తున్నాను. నాకు ముఖ్యంగా, ఇక్కడకు రాకపూర్వం మీ నాన్న గారు ఏం చేసేవారు, వారితో పార్టనర్స్ ఎంతమంది ఉండేవారు, వాళ్ళ వివరాలు, అడ్రసులూ, ఏమైనా ఉన్నాయా అన్నది కావాలి".

"నాన్న గారు నా చిన్నతనంలోనే అమెరికా వదిలేసి వచ్చేశారు. అందువల్ల, నాకు అక్కడి సంస్థ గురించి గానీ, పార్టనర్స్ గురించి గానీ తెలియదు. ఇక్కడ మచిలీపట్నంలో ఉంటున్న రాఘవరావు గారు మాత్రం మంచి స్నేహితుడు. ఒకసారి నాన్న గారు కలిసేందుకు వెడితే, ఇంకోసారి ఆయన వచ్చేవారు."

"సరే, మీరు అమెరికా నుంచీ రాగానే ఇక్కడే సెటిల్ అయ్యారా?"

"లేదండి, బాపట్ల తాలూకా తుర్లపాడులో మా తాతయ్య అంటే, అమ్మ నాన్న గారింట్లో ఒక అయిదేళ్ళు వున్నాం. నా ఎలిమెంటరీ స్కూల్ చదువంతా అక్కడే గడిచింది. ఆ తర్వాత నాన్న గారు ఇక్కడ ఒక ఇండస్ట్రీ స్థాపించాక ఇక్కడికి వచ్చి సెటిల్ అయ్యాము."

"అంటే మీరు వచ్చి ఎన్నేళ్ళయ్యింది?"

"దగ్గర దగ్గర పదేళ్ళు అవుతోంది".

"ఈ పదేళ్ళ కాలంలో ఎన్నడూ మీ నాన్న గారికి ఇలాంటి హెచ్చరికలు రాలేదా?"

"వచ్చినట్లు లేదు".

"మరణించిన రోజు గానీ , అంతకుముందు రెండు, మూడు రోజుల ముందు గానీ, ఆయనకు మళ్ళీ హెచ్చరిక ఏమైనా వచ్చిందా?"

"వచ్చింది మేడం, ముందు రోజు ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం నేనే తీసుకున్నాను. అదేదో కోడ్ భాషలో వుంది. నాన్నగారికి ఇచ్చాను. అది చూసిన దగ్గరి నుంచే, నాన్నగారికి ఆందోళన ఎక్కువైంది. ఆ ఉత్తరం ఏమిటని అడిగితే, నీకు తెలియదులే, నువ్వూరుకో, అమ్మకేం చెప్పకు అన్నారు తప్పితే, నాకు కూడా చెప్పలేదు".

"ఆ ఉత్తరం ఇప్పుడు ఉందా?"

"పోలీసు వారు తీసుకున్నారు మేడం. అయితే, ఆ కోడ్ భాషను నేను కనిపెట్టగలనేమో చూద్దామని, ఒక ఫోటో తీసుకున్నాను".

సాహితి మొహంలో చిరునవ్వు చూసి, "అది మీకు ఉపయోగ పడుతుందంటే, ఇప్పుడే మీ ఫోనుకి పంపిస్తాను మేడం" అంటూ ఆమె ఫోను అడిగి తీసుకుని ఫోటోను ట్రాన్స్ఫర్ చేశాడు.

సాహితి దాని వంక ఒక సారి చూసి, "అయితే నాన్నగారికి వచ్చిన బెదిరింపు ఉత్తరాలు విషయం రాఘవరావు గారికి తెలియదా?"

"నాన్నగారు మొదట్లో వచ్చిన ఉత్తరాలను లెక్కపెట్టలేదు. అందువల్ల ఆయనకు చెప్పినట్లు లేదు. అసలు మాకు కూడా మొదట చెప్పలేదు. జాగ్రత్త కోసం మాత్రమే పోలీసు రిపోర్టు ఇచ్చారు. నిన్న ఉత్తరం చూశాక, అప్పుడు మాత్రం కొద్దిగా భయపడ్డారు."

"మీరు నాన్న గారితో కలిసి అదే రోజు బ్యాంకుకు వెళ్ళి వచ్చారు. అప్పుడు నాన్నగారు ఏం చేశారు? లాకర్ నుంచీ ఏమైనా తెచ్చారా?"

"లాకర్ తెరిచి చూశారు మేడం. ఏవో కాగితాలు అటూఇటూ సర్దారు. ఆ తర్వాత బ్యాంకు మేనేజరుతో కొంత సేపు మాట్లాడారు. కొత్త లాకరు తీసుకున్నారు. అప్లికేషను పైన నా చేత సంతకం పెట్టించారు. పాత లాకరు లోంచి అన్నీ, కొత్త దాన్లోకి మార్చేశారు. వెంటనే ఇంటికి వచ్చేశాము. అయితే, వచ్చేటప్పుడు అటూఇటూ చూసి, అప్పుడు బయటకొచ్చి కారెక్కారు".

"పాత లాకర్, కొత్త లాకరు నెంబర్లు చెప్ప గలరా?" వెంటనే అడిగింది సాహితి.

"పాత లాకరు నెంబరు 112. కొత్త లాకరు నెంబరు 150."

"కొత్త లాకరు నెంబరుతో పని లేదు. పాతదాని నెంబరు 112. యు ఆర్ ష్యూర్?" అడిగింది.

"ఎస్, మేడం"

"ఓకే, చివరగా ఒక ప్రశ్న. మీ నాన్నగారికి డైరీ రాసే అలవాటు ఉందా?"

"లేదు కానీ, కొన్ని ముఖ్య విషయాలు ఒక నోటుబుక్కులో రాసేవారు."

"అది నాకు ఇవ్వగలరా?"

“అంటే, నేను కూడా అది ఇంతవరకూ చదవ లేదు. అందులో ఆయన వ్యాపార రహస్యాలు ఏమైనా రాశారేమోనని పోలీసు వారికి నేనివ్వలేదు మేడం” సందేహిస్తూ చెప్పాడు విశాల్.

“మీకా భయం ఏమీ అక్కర్లేదు. ఆ రహస్యాలు నేనేమీ బయట పెట్టను. అందులో ఆయన మరణానికి సంబంధించిన క్లూ ఏమైనా తెలుస్తుందేమోనని నా ఆశ.”

“సరే, మేడం. ఆ పుస్తక మీకు ఇస్తాను. ఒక్క నిముషం ఆగండి” అంటూ లోపలి వెళ్ళి ఒక నోటుబుక్కు తీసుకువచ్చాడు. ఒక్క క్షణం ఆలోచించి, అందులో కొన్ని ఫోను నెంబర్లు మరో పుస్తకంలో రాసుకుని, తను తెచ్చిన పుస్తకం ఆమెకు ఇచ్చాడు.

“థాంక్స్ విశాల్, నాకు మంచి ఇన్ఫర్మేషన్ ఇచ్చావు. ఈ నోటుబుక్కు భద్రంగా మీ అమ్మమ్మ గారికి పంపుతాను. వాళ్ళ అడ్రసు రాసివ్వు. వాళ్ళతో చెప్పు నీ పేరుతో వచ్చే పార్సెల్ తీసుకోమని. మీ అమ్మగారిని జాగ్రత్తగా చూసుకో. తర్వాత మీ ఇంటికి కాపలాగా మరో ఇద్దరు కానిస్టేబుల్సుని ఉంచమని చెబుతాను”.

“అంటే, మాకు ఇంకా ప్రమాదం వుందంటారా?” అడిగాడు.

“మీ ప్రాణాలకు ఏమీ ప్రమాదం లేకపోవచ్చు గానీ, దొంగ ఏదైనా వివరం కోసం, డైరీ లాంటిది ఏదైనా దొరక వచ్చని ప్రయత్నించ వచ్చు. నేను ఇప్పుడే కమీషనర్ గారికి ఫోన్ చేసి ఒక ఇద్దరు కానిస్టేబుల్సుని పంపమని చెబుతాను. అన్నట్లు, నాకొక సంచి ఇవ్వగలవా?” అడుగుతూనే ఫోన్ చేసి, కమీషనర్ గారికి విషయం వివరించింది. కమీషనర్ గారు వెంటనే ఇద్దరు కానిస్టేబుల్స్ పంపిస్తానని చెప్పారు.

సాహితి జనార్ధనరావు గారింటికి వచ్చేముందు ఒక కిలో స్వీట్స్ పాక్ చేయించి తన బ్యాగ్గులో పెట్టింది. ఆ స్వీట్స్ పాకెట్ బ్యాగ్గు లోంచి తీసి, విశాల్ ఇచ్చిన సంచీలో పెట్టుకుంది. అదంతా ఆశ్చర్యంగా చూస్తున్న అతనికి మరోమారు థాంక్స్ చెప్పి బయటకు వచ్చింది. రోడ్డు మీదకు రాగానే, వెంటనే బస్సు స్టాండుకని చెప్పి ఆటో ఎక్కింది.

బస్సు స్టాండులో ఆటో దిగి, బందరు నాన్ స్టాపు బస్సు ఎక్కుతుండగా, ఆమె చేతిలో సంచీ ఎవరో బలంగా లాగేశారు. ఆమె వెనక్కి తిరిగి చూసేసరికి, సంచి పట్టుకుని ఒక వ్యక్తి పారిపోవడం కనిపించింది.

సాహితి “దొంగ దొంగ” అని గట్టిగా అరిచే సరికి, బస్సు స్టాండులో డ్యూటీలో ఉన్న ఇద్దరు పోలీసులు పారిపోతున్న మనిషి వెనకే పరిగెత్తారు. ఈ లోగా బస్సు కదిలింది. రాగిణి తన సీటులో కూలబడి ఊపిరి పీల్చుకుంది.

❦❦❦

బందరు బస్సు స్టాండులో దిగి, సూపరింటెండెంట్ ఆఫీసుకు వెళ్ళి, కేసు విషయం వివరించి, రాఘవరావు గారికి సెక్యూరిటీ ఏర్పాటు చెయ్యడం మంచిదని చెప్పింది. సూపరింటెండెంట్ రమణారావు గారు ఆమెను ఆప్యాయంగా పలకరించి, “రాఘవరావు గారి దగ్గర ఫార్మల్ గా రిక్వెస్ట్ లెటర్ తీసుకుని ఇవాళే ఏర్పాటు చేస్తాను” చెప్పాడు.

సాహితి ఆయనకి థాంక్సు చెప్పి దగ్గరలో ఉన్న జెరాక్సు సెంటర్లో విశాల్ ఇచ్చిన పుస్తకం మొత్తం కాపీ తీయించింది. వెంటనే మార్కెటుకు వెళ్ళి ఒక బుట్టెడు దోర జామ కాయలు కొంది. ఆ పక్కనే బట్టల దుకాణంలో ఒక టర్కీ టవలు కొన్నది. బుట్టలో జామకాయల

మధ్య విశాల్ ఇచ్చిన నోట్ బుక్ టవల్ లో చుట్టి పెట్టింది. ఎవరూ తనని ఫాలో అవడం లేదని నిర్ధారించుకుని, నవతా ట్రాన్స్ పోర్టు ఆఫీసుకు వెళ్ళి, విశాల్ పేర వాళ్ళ అమ్మమ్మ గారికి పార్సెల్ బుక్ చేసింది. ఆ తర్వాత బస్టాండుకు వెళ్ళి, పామర్రు బస్సు ఎక్కింది.

సాహితి బస్సు దిగి ఇంటికి చేరేసరికి, సుజిత్ "అమ్మా, ఇది చూడు" అంటూ న్యూస్ చానెల్ ఆన్ చేశాడు. జనార్ధనరావు గారి హత్య కేసు విషయంలో విజయవాడ కమీషనర్ గారి ఆఫీసుకు వెళ్ళి, కారులో బందరు తిరిగి వెడుతున్న రాఘవరావును పామర్రు దగ్గర జుఝవరం సమీపంలో ఎవరో కాల్చి చంపినట్లు టి.వి. న్యూస్ లో చూపిస్తున్నారు. సాహితి ఒక్క సారి ఉలిక్కి పడింది. "అయ్యో, పాపం, ఇక్కడ దాకా వచ్చేశాక జరిగిందా?" అనుకుంది.

సాహితి భోజనం చేసి సోఫాలో కుర్చోబోతుండగా, సెల్ ఫోను మోగింది.

'రాత్రి పది గంటలప్పుడు ఫోను చేసేది ఎవరబ్బా' అనుకుంటూ ఫోను తీసింది సాహితి.

"సాహితీ, బందరు వెళ్ళావు గదా, ఏమైంది?" ప్రసాదు గొంతు విని ఆశ్చర్యపోయింది.

ఫోను నెంబరు చూస్తే, పబ్లిక్ బూత్ నుంచీ చేసినట్లుంది. గొంతు చూస్తే ప్రసాదు గొంతులాగానే వుంది. ఇతనికి తను బందరు వెళ్ళినట్లు ఎలా తెలుసు?

"అదేం నీ ఫోను ఏమైంది? బయట నుంచీ చేస్తున్నావేం?" ప్రశ్నించింది సాహితి.

"మధ్యాన్నం భోజనానికి వెళ్ళినప్పుడు, నా ఫోను ఇంట్లో మరిచిపోయి వచ్చాను. ఇప్పుడు ఇంటికి వెడుతూ, నిన్ను అడుగుదామని చేస్తున్నాను."

"విజయవాడలోను, బందరులోను కూడా, అంత ముఖ్యమైన వివరాలు ఏమీ తెలియ లేదు. జనార్ధనరావు గారి భార్య పుట్టెడు దుఃఖంలో వున్నది. అయినా ఆమె అంత దుఃఖంలో కూడా, ఉత్తి చేతులతో పంపకూడదు ఇంటి కొచ్చిన ఆడపిల్లని అంటూ స్వీట్స్ పాకెట్ ఇచ్చి మరి పంపింది. బస్సు స్టాండులో అది ఎవరో కొట్టేసారనుకో. చాలా మర్యాదస్తులు వాళ్ళు. పాపం వాళ్లకు తేరుకోలేని విపత్తు వచ్చిపడింది. నేను జనార్ధనరావు గారి హత్యకు కారణాలు ఆమెకేమన్నా తెలుస్తాయేమోనని అడిగి చూశాను. ఆమె ఏమీ చెప్పలేక పోయింది. ఆమెకు, వాళ్ళ అబ్బాయికీ కూడా ఆయన ఎప్పుడూ ఏమీ చెప్పేవాడు కాదట. డైరీ రాసే అలవాటు కూడా లేదట. ముందురోజు ఏదో బెదిరింపు ఉత్తరం వచ్చిందట కానీ, అది ఎంక్వయిరీలో మన వాళ్ళు తీసుకు పోయారు. ఒక రకంగా నేను శ్రమ పడి తిరిగిందంతా దండగ అనిపించింది. అయితే, చనిపోయిన జనార్ధనరావు గారికి, బందరులో ఉండే రాఘవరావుగారికి స్నేహమని తెలిసింది. వెంటనే బందరు కమీషనర్ ఆఫీసుకు వెళ్ళి, రాఘవరావు గారికి సెక్యూరిటీ ఏర్పాటు చెయ్యడం మంచిదని కేసు వివరించి చెప్పాను. నేను ఇంటికి వచ్చే లోపల, హంతకుడు ఆయన్ను కూడా చంపేశాడు. ఏంటో, ఈ కేసులు తలా తోకా లేకుండా వున్నాయి, ప్రసాదు! మన వల్ల కాదేమోననిపిస్తోంది." చివరి వాక్యం నొక్కి మరీ చెప్పింది.

అవతల నుంచీ "సరేలే, రెస్టు తీసుకో" అంటూ ఫోను పెట్టేసిన చప్పుడు వినిపించి, సాహితి ఫోను డిస్ కనెక్ట్ అయ్యింది.

సాహితి తనలో తానే నవ్వుకుని, సెల్ ఫోనులో విశాల్ పంపిన ఫోటో చూసింది. మళ్ళీ ఇదేదో కోడ్ భాషలో వుంది. చనిపోయిన రాఘవరావు డైరీలో వాడిన కోడ్, ఇదీ ఒకటి కాదు. ఇది ఇంకేదో దేశ భాషలో వుంది. రేపు తీరుబడిగా దీని సంగతి ఏమిటో చూడాలి అనుకుంటూ బెడ్ పై వాలిపోయింది.

పొద్దున్నే మెలకువ వచ్చేసరికి ఎండెక్కి పోయింది. లేచి బ్రష్ చేసుకుని కాఫీ తాగుతూ, సెల్ ఫోనులో కాల్స్ ఏమైనా వున్నాయేమో చూసింది. కొత్త కాల్స్ ఏమీ లేవు. ఫోటోలు ఓపెన్ చేసి, విశాల్ పంపిన ఫోటో చూసింది.

Du Snyder mig. Du betaler straffen for det. I morgen er din sidste dag.

భాష కొత్తగా ఉన్నా, బహుశా దీన్ని డీకోడ్ చెయ్యడం తేలికే కావచ్చు అనుకుంటూ గూగుల్ ట్రాన్స్ లేషన్ లో వెతికి చూసింది దానికి ట్రాన్స్ లేషన్ కొట్టగానే, సాహితికి ఆ లెటరులో ఉన్నది డానిష్ భాషని అర్థం అయ్యింది.

You cheated me. You pay the penalty for it. Tomorrow is your last day.

జనార్ధనరావు గారి నోట్ బుక్ తీసి చూసింది. అందులో ఏవో ఫోన్ నెంబర్లు ఉన్నాయి. మరికొన్ని అడ్రసులు-బహుశా అతని కస్టమర్స్ అడ్రసులు కావచ్చు, రాసుకున్నాడు. మొత్తం నోట్ బుక్ అంతా తిరగేసింది. ఇంపార్టెంట్ అనిపించే విషయం ఏది కనిపించలేదు. ఈ నోట్ బుక్కు కోసమా తానింత కష్టపడిందీ, ఒక సారి తిరగేసి చూస్తే తెలిసిపోయేది అనుకుంటూ సాహితి ఆ జెరాక్సు పుస్తకం అవతల పడేసింది.

సో, జనార్ధనరావు గారికి, హంతకుడికి ముందర నుంచే ఏవో లావాదేవీలు వున్నాయి. ఆయన వల్ల హంతకుడికి ఏదో అపకారం జరిగింది. డబ్బు సంబంధమైన లావాదేవీలలోనే కావచ్చు. హంతకుడు డానిష్ భాషలో బెదిరింపు ఉత్తరం రాసేదాకా ఆయన భయపడలేదంటే, వాళ్ళిద్దరికీ డానిష్ భాష తెలిసి ఉండాలి. అయినా ఇదేమి తనకు ఉపయోగపడే క్లూ కాకపోవచ్చు. అయితే, లాస్ట్ ఉత్తరంలో హంతకుడు రేపు చంపుతానని ముందరే బెదిరించి నప్పుడు, ఆయన పోలీసులను ఎందుకు కలవలేదు? తనకి సెక్యూరిటీ వున్నారుగదా అని అశ్రద్ధ చేసి ఉంటాడా? అర్జెంటుగా బ్యాంకుకు వెళ్ళి లాకర్ ఎందుకు మార్చాడు? తన ప్రాణాలకన్నా, లాకరు మార్చడం ముఖ్యమైందా? ఈ 112 లాకరు మర్మం ఏమిటి? హతులు ముగ్గురూ ఒకే నెంబరు లాకరు తీసుకోవడంలో మర్మం ఏమైనా ఉందా? అయితే, ముందు చనిపోయిన రాఘవరావు వీళ్ళ స్నేహితుడేనా? అసలు ఇద్దరూ రాఘవరావులేనా? లేక, ముందు చనిపోయిన రాఘవరావు, హంతకుడు చంపదల్చుకున్న మరో వ్యక్తా? కానీ, ముందు చనిపోయిన రాఘవరావు హార్ట్ ఎటాక్ వల్ల చనిపోయాడని కదా రిపోర్టు వచ్చింది? కనుక, అతన్ని హంతకుడు చంపలేదు. హంతకుడికి అత నెక్కడున్నాడో తెలియక పోయి ఉండచ్చు, లేదా అతను చంపాల్సిన వ్యక్తి కూడా కాకపోయుడొచ్చు. లాకరు మర్మం తెలిస్తే, మిగతా విషయాలు బయట పడతాయేమో. హత్యా స్థలంలో కానీ, హతుల కుటుంబాల నుంచీ కానీ, మరికొన్ని వివరాలు దొరికే అవకాశం ఉందా? ముందు చనిపోయిన రాఘవరావు దగ్గర ఏ క్లూ దొరకలేదు. జనార్ధనరావు గారి ఇంట్లో కొన్ని విషయాలు తెలిసినా, మరికొన్ని వివరాలు తెలిస్తే కానీ, ఈ కేసులో ముందుకు పోవడ కుదరదు. ఆలోచిస్తున్న సాహితికి వెంటనే గుర్తుకు

వచ్చింది, తను ఇంతవరకూ బందరు రాఘవరావు గారి భార్యా, పిల్లలను ప్రశ్నించలేదు. ఆ ఆలోచన రావడం ఆలశ్యం, త్వరగా తయారై తన బ్యాగ్గు తీసుకుని బయల్దేరింది.

సుజిత్, "మళ్ళీ ఎక్కడికమ్మా బయల్దేరావు? నేను కూడా వస్తానమా?" అడిగేసరికి, సాహితి నవ్వి,"సరే, రా. కానీ, అనవసరమైన ప్రశ్నలు వెయ్యకూడదు" అంది.

"ఓకే, ఒక్క నిముషం వుండు" అంటూ లోపలి వెళ్ళబోతున్న సుజిత్ ను ఆపి, నా పుస్తకాల అలమరలో రెండు డైరీలు వుంటాయి. అందులో, ప్లాస్టిక్ కవరు తొడిగిన డైరీ ఒకటి ఉన్నది. అది తీసుకురా" చెప్పింది సాహితి.

సుజిత్ డాన్ బ్రౌన్ పుస్తకం "ఏంజెల్స్ అండ్ డెమన్స్" తెచ్చుకుని, "ఉత్తినే కూర్చుంటే, బోర్ కొడుతుంది." అన్నాడు. సాహితికి ఆమె అడిగిన డైరీ ఇవ్వబోయాడు. "ఇది కూడా నువ్వే పట్టుకో" చెప్పింది.

బందరు బస్సు స్టాండులో బస్సు దిగి సాహితి ఆటో మాట్లాడి సుజిత్ కోసం చూసేసరికి, అతను ఎవరో కాషాయం కప్పుకున్న వ్యక్తితో ఏదో మాట్లాడుతున్నాడు.

"సుజిత్, రా" అని పిలిచేసరికి పరిగెత్తుకుంటూ వచ్చి. "అమ్మా, చూశావా, ఆ సన్యాసి ఎవరో కానీ, నా పేరు, నీ పేరు కూడా చెప్పాడు. గాలిలోకి చెయ్యి చాచి, ఉంగరం సృష్టించి ఇచ్చాడు." అంటూ చేతిలో ఉంగరం చూపించాడు.

సాహితి వెనక్కి తిరిగి ఆ సన్యాసి కోసం చూసేసరికి, అతను గబగబా వెళ్ళిపోతున్నాడు. "ఇంకా ఏం చేశాడు?" అడిగింది.

"నా చేతిలో పుస్తకాలు చూశాడు. నీకు డాన్ బ్రౌన్ అంటే ఇష్టమాని అడిగాడు. షెర్లాక్ హోమ్స్, అగాథా క్రిస్టీ పుస్తకాలేప్పుడైనా చదివావాని అడిగాడు" చెప్పాడు సుజిత్.

సాహితి ఆటో ఎక్కి కూర్చుని, పోనిమ్మంది. దారిలో పోలీసు స్టేషన్ ముందు ఆపి, సుజిత్ చేతిలో ఉంగరం లాక్కుని, లోపలి వెళ్ళి ఇనస్పెక్టరుతో మాట్లాడి ఇచ్చింది.

"అదేంటమ్మా, స్వామీజీ ఇచ్చిన ఉంగరం అలా తీసుకెళ్ళి వాళ్లకు ఇచ్చావు?" అడిగాడు సుజిత్.

"ఒరే, నీకేం తెలియదు, అందులో చిన్న మైక్రోఫోను వుంది. మనం ఏం మాట్లాడుకున్నదీ వాళ్లకు విన బడుతుంది."

"మన మాటలు వింటే, వాళ్ళకేం లాభం?" అడిగాడు అమాయకంగా.

"ఈ హత్య కేసులో కొన్ని వివరాలు తెలుసుకోవడం కోసం మనం రాఘవరావు గారింటికి వెడుతున్నాం. ఆ విషయాలు వాళ్లకు కావాలి. అంతేకాదు, ఆ వివరాలు తెలుసుకుని నేను ఏం చెయ్య బోతున్నానో ఆలోచిస్తారు. మనకన్నా ముందే వాళ్ళు ఆ ఇన్ఫర్మేషన్ ఉపయోగించు కుంటారు. ఆదీ సంగతి, అర్ధం అయ్యిందా?"

"అంటే, ఆ సన్యాసి అసలు సన్యాసి కాదన్న మాట. మనల్ని ఎక్కడ్నుంచో ఫాలో అవుతున్నాడు. అంతేనా?" అడిగాడు సుజిత్.

సాహితి ”బాగానే ఆలోచిస్తున్నావు!” అంది అతని తల నిమురుతూ.

“ఇదేదో పెద్ద డిటెక్టివ్ కథలా ఇంటరెస్టింగ్ గా ఉందమ్మా” అన్నాడు ఉత్సాహంగా సుజిత్. సాహితి నవ్వింది.

రాఘవరావు గారింటికి వెళ్ళేసరికి, వీధి మొదల్లో ఒక వ్యక్తి వీరిని చూసి, వెనక్కి తిరిగి పోయాడు. సాహితి అది గమనించినా, చూడనట్లు ఉండిపోయింది.

రాఘవరావు గారింటి ముందు డ్యూటీలో ఉన్న ఇద్దరు కానిస్టేబుల్స్ ఆమెను చూస్తూనే నమస్కారం పెట్టారు. సాహితి వారిద్దరిని చిరునవ్వుతో పలకరించింది. ఒకతను లోపలి వెళ్ళి సాహితి వచ్చిన సంగతి చెప్పాడు. మరో పది నిముషాలలో, కాఫీ ట్రే లో పట్టుకుని పని పిల్లా, ఆమె వెనుకే రాఘవరావు గారి భార్యా, కొడుకు, కూతురూ ముగ్గురూ వచ్చారు. రాఘవ రావు గారి భార్యకు సుమారు యాభై ఏళ్ళు ఉంటాయి. భర్త చనిపోయిన బాధ ఆమె మోహంలో కనిపిస్తోంది. కూతురు శ్రీదేవి నిజంగా శ్రీదేవే. చక్కటి పిల్ల అనుకుంది సాహితి. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. కొడుకు శేఖర్ చిన్నవాడు. అతను ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

“మిమ్మల్ని కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు అడగాల్సి ఇలా వచ్చాను. ఈ సమయంలో మిమ్మల్ని బాధ పెట్టడం న్యాయం కాదు కానీ, తప్పనిసరై పోయింది.” చెప్పింది సాహితి.

పనిపిల్ల ఇచ్చిన కాఫీ తాగుతూ, “రాఘవరావు గారికి శత్రువులు ఎవరన్నా వున్నారా?”

“లేదండీ, నాకు తెలిసినంత వరకూ ఎవరూ లేరు. స్నేహితులు కూడా తక్కువే. ఒక్క జనార్ధనరావు గారు మాత్రమే ఆయనకు మంచి స్నేహితుడు”.

“రాఘవరావు గారు ఇక్కడికి రాక పూర్వం ఏమీ చేసేవారు? జనార్ధనరావు గారు, ఈయన ఎప్పటి నుంచీ స్నేహితులు?”

“వీరిద్దరూ పాత స్నేహితులే. మరొక ఇద్దరు స్నేహితులతో కలిసి, అమెరికాలో ఏదో ఐ.టి. ఇండస్ట్రీ పెట్టారు”.

“ఆ మిగతా ఇద్దరెవరో మీకు తెలుసా?” వెంటనే అడిగింది సాహితి.

“నలుగురిలో ఒకాయన చనిపోయాడు. ఆయన పేరు సదానంద్ అని గుర్తు. మరొకాయన పేరు విష్ణు అనుకుంటాను. ఆ ఇద్దర్ని నేను ఎప్పుడో కంపెనీ పెట్టిన కొత్తలో చూశాను. జనార్దనరావు గారే ఎక్కువగా మాఇంటికి వచ్చేవాడు. వీళ్ళు ఇద్దరే బిజినెస్ విషయాలు మాట్లాడుకునే వారు”.

“ఆ ఇండస్ట్రీ మూసేయ్యడానికి కారణం ఏమిటి? అసలు ఇండస్ట్రీ మూతపడటం వల్లనే ఇండియా తిరిగి వచ్చేశారా?”

“మూత పడలేదండి, మరొక పెద్ద కంపెనీ కొనుక్కుందని చెప్పారు. వచ్చిన లాభం చాలు, మన దేశం వచ్చేసి, ఇక్కడే మరొక ఇండస్ట్రీ గానీ, బిజినెస్ గానీ పెట్టుకుందాం అనుకుని వచ్చేశామండి”.

“మిగతా ఇద్దరూ కూడానా?”

"ఒకాయన చనిపోయారని చెప్పాను కదా. ఆయన ఈ డీల్ కుదిరినప్పుడే  చనిపోయారు. మా రెండు కుటుంబాలు ఒకేసారి వచ్చేశాము. మూడో ఆయన విషయం నాకు తెలియదు".

"ఎంత కమ్మారో, అసలు ఆ చనిపోయిన ఆయన ఎలా చనిపోయారో మీకేమైనా తెలుసా?"

"ఆ వివరాలు నాకు తెలియదండి".

"రాఘవరావు గారు డైరీ రాసేవారా?"

"మొన్న ఒక రోజు ఆయన డైరీ రాయడం చూశాను.  ఆ  తర్వాత నేను చూడలేదు".

"నేను దాచాను మేడం. నాన్నగారికి మీరీ  కేసు పరిశోధిస్తున్నారని తెలిసింది. తను ఇంట్లో ఉన్న, లేకపోయినా, నన్ను ఈ డైరీ జాగ్రత్తగా దాచి, మీరు వచ్చినప్పుడు ఇమ్మని చెప్పారు. అందుకే నేను ఎవరికీ చెప్పలేదు, నా దగ్గరే దాచాను" వెంటనే చెప్పాడు వాళ్ళబ్బాయి శేఖర్.

"ఆ డైరీ నాకిస్తావా?"సాహితి అడగడం ఆలశ్యం డైరీ తెచ్చి ఇచ్చాడు.

సాహితి సుజిత్ దగ్గర తన డైరీ తీసుకుని,  పై ప్లాస్టిక్ కవరు  తీసింది. రాఘవరావు గారి డైరీ అట్ట, మొదటి పేజీ జాగ్రత్తగా ఊడదీసింది. మిగిలిన పుస్తకంపై తన డైరీ కవరు తొడిగింది. తన డైరీ అట్ట, మొదటి పేజీ చించి వేసి, మిగిలిన డైరీ కాగితాల్లో బాల్ పెన్నుతో కొన్ని బొమ్మలు తనే గీసింది. ఇప్పుడు ఆ డైరీ కాగితాలపై రాఘవరావు గారి డైరీ అట్ట, మొదటి పేజీ వుంచి, తన బ్యాగ్గులోంచి గం బాటిల్ తీసి, జాగ్రత్తగా అతికించినది. అదంతా తెల్లబోయి చూస్తున్నరాఘవరావు గారి అబ్బాయికి  చించేసిన తన డైరీ అట్ట, మొదటి పేజీ– రెండూ  ఇచ్చి చెత్త బుట్టలో పడేయమంది. అంటించిన డైరీపై ఏదైనా బరువైన వస్తువు కాసేపు పెట్టి వుంచమంది. శేఖర్ ఇచ్చిన రాఘవరావు గారి డైరీ  తన బ్యాగ్గులో పెట్టుకుంటూ, అట్ట మార్చిన తన డైరీ సుజితును పట్టుకోమంది.  శ్రీదేవిని విడిగా పిలిచి అడిగింది.

"విశాల్ మీకు పరిచయమేనా?"

"కాలేజిలో నా కన్నా అతను రెండేళ్ళు సీనియర్ మేడం. మేమిద్దరం ప్రేమించుకున్నాం. నాన్నగారు, మామయ్యా కూడా అతని చదువు అయిపోగానే, మా ఇద్దరికీ పెళ్ళి చేద్దామనే అనుకున్నారు. ఇంతలో ఈ హత్యలు జరిగిపోయాయి" కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది శ్రీదేవి. సాహితి మరి కాసేపు ఆ అమ్మాయితో మాట్లాడి, రాఘవ రావు గారి భార్యకు, పిల్లలకూ "బై"  చెప్పింది .

"డైరీ కనబడేటట్టు పట్టుకో" సుజిత్ కు చెప్పింది బయటకు రాగానే. బందరు బస్టాండుకు వచ్చి, పాసెంజర్ బస్సు ఎక్కింది. లేడీస్ సీట్ దొరికి తను కూర్చుంది కానీ, సుజిత్ నిలబడే వున్నాడు. బస్సు కుదుపుల్లో సుజిత్ చేతిలో పుస్తకం డైరీ జారి పడ్డాయి. వెనకాల నుంచున్న వ్యక్తి ఒంగుని, రెండు పుస్తకాలూ తీసి సుజితుకు ఇచ్చాడు. సుజిత్ థాంక్స్ చెబుతుండగానే, బస్సు ఆగడంతో, ఆ వ్యక్తి హడావుడిగా బస్సు దిగి, వెళ్ళిపోయాడు.

ఇంటికి రాగానే, సాహితి సుజిత్ చేతిలో డైరీ పరీక్షగా చూసి నవ్వుకుంది. తన బ్యాగ్గులోంచి రాఘవరాఘవ రావు గారి డైరీ తీసింది. అది ఆ సంవత్సరం డైరీయే అయినా, ప్రతి రోజు రాసి లేదు. జరిగిపోయిన విషయాలు తనకు చెప్పాలని, ఈ మధ్యే రాయడం మొదలుపెట్టినట్లుంది. అంటే, ఈయనకు హంతకుడు తనని కూడా చంపుతాడేమోనని అనుమానం వచ్చి ఉండవచ్చు.

డైరీ మొత్తం పేజీలన్నీ ఒకొక్కటి తిప్పి చూసింది.

"జనార్ధనరావు, నేను, సదానంద్, వేణు మేము నలుగురం పార్టనర్స్. జనార్ధనుకు, నాకూ డిగ్రీ క్లాసు నుంచీ స్నేహం. సదానంద్, వేణులు ఇద్దరూ నాకు ఒక ఇండస్ట్రియల్ సెమినారులో పరిచయమయ్యారు. అనాధ శరణాలయంలో చదువుకుని, కష్టపడి పైకి వచ్చిన వాళ్ళను చూస్తే ముచ్చట అనిపించింది. ఆ తర్వాత వాళ్ళ తెలివితేటలు చూసి నేను ఇంప్రెస్స్ అయ్యాను. కొత్తగా స్మార్ట్ ఐ.టి. కంపెనీ పెట్టాలన్న వాళ్ళ ప్రపోజల్ చూసి, నేను జనార్ధనుతో కలిసి మాట్లాడాను. జనార్ధను అప్పటికే సిటీలో ప్రముఖ వ్యాపారవేత్తగా పేరు తెచ్చుకున్నాడు. మేము నలుగురం కలిసి, "జాగృతి ఐ.టి.ఇండస్ట్రీ" అని అమెరికాలో ఐ.టి. ఇండస్ట్రీ స్టార్ట్ చేశాము. వేణుకు కంపెనీ అభివృద్ధి పట్ల ఉన్న నిభద్ధత, నిజాయితీ చూసి, జనార్ధన్ను ఒప్పించి, అతన్ని మా కంపెనీకి సి.ఈ.ఓ.గా నియమించడం జరిగింది."

**వేరొక పేజిలో,** "కంపెనీ పెట్టి ఎనిమిది సంవత్సరాలైంది. వేణు కంపెనీ సి.ఈ.ఓ.గా పూర్తి భాధ్యత తీసుకుని 24 గంటలూ పని చేసేవాడు. సదానందు కూడా అతనితో పాటు శ్రమ పడ్డప్పటికీ, కంపెనీ అనతి కాలంలోనే అద్భుతమైన అభివృద్ధి చూపించిందంటే, అది ముఖ్యంగా వేణు మూలంగానేనని చెప్పాలి. ఇద్దరూ ఒంటరి వాళ్ళేమో, వేరే బాదరాబందీలు లేవు. అయితే, మా ఇద్దరికీ మాత్రం, అటు అమెరికాకు, ఇటు ఇండియాకు తిరగడం కష్టంగా వుంది. ఎందుకంటే, నా ఇండస్ట్రీ నాకుంది. జనార్ధన్ వ్యాపారాలు జనార్ధను కున్నాయి. వేణు, సదానందం ఇద్దరూ టెక్నికల్ గా ఎక్స్ పర్టులే కానీ. వ్యాపార లావాదేవీలు ఏమాత్రం తెలియని వాళ్ళు.

కంపెనీ అమ్మేద్దామనే ప్రోపోజల్ పెట్టాడు జనార్ధనరావు . నాకు, సదానందంకు, వేణుకు అదంత నచ్చలేదు. మా అందరిలోనూ సదానందం, 'కంపెనీ బ్రహ్మాండంగా డెవలప్ అవుతున్న సమయంలో అమ్మేయడమంటే తెలివి తక్కువతనం' అని గట్టిగా వాదించాడు. సదానందంకు మొదటి నుంచీ జనార్ధను పద్ధతులు నచ్చేవి కావు. జనార్ధనుదంతా బిజినెస్ మైండ్. అంతేకాదు, మన ప్రాడక్టు మార్కెటింగ్ చేసేటప్పుడు నీతి, నిజాయితీ అంటూ కూర్చుంటే, మనం వెనకబడి పోతాం అంటాడు. ఆ పద్ధతి నచ్చని సదానందం, ఐ.టి. ఇండస్ట్రీలో ఫెయిర్ గా ఉండాల్సిందేనని అతనితో ఎన్నో సార్లు వాదించి, తన మాటే నెగ్గించుకున్నాడు. ఇది జనార్ధనుకు అతనంటే పడకపోవడానికి మరొక కారణం అయ్యింది.

ఇది జరిగాక, ఒక రోజు జనార్ధను మా ఇంటికి వచ్చాడు. కంపెనీ హై ప్రొఫైల్లో ఉండగా అమ్మటం వల్ల ఎన్ని లాభాలుంటాయో వివరించాడు. "మనం వ్యాపారవేత్తలం. లాభం కోసం పెట్టుబడి పెట్టాం కానీ, మరొక ఉద్దేశ్యంతో కాదు. ఇప్పుడే సదానందం మనల్ని వ్యతిరేకిస్తున్నాడు. ఈ కంపెనీ మల్టీ మిలియన్ డాలర్ కంపెనీ అయిన తర్వాత అసలు మన చేతులు దాటి పోవచ్చు కూడా. నేనొక ఆఫర్ తెచ్చాను. మన కంపెనీకి ఇరవై లక్షల డాలర్లు ఆఫర్ చేస్తోందొక ప్రముఖ కంపెనీ. నలుగురం సమానంగా పంచుకున్నా ఒకొక్కరికి అయిదు లక్షల డాలర్లు వస్తాయి. మన ఇద్దరమే పెట్టుబడి పెట్టాము. అసలు వాళ్ళిద్దరికీ మనతో సమానంగా పంచాల్సిన పని లేదు. అయినా

ఇవ్వడానికి సిద్ధపడుతున్నాను. కారణం ఏమిటంటే, ఇంతమంచి ఆఫరు మళ్ళీ రాకపోవచ్చు. నిజానికి నాకు ఇప్పుడు కంపెనీ అమ్మడం వల్ల వచ్చే డబ్బు చాలా అవసరం. నా వ్యాపారంలో పోటిదార్ల మూలంగా కొద్దిగా నష్టపోయాను. ఇప్పుడు ఈ డబ్బుతో మరికొంత పెట్టుబడి పెట్టి పోటీ తట్టుకుని నిలబడటమో, లేక మరొక వ్యాపారం చూసుకోవడమో చెయ్యాలి. ”

జనార్ధను చెప్పింది విన్నాక, నాకు అమ్మేయడమే మంచిదనిపించింది. రేపు ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు?

ఆ మర్నాడే, ‘మా ఇద్దరికీ అమ్మేయడమే సమ్మతం’ అని కచ్చితంగా చెప్పేశాము. అందరం సమానంగా పంచుకుందామన్న ప్రపోజలుకు, మిగిలిన ఇద్దరూ ఒప్పుకున్నారు. రాతకోతలైపోయాక, జనార్ధను ఏదో అత్యవసర పని అంటూ ఇండియాకు వెళ్ళాడు. కంపెనీ బిజినెస్ వ్యవహారాలలో తలమునకలుగా ఉన్న నాకు సదానందం ఒక రోజు ఫోన్ చేశాడు. తను కూడా ఇండియా వెడుతున్నానని, సేల్ అమౌంటూ రాగానే తెలిజేయమని చెప్పాడు. ఇండియాలో జనార్ధన్ను కలుస్తానని కూడా చెప్పాడు.”

“జనార్ధన్ను కలుసుకున్న తర్వాత నాసిక్ వెడుతూ, సదానందం కారు యాక్సిడెంట్ లో చనిపోయినట్లు తెలిసింది. నాసిక్ సమీపంలో కారు యాక్సిడెంట్ అయ్యి, లోయలో పడి కాలిపోయింది. కారులో ఉన్నవారిలో ఎవరూ బ్రతికి ఉండే అవకాశం లేదని స్పాట్ లో సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నపోలీసు ఆఫీసర్ ఒకరు టి.వి.లో చెప్పారు. నేను అతని బంధువులేవరైనా ఉన్నారేమో, పూర్తి వివరాలు కనుక్కుందామని చూశాను కానీ, వాళ్ళెవరూ లేకపోవడంతో వివరాలు ఏమీ తెలియలేదు”.

సదానందం చనిపోయాడు కనుక, ముగ్గురమే కంపెనీ సేల్ ప్రోసీడ్స్ పంచుకుందామని జనార్ధను అన్నాడు. నేను కూడా అలాగే చెప్పాను, కానీ వేణు అందుకు ఒప్పుకో లేదు. సదానందం షేర్ విడిగా ఉంచాల్సిందేనని, అతను చనిపోయి ఉండడని, వస్తాడని తన నమ్మకమని వాదించాడు. ఒక వేళ అతను చనిపోయి ఉంటే, అతని తాలూకు వాళ్ళెవరైనా వుంటే, అతని వంతు వచ్చిన మొత్తం ఇచ్చేద్దామని పట్టుబట్టాడు. ఇక మేమిద్దరం గత్యంతరం లేక ఒప్పుకున్నాము. లేకపోతే, మొదటికే మోసం వచ్చేటట్లుంది.

ఐతే, చనిపోయిన సదానందం గురించి ఇంతవరకూ వివరాలు తెలియలేదు. తర్వాత వేణు వేరే కంపెనీలో చేరాడు. ఆ తర్వాత స్టాన్ ఫర్డ్ యూనివర్సిటీలో పని చేశాడట. అక్కడినుంచీ కూడా వెళ్ళిపోయి, చాలా సంవత్సరాలయ్యిందని ఇటీవల ఒక మిత్రుడు చెప్పాడు”.

“జనార్ధనరావు హత్య చేయబడ్డాడన్న వార్త తెలిసి, నాకెందుకో అనుమానంగా వుంది. అతన్ని చంపిందెవరు? వేణునా? అసలు అతను ఆ టైపు మనిషి కానేకాదు. వేణు నిజానికి మాకందరికీ మంచి స్నేహితుడు. చాలా పద్ధతిగా నడుచుకునే వ్యక్తి. మా కంపెనీ అభివృద్ధిలోకి రావడానికి ముఖ్య కారకుడు. అంతే కాదు, కంపెనీ సి.ఈ.ఓ. కూడా. సదానందంకు, మాకు మధ్య వారధిగా ఉండేవాడు. అలాంటి మనిషి జనార్ధన్ను హత్య చేశాడంటే నమ్మను. సదానందం చనిపోయాడని నమ్మకంగా తెలిసింది. ఇక జనార్ధన్ను ఎవరు చంపారు?”

ఆ తర్వాత ఏమీ రాసి లేదు.

సాహితి చదువుతున్న డైరీ పక్కన పెట్టి ఆలోచించ సాగింది. ఒకవేళ సదానందం చనిపోకపోతే, ఎక్కడున్నట్లు? ఇన్నాళ్ళు ఎందుకు బయటకు రాలేదు?

అసలు సదానందమే అతన్ని చంపినట్లయితే, అలా చంపటానికి కారణం తన వాటా గురించేనా? “యూ ఛీటెడ్ మీ” అని బెదిరింపు ఉత్తరంలో ఉందంటే, హంతకుడు సదానందం అయి ఉండాలి లేదా, అతని కథంతా తెలిసిన అతని తాలూకా వాళ్ళెవరైనా, సదానందం పేరుతో బెదిరించి ఉండవచ్చు. అయితే, జనార్దనరావు గారిని, రాఘవరావు గారినీ– ఇద్దర్నీ చంపాల్సిన అవసరం ఉందా? ఈ కేసులో రెండు చిక్కు ముడులు కేసు తేలకుండా అడ్డుపడు తున్నాయి. ఒకటి లాకర్ 112, మరొకటి సదానందం మరణం నిజామా కాదా అన్నది. సదానందం మహారాష్ట్ర వాడని తప్ప, అతని వివరాలేవీ తెలియడం లేదు. ఇక లాకరు విషయం. చనిపోయిన రాఘవరావే వేణు అనుకుంటే, ఆ లాకరు వేణు పేరుతొ వుండి ఉంటుందా? ఆ ఆలోచన రాగానే, సాహితి సుజిత్ ఫోన్ తీసుకుని రాగిణికి ఫోన్ చేసింది. రాగిణి ఫోన్ తీయగానే, ప్రసాదుకు ఇమ్మంది.

“ప్రసాదు, నువ్వు మచిలీపట్నంలో, విజయవాడలోను అన్ని బ్యాంకుల్లో, లాకర్ 112 వివరాలు చెక్ చేశావు కదా, ఎక్కడన్నా అదే నెంబరుతో వేణు పేరు మీద లాకరు వున్నదా?” అడిగింది.

“ఒక్క నిముషం ఆగు, నా నోట్ బుక్కులో రాసుకున్నాను. చూసి చెబుతాను.” అని, పది నిముషాల తర్వాత మళ్ళీ ఫోన్ చేశాడు “లేదు రాగిణీ, ఏ బ్యాంకులోనూ 112 లాకరు వేణు పేరుతో లేదు. అయినా ఎందుకట్లా అడిగావు, చనిపోయిన రాఘవరావు పేరు వేణు అని తెలిసిందా?” అడిగాడు ప్రసాదు.

“మూడొంతులు అయ్యి ఉండాలి. అవునూ, నీ ఫ్రెండు ఎవరో స్టాన్ఫర్డ్ యూనివర్సిటీలో ఉన్నారు గదూ?”

“అవును, ప్రకాశరావు అని, అక్కడ కంప్యూటర్ డిపార్టుమెంటులో ప్రొఫెసర్”.

“అక్కడ వేణు పేరుతొ, సుమారొక పది సంవత్సరాల మధ్య కాలంలో, ఎవరైనా పనిచేశారేమో కనుక్కో. అతని పూర్తి పేరు, అంతక్రితం ఏం చేశాడు, మనిషిని గుర్తుపట్టే పుట్టు మచ్చలు లాంటి గుర్తులు ఏవైనా ఉన్నాయా, అక్కడ మానేశాక, ఎక్కడకు వెళ్ళాడు–ఈ వివరాలు అన్నీ కావాలి. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా తెలుసుకో. ఈ వివరాల కనుక్కునేందుకు నీ సెల్ ఫోను ఉపయోగించకు. నీకు మరొక ఫోనుంటే అది వాడు. నాకు వివరాలు చెప్పేటప్పుడు కూడా నీ ఫోనుతో చెయ్యకు. నా నెంబరుకు చెయ్య వద్దు. ఈ నెంబరు నోట్ చేసుకుని, దీనికి చేసి చెప్పు.”

“ఒకే, సాహితీ.” ఫోను పెట్టేశాడు ప్రసాదు.

రాత్రి పడుకుని ఆలోచిస్తున్న సాహితికి అకస్మాత్తుగా ఏదో గుర్తుకు వచ్చి, తన అలమరలో ఫైళ్ళు తీసి ఒక పేపర్ కటింగ్ తీసింది. పేపర్లో ఉన్నది ఒకటికి రెండు సార్లు చదివింది.

పొద్దున్నే లేచి, ముషీరాబాదు జైలుకెళ్ళింది. జైలర్ ఆఫీసు కెళ్ళి, తను వచ్చిన పని చెప్పింది. జైలర్ ముత్తయ్య ఆమె చూపించిన కమీషనరు గారి లెటర్ చూసి, ఆమెను ఖైదీల సెల్ దగ్గరకు తీసుకెళ్ళాడు. సుబ్రహ్మణ్యంను పిలిపించాడు.

సాహితి వైపు చూస్తూ, “ఇతనే మీరు అడిగిన సుబ్రహ్మణ్యం” చూపించి వెళ్ళిపోయాడు.

“మీరు దొడబెట్ట గ్రామ పంచాయితీ సెక్రటరీగా ఉండేవారు కదా!”

"అవును" నిర్లిప్తగా చెప్పాడు.

"చూడండి, ఒక కేసు పరిశోధనలో మీ నుంచీ కొన్ని వివరాలు తెలుసుకోవాలని వచ్చాను. దానికీ, మీ కేసుకీ ఎక్కడో లింకు వుంది. అది తెలిస్తే, మీరు నిర్దోషులుగా బయటపడే అవకాశం వుంది. కనుక, మీరు సందేహించ కుండా నేనడిగే ప్రశ్నలకు జవాబు చెప్పండి".

"నేను ఈ కేసు నుంచీ బయటపడతానన్న ఆశ నాకు లేదు, మేడం. అయినా అడగండి, నాకు తెలిసినంతవరకు చెబుతాను".

"మంటల్లో కాలి చనిపోయిన మీ సర్పంచి పేరు వేణుమాధవే కదా!"

"అవును మేడం"

"ఆయనకు స్నేహితులు ఎవరైనా వున్నారా? మీకు వాళ్ళెవరైనా తెలుసా?"

"ఆయన నాకెన్నడూ తన స్వంత విషయాలు చెప్పలేదు. మొదట్లోనే తను ఒంటరి వాడినని, అనాధాశ్రమంలో పెరిగానని చెప్పారు. అందువల్ల నేనెప్పుడూ ఆయన్ను ఏమీ అడగలేదు".

"అతను స్టాన్ఫర్డ్ యూనివర్సిటీలో చేశాడన్నారు. మీరు అతనితో ఎక్కువగా కలిసి తిరిగారు కదా, అతన్నిచూడగానే గుర్తు పట్టేందుకు ఏవైనా గుర్తులూ వుంటే చెప్పగలరా?"

"అవును మేడం, ఆయన ఎం.ఏ., ఏం.ఎస్,సి., పి.హెచ్.డి. చదివారు. స్టాన్ఫర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేసారట. ఆయన చాలా మంచి వ్యక్తి మేడం. అన్యాయంగా ఆయన్ను చంపేశారు. మీరు అడుగుతుంటే గుర్తుకు వస్తోంది. ఆయన ఎడమ చేతి మణికట్టు పైన పెద్ద పుట్టుమచ్చ వుంది."

"నిజంగా ఆయన చనిపోయి ఉంటారా?" అడిగింది సాహితి.

"ఆయన నిద్రపోతున్న ఇంటికి గొళ్ళెం పెట్టి తగలబెట్టారు. మంటలు చూసి, నేను పరిగెత్తుకు వెళ్ళాను. ఆయన్ను నేనే చంపానని రాత్రికి రాత్రి నన్ను అరెస్టు చేశారు మేడం."

"సరే, మీరు నిశ్చింతగా ఉండండి. మిమ్మల్ని విడిపించే భారం నాది. కానీ, మీరు ఏమాత్రం మీ సంతోషాన్ని బయటికి కనిపించనీయ కూడదు . మీ కేసులో పెద్దవాళ్ళెవరో వెనకాల వున్నారు. అందువల్ల, నేను వచ్చిన విషయం కూడా మరెవరికి చెప్పవద్దు. మీ భార్య కానీ, మామ గారు కానీ వచ్చినప్పుడు, వాళ్లతో, వేణుగారి ఫోటో వుంటే, నాకు అర్జెంటుగా ఇమ్మని చెప్పండి. నా ఫోన్ నెంబర్ ఇదిగో" అంటూ నెంబర్ ఇచ్చింది సాహితి.

"అలాగే, మేడం" అంటూ నమస్కారం పెట్టాడు సుబ్రహ్మణ్యం.

సాహితి జైలర్ దగ్గరకు వెళ్ళి, థాంక్స్ చెప్పి వస్తుండగా, "మీ రోచ్చిన పని అయ్యిందా?" అంటూ అడిగాడు.

"నాకు కావాల్సిన సమాచారం దొరక లేదు. నేను పరిశోధించే కేసుకు ఇతనికి సంబంధం ఉన్నట్లు లేదు" అని చెప్పింది సాహితి.

‘ఎవరో మీకోసం వచ్చార’ని పనిమనిషి చెప్పడంతో సాహితి లేచి హాల్లోకి వెళ్ళింది. వచ్చినాయన పంచె, కండువా వేసుకుని పెద్ద మనిషిలా వున్నాడు. “నేను వేణుమాధవ్ పనిచేసిన హైస్కూలు హెడ్ మాస్టరు నమ్మా, నాపేరు సుబ్రహ్మణ్య శర్మ.” అన్నాడు నమస్కారం చేస్తూ.

“కూర్చోండి “అంది సాహితి ప్రతి నమస్కారం చేస్తూ.

ఆయన తన లాల్చీ జేబులోంచి ఫోటో తీసి ఇస్తూ, “మీరు వేణు ఫోటో అడిగారట, తీసుకువచ్చాను.”

“మీరేమైనా అతన్ని గురించి ఇంకా వివరాలు చెప్పగలరా?” అడిగింది సాహితి.

“అన్నీ మీకు తెలిసినవేనమ్మా. అతను మనిషి చాలా మంచివాడు, నిస్వార్ధ పరుడు. ఆ రోజు వేణు చనిపోలేదమ్మా! ఆ సంఘటన జరిగిన చాలా రోజులకు నాకొక రిజిస్టరు పోస్టులో అతని డైరీ పంపాడమ్మా. అదృష్టవశాత్తు మా స్కూలుకు అప్పుడప్పుడూ రిజిస్టరు పోస్టులు వస్తుంటాయి కనుక, ఎవరికీ అనుమానం రాలేదు. అందులో విషయాలు బయటపెడితే ఎక్కడ నాప్రాణానికి ప్రమాదమోనని ఈ డైరీ జాగ్రత్తగా దాచాల్సి వచ్చింది . మీరు ఈ కేసు పరిశోధిస్తున్నారని తెలిసి, అది మీ కిద్దామని నేను రహస్యంగా వచ్చాను” అన్నాడు.

సాహితి ఆ డైరీ అందుకుంటూ, చెప్పింది.

“చాలా మంచి పని చేశారు. నిజంగా మీకు థాంక్సు చెప్పాలి. మీరు మరో పని కూడా చెయ్యాలి. సుబ్రహ్మణ్యం కేసు ఆలశ్యం చెయ్యకుండా, హైదరాబాదులో మంచి లాయరును చూసి, వెంటనే హైకోర్టు లో అప్పీలు చెయ్యమన్నానని వాళ్ళకు చెప్పండి. నేను అతన్ని బయటకు తెస్తానని మాటిచ్చాను. కానీ, నేను డైరెక్టుగా కేసు టేకప్ చేసేందుకు వీలు లేదు. అతని విడుదలకు కావాల్సిన సాయం చేస్తాను. ఇది మూడో కంటికి తెలియకూడదు జాగ్రత్త!”

శర్మ ఆమెకు నమస్కరించి వెళ్ళిపోయాడు.

సాహితి లోపలికి వచ్చి, వేణు డైరీ తీసుకుని చదివింది.

“నా గురించి కొన్ని వివరాలు చెప్పాల్సిన అవసరం వుంది.

నా పూర్తి పేరు వేణుమాధవ్. నేనొక కంపెనీకి సి.ఈ.ఓ.గా పనిచేశాను. తర్వాత కొన్నీ సంవత్సరాలు కాలిఫోర్నియా యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేసి, మన దేశ పరిస్థితులను కొంతైనా చక్క దిద్దాలనే ఆశయంతో వచ్చేశాను. మన దేశంలో లాగానే, అమెరికాలో బీదరికం వుంది, నిరుద్యోగమూ వుంది. ముఖ్యంగా ఇక్కడ “బ్లాక్సు” అనుభవిస్తున్న బాధలు చెప్పలేనన్ని. కుల, మత రాజకీయాలతో కుళ్ళిపోయిన మన దేశ యూనివర్సిటీలు నన్ను గుర్తించకపోయినా, అమెరికా నన్ను ఆదరించింది. ఇక్కడ యూనివర్సిటిలు నన్నొక మనిషిగా, ఒక ప్రొఫెసరుగా నిలబెట్టాయి. అందువల్ల, నేను సంపాదించిన ఆస్తిలో కొంత ఇక్కడి “బ్లాక్సు” అభివృద్ధికోసం ఒక ట్రస్టుకు రాసేశాను. అయితే, ఇండియాలో పరిస్థితులు నేననుకున్న దానికన్నా అధ్వాన్నంగా ఉన్నయని ఇక్కడికి వచ్చాక నాకర్ధం అయ్యింది.

మా పూర్వీకుల ఊరు దొడబెట్ట గ్రామానికి వచ్చాను. ఊరికి సరైన రోడ్డు లేదు. స్కూల్ ఉందన్న మాటే కానీ, గోడలన్నీ నల్లబారి, ఎప్పుడు పడిపోతాయో అన్నట్లున్నాయి. తరగతి గదులు ఏనాడు వెల్ల వేయించినట్లు లేదు. ఆడపిల్లలకు విడిగా బాత్రూముల మాట అటుంచి,

అసలు స్కూలు మొత్తానికి ఒక్కటే బాత్రూము. ఫ్రీగా చదువు చెబుతానని స్కూల్ హెడ్ మాస్టరు గారిని ఒప్పించి, స్కూలు పిల్లలకు జనరల్ నాలెడ్జితో పాటు, మోరల్ సైన్సు, అవసరమైన లెక్కల్లాంటి సబ్జెక్టులలో వాళ్ల సందేహాలకు ప్రైవేటు క్లాసులు తీసుకుని చెప్పడం లాంటివి మొదలుపెట్టాను. సర్పంచ్ గారి అబ్బాయి మంచి మార్కులతో ఎస్.ఎస్.సి. పాసవడంతో, ఆయనకు నాపై గురి కుదిరింది. నెమ్మదిగా ఆయనతో స్నేహం పెంచుకుని, పంచాయితీ నిధులతో గ్రామానికి రోడ్డు, స్కూలులో మరో రెండు బాత్రూములు కట్టించాను. ఈ లోగా అసెంబ్లీ ఎన్నికలొచ్చాయి. సర్పంచ్ సుదర్శన్ గారిని అధికార పార్టీ, ఏం.ఎల్.ఏ. అభ్యర్థిగా నిలబెట్టింది. ఎన్నికల సమయంలో నేను ఆయన తరఫున బాగా ప్రచారం చేశాను. గెలిచిన తర్వాత, ఆయనలో చాలా మార్పు వచ్చింది. నాతో మాట్లాడటమే తగ్గిపోయింది. స్కూల్లో ఆరో తరగతి గది గోడ, వానలకు నాని, పడిపోయింది. ఆ గోడ కట్టించేందుకు నేను ఆయనతో ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా, ఫలితం లేక పోయింది. నేను స్వంత డబ్బు ఖర్చు పెట్టి గోడ కట్టించాను. రాబోయే ఎన్నికల్లో, తన పదవికి నేను పోటీ వస్తానేమోనన్న భయం ఆయనకు మొదలైంది. అసలు నాపై హత్యాప్రయత్నం కూడా అందుకే చేయించాడు.

నేను ఏనాడు తనకి అపకారం తలపెట్టలేదు. పదవులపై నాకు అసలు ఆసక్తి లేదని అనేక సార్లు స్పష్టం చేశాను. ఎం.ఎల్.ఏ. గారి అనుయాయులు, దీపావళి నాడు నేను ఇంట్లో పడుకుని ఉండగా, ఇంటికి నిప్పు పెట్టారు. అదృష్టవశాత్తు, నేను చదువు చెప్పిన ఎం.ఎల్.ఏ. గారి కొడుకే, చివరి నిమిషంలో నా ఇంటి వెనక వైపు వచ్చి, అర్జెంటుగా నా సూట్ కేసు తీసుకోమని, నన్ను మోటార్ సైకిల్ పై ఊరి అవతల దింపేశాడు. విషయం అతను చెప్పేదాకా నాకు అర్థం కాలేదు. అప్పటికే దూరంగా ఇల్లు కాలిపోతున్నట్టు పొగలూ, మంటలూ కనిపించాయి. ఆ పరిస్థితుల్లో ఏం చెయ్యలేక, బస్సెక్కి ఊరు వదిలి వెళ్ళిపోయాను. పాపం, రోజూ నాకు తోడుగా పడుకునే నా శిష్యుడు భాషా ఆ రోజు మంటలలో కాలి, మసి అయిపోయాడు. అతని కుటుంబం రెక్కాడితేగాని డొక్కాడని వాళ్ళు. అతని తల్లిదండ్రులు ఇక్కడ బతకలేక, కూలీ పనికోసం హైదరాబాదు వలస వెళ్ళిపోయారు. శత్రువులు నేను ఇంటి నుంచీ బయటకు రహస్యంగా వెళ్ళిపోవడం చూడలేదు. నేను చనిపోయానని ఆ నేరం మా పంచాయితీ సెక్రటరీ సుబ్రహ్మణ్యంపై తోసి, కేసు పెట్టినట్లు పేపరులో చూశాను. మరోపక్క అటు సదానందం మరణం ప్రమాదవశాత్తు జరిగింది కాదేమోనని నా అనుమానం. మేమిద్దరం ఒంటరి వాళ్ళం అవడం వల్ల, ఇండస్ట్రీ అమ్మేసిన మొత్తంలో మా వాటా కూడా తామే తీసుకోవాలని, మిగిలిన ఇద్దరు పార్టనర్సులో ఆశ మొదలైందని నా అనుమానం.

నన్ను కూడా వీళ్ళు ఎప్పుడో చంపవచ్చు. అందువల్ల, నేను విల్లు రాసి, ఈ లాకరులో ఉంచుతున్నాను. నా తదనంతరం నా మిత్రులు హెడ్ మాస్టారు సుబ్రహ్మణ్య శర్మ గారు, మా పంచాయితీ సెక్రటరీ సుబ్రహ్మణ్యంలకు ఈ ఎకౌంటు ఆపరేట్ చేసేందుకు విల్లులో రాస్తున్నాను. నా వంతుగా వచ్చిన మొత్తంలో మూడు లక్షల రూపాయలు నేను పెరిగిన అనాథాశ్రమానికి ఇవ్వాలి. దాని వివరాలు విల్లులో రాశాను. నా ఎకౌంటులో అయిదు లక్షల రూపాయలు మా ముత్తాత ఊరు దొడబెట్ట గ్రామాభ్యుదయానికి ఖర్చు చేయాలి. మిగిలిన మొత్తంలో నా స్నేహితుడు, సెక్రటరీ సుబ్రహ్మణ్యంకు, నా శిష్యుడు భాషా కుటుంబానికి చెరొక అయిదు లక్షల రూపాయలు ఇవ్వాలి. ముఖ్యంగా భాషా చనిపోవడానికి, మా సెక్రటరీకి జరిగిన అన్యాయానికి నేను కారణ మైనాను. మా హెడ్ మాస్టర్ గారికి రెండు లక్ష రూపాయలు ఇవ్వాలి. వాళ్ళిద్దరూ గ్రామాభివృద్ధికోసం పనిచేస్తున్నందుకు, నెలనెలా వాళ్ళ వాళ్ళ జీతాలెంత వస్తున్నాయో, అంత జీతం తీసుకోవాల్సిందిగా విల్లు రాశాను. వాళ్ళిద్దరూ నా ఆశయాలతో ఏకీభవిస్తూ, అడుగడుగునా నాకు సలహాలు ఇస్తూ, నన్ను ముందుకు నడిపించారు. నేను ఆశించిన

మార్పు ఈ సమాజంలో ఇప్పుడే వస్తుందాని నేను మధన పడుతున్నప్పటికీ, మా సుబ్రహ్మణ్యంలు ఇద్దరూ నా ఆశయాలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తారని నాకు నమ్మకం వుంది.

ఇక సదానందం– రూ. ముప్పై అయిదు లక్షలూ అతని వాటా. తనకో తమ్ముడున్నాడని తెలుసుకున్నానని సదానందం ఇండియా వచ్చాక నాకు ఫోను చేశాడు. అతని పేరు సుధీర్ అని చెప్పాడు. కానీ, ఇప్పుడు అతనెక్క డున్నాడో తెలియదు. ఆ మొత్తం ఈ బ్యాంకులోనే మరొక ఎకౌంటులో వుంది. ఆ అమౌంటు సదానందం బ్రతికి ఉంటే అతనికి, అతను చనిపోయిఉంటే వాళ్ళ తమ్ముడు సుధీరుకు చెందాలి. ముందు జాగ్రత్తగా, దీనికి సంబంధించి వేరే అగ్రిమెంటు రాసేయడం జరిగింది. ఇందులో మరెవరికి హక్కు లేదు."

చివర పేజీలలో ఒక చోట మాత్రం వేరే సింబల్సుతో ఏదో రాసి వుంది. బహుశా ఇదేదో ముఖ్యమైంది కావచ్చు. ఈ సీక్రెట్ కోడ్ ఏమిటో? మళ్ళీ తనకో పరీక్ష?

ఈ ఒక్కటి సీక్రెట్ కోడ్ లో ఎందుకు రాసాడో? మరెవరి చేతుల్లో అన్నా పడితే, వాళ్లకు అర్ధం కాకుండా ఉండాలనా? ఇదేదో కొత్త కోడ్ లాగా వుంది. ఒకసారి గూగుల్ సీక్రెట్ కోడ్ లాంగ్వేజెస్ చూస్తే ఎమన్నా దొరక వచ్చేమో!

U++U+ +++++ +++FF +++++ +PP+P +++++ +PP+P +++FF

+++++ +OO++ +QQQ+ W+W++ +PP+P V++VV

+K+++ +PP+P +++++ +PP+P +++++ +++E+ +++E+ +QQQ+ W+W++ +PP+P V++VV

+QQQ+ +RRRR ++G++ +PP+P ++G++ +++FF +K+++ +PP+P +L++L +K+++ +QQQ+ V++VV

+PP+P +++++ +OO++ ++G++ U++U+

+++FF ++G++ V++VV +++++ +K+++ +N+NN U++U+ +K+++ +PP+P

+N+NN +QQQ+ +++E+ +M+M+ ++G++ T+++T 112 +K+++ +PP+P

+++FF +K+++ +++++ +OO++ +PP+P +++FF ++++D +++++ +PP+P +M+M+

+++++ ++++D +K+++ +++FF U++U+, ++JJJ ZZ+++ +++FF ++G++ T++++T +++++ ++++D +++++ +++FF

ఇది ఫ్రాన్సిస్ బేకన్ సృష్టించిన సబ్ స్టిట్యూషన్ సైఫర్ కోడ్ కు దగ్గరలో ఉంది.

ఒక సారి ఆ రాసింది మొత్తం పరీక్షగా చూసింది. ఒకటి నుంచి 5 దాకా ప్లస్ గుర్తులూ, ప్లస్ గుర్తుల పక్క ఒకటి గానీ, రెండు, లేదా మూడు,లేదా నాలుగు అక్షరాలూ, కలిపి 5 చప్పున వున్నాయి. ఐదేసి కలిపి ఒక మాటగా తీసుకోవాలి అనుకుంది సాహితి. ఒక చోట 112 నెంబరు కనిపించింది. అమ్మయ్య, ఒక క్లూ దొరికినట్లే అనుకుని ఊపిరి పీల్చుకుంది. 112 పక్కన ఉన్న అక్షరాలు చూసింది. ఇంగ్లీష్లో లాకర్ కు (LOCKER) 6 అక్షరా లున్నాయి. 112 అంకె వెనక ఉన్న 6 అక్షరాల సింబల్స్ పరీక్షగా చూసింది.

మొదటి అక్షరం L కు +N + NN అనుకుంటే, O కు +QQQ+ , C కు +++E +, K కు +M +M +, E కు ++G ++, R కు T ++T అయ్యిండాలి. కామను గా వాడిన + తో, ఇంగ్లీష్ లో ప్రతి అక్షరానికి ఆ తర్వాతి రెండో అక్షరం ఉపయోగించడం జరిగింది. అది అర్ధం అయ్యాక, ఇక దాన్ని 'డీ కోడ్' చెయ్యడం సులువైంది సాహితికి.

Sadanand amount is in an account opened in our joint names. Details in locker 112 with Diamond Bank in Abids, Hyderabad.

పొద్దున్నే లేచి హైదరాబాద్ బయల్దేరి వెళ్ళింది సాహితి. విజయవాడ కమీషనర్ రాసిచ్చిన లెటర్ తీసుకుని హైదరాబాద్ కమీషనర్ ఆఫీసుకు వెళ్ళింది. కమీషనర్ ఒక లెటర్ రాసి, మరొక ఇనస్పెక్టరును ఇచ్చి పంపాడు.

రాత్రి ప్రసాదు ఫోను చేశాడు. అతను చెప్పింది విని, "గుడ్" అని చెప్పి ఫోన్ పెట్టేసి, తర్వాత తను చెయ్యాల్సిన కార్యక్రమం గురించి ఆలోచించింది.

మర్నాడు పొద్దున్న మచిలీపట్టణం సూపరింటెండెంట్ గారికి, విజయవాడ కమీషనరు గారికి ఫోన్లు చేసి తన ప్లాను వివరించింది.

సాహితి తనకు బాగా పరిచయం ఉన్న విలేఖర్లతో జనార్ధనరావు, రాఘవరావు గార్ల హత్య కేసులు గురించి సర్కిల్ ఆఫీసులో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయించింది. ప్రెస్ మీట్ లో సర్కిల్ ఇనస్పెక్టర్ రఘువీర్ కేసు వివరించాడు.

"వేణు మాధవ్, సదానంద్ అనే ఇద్దరు కంప్యూటర్ స్పెషలిస్టులు, జనార్దను గారు, రాఘవరావు గార్లతో కలిసి అమెరికాలో ఐ.టి. ఇండస్ట్రీ పెట్టి, అది మంచి అభివృద్ధిలోకి వచ్చాక అమ్మేసి, వాటాలు పంచుకున్నారు. వారిలో సదానందు సేల్ డీల్ ఫైనల్ అయ్యే సమయంలో, ఇండియా వచ్చి, యాక్సిడెంటులో చనిపోయాడు. ఆ తర్వాత వేణు కూడా ఇండియా వచ్చేసి వేరొక పల్లెలో ఉంటూ, అకస్మాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చి, చనిపోయాడు. సదానందు వాటాయే ముప్పై అయిదు లక్షలుంది. అతను చనిపోవడంతో, అతని వారసులెవరో తెలాక, ఆడబ్బు వాళ్లకు అప్పజెప్పడం జరుగుతుంది".

"ఎవరి వాటా ఎంత వచ్చిందో, ఆ వివరాలు మీకు ఎక్కడ దొరికాయి? నలుగురు పార్టనర్సు చనిపోయారు కదా?" ఒక లేడీ పత్రికా విలేఖరి అడిగింది.

"సదానందు మరణం సహజమైనదేనా? జనార్దను గారికి వచ్చిన బెదిరింపు ఉత్తరాల మాటేమిటి? దాన్నిబట్టి చూస్తే, సదానందును చంపించింది జనార్ధనరావు గారేమోనని, అందువల్లే, జనర్ధనరావు గార్ని చంపింది సదానందం బంధువు లెవరైనా అయిఉండవచ్చని మీకు అనుమానం రాలేదా?" ఒక విలేఖరి అడిగాడు.

"చెప్పలేం, ఖచ్చితంగా వివరాలు తెలుసుకోవడానికి మరింత సమయం పడుతుంది" చెప్పాడు రఘువీర్.

"ఔను సార్, మరి రాఘవరావు గార్ని చంపింది ఎవరు?" మరొక విలేఖరి అడిగాడు.

"ఆ వ్యక్తే అయ్యుండవచ్చు".

"ఇంతకు ముందు కూడా రాఘవరావు అనే అతను  చని పోయాడని, అతని డైరీలో లాకరు నెంబరు 112 అని తప్ప వేరే వివరాలేవీ లేవని, అతన్ని గుర్తుపట్టగల వాళ్ళెవరైనా వుంటే, వివరాలు చెప్పవలసిందని మీరు పేపర్లో ప్రకటించారు. అతనికి, ఈ రాఘవరావుగారికి ఏమైనా సంబంధం ఉందా?"

"అతను రాఘవరావు కాదు. అతని అసలు పేరు వేణుమాధవ్. అతనే ఈ కంపెనీలో సి.ఈ.ఓ." అనేసి,  ఆ తర్వాత గతుక్కుమన్నాడు రఘువీర్.

"వేణు మాధవ్ అనే అతను దొడబెట్ట గ్రామానికి సర్పంచి అనీ, ఆ గ్రామ పంచాయితీ సెక్రటరీ, పంచాయితీ నిధులు కాజేసి, అతని ఇంటికి నిప్పు పెట్టి చంపేశాడనీ, అప్పట్లో పెద్ద సెన్సేషన్ గా చెప్పుకున్న కేసు. అది జరిగి చాలా రోజులయ్యింది కదా? ఆ వేణు మాధవు, ఇతను ఒకరేనా? అలా అయితే, అప్పుడు  వేణు మాధవ్ చనిపోలేదా?" అడిగాడు సీనియర్ విలేఖరి.

రఘువీర్ నిస్సహాయంగా సాహితి వైపు చూశాడు.

లేడీ విలేఖరి సాహితిని అడిగింది, "చెప్పండి మేడం, మాకు వివరంగా చెప్పండి. అసలు కేసు తేలిపోయినట్లేనా? హంతకుడు ఎవరో తెలిసిందా? ఈ వేణు అనే ఆయన ఎప్పుడు, ఎక్కడ చనిపోయాడు? ఇల్లు తగలపెట్టి, అతన్ని చంపుదామని చూసింది ఎం.ఎల్.ఏ. గారి మనుషులేనా?"

సాహితి చిరునవ్వు నవ్వింది. "ఈ కేసులో కొన్ని విషయాలు ఇంకా తేలాల్సి వుంది. కొన్ని కారణాల వల్ల మేము అన్ని విషయాలను వివరించి చెప్పలేము. అయితే, మేము మిమ్మల్ని కోరేదేమిటంటే, మీ పేపరు న్యూస్ చూసి, సదానందు తాలుకు వాళ్ళెవరైనా ముందుకొస్తే, చాలా వరకు కేసు తేలిపోతుంది. వాళ్ళకు చేరాల్సిన డబ్బు వాళ్ళకు అందుతుంది."

"మేడం, మీరు మాకు డీటెయిల్సు చెప్పకుండా, ఏదో రాయమంటే ఎలా రాస్తాము?"ప్రశ్నించాడు ఒక సీనియర్ విలేఖరి.

"సరే, మీకు వివరాలు చెబుతాను కానీ, అదంతా మీరు పేపర్లో రాయవద్దు. కొన్ని విషయాలు వివరంగా, రాస్తే నష్టమే తప్ప, లాభం ఉండదు.

వేణుమాధవ్, సదానందు, జనార్ధనరావు, రాఘవరావు —ఈ నలుగురూ ఐ.టి. కంపెనీ పార్టనర్స్. కంపెనీ సేల్ చేసి వచ్చిన డబ్బు ఒకొక్కరూ ముప్ఫై అయిదు లక్షల దాకా పంచుకున్నారు. జనార్ధను, రాఘవరావులు ఇండియా వచ్చేసి, వాళ్ళకు అప్పటికే ఉన్న వ్యాపారాలు చూసుకుంటే, వేణు అక్కడే కొన్నాళ్ళు వేరే కంపెనీలోనూ,ఆ తర్వాత స్టాన్ఫర్డ్ యూనివర్శిటీలోను పనిచేసి ఇండియా వచ్చేశాడు. తన స్వగ్రామమైన దొడబెట్టకు వచ్చి, అక్కడ ప్రజల అభిమానాన్ని చూరగొని, సర్పంచి అయినాడు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అతనిపై హత్యాయత్నం జరిగింది. అదృష్ట వశాత్తూ అతను తప్పించుకుని, ఆ ఊరు వదిలి వెళ్ళిపోయాడు. పేరు , వేషం కూడా మార్చుకుని మరొక పల్లెలో తన ప్రజాసేవ కొనసాగిస్తున్నాండగా హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయాడు."

"ఈ వేణు మాధవ్ ను దొడబెట్ట గ్రామంలో చంపాలని చూసిన వ్యక్తులెవరు? దానికి కారణం ఏమిటో మీకు తెలియదా? అక్కడ అధికార పార్టీ ప్రతినిధులే ఈ పని చేయించి, పంచాయితీ సెక్రటరీపై నెట్టారని అప్పట్లో ప్రజలు అనుకున్నారు కదా?" సీనియర్ విలేఖరి ప్రశ్నించాడు.

"మీరు సదానందు విషయం చెప్పలేదు. అతను సేల్ డీల్ ఫైనల్ అయినా వెంటనే చనిపోయాడని అన్నారు కదా? అతని మరణం సహజమైన్దేనా? లేక, మరేవరిదైనా ప్రేమేయం ఉందా? అతను వంటరి వాడన్నారు కదా?మరి అతని తాలుకూ వాళ్ళెవరైనా వున్నారా?" అడిగింది లేడీ విలేఖరి.

"సదానందు యాక్సిడెంట్ లో మరణించాడనే తెలుసు. పూర్తి వివరాలు మాకింకా అందాల్సి వుంది. ఇక వేణు మాధవ్ పై ఆ గ్రామంలో జరిగిన హత్యా ప్రయత్నం వేరే కేసు. దాన్ని గురించి ఇప్పుడేం చెప్పలేము. ఈ సదానందు తాలుకూ మనుషులు బయటకొస్తే గానీ, కొన్ని విషయాలు తేలవు. అందుకే ఈ ప్రెస్ మీటు ఏర్పాటు చేశాము."

"సరే మేడం, ఈ కేసు పరిశోధనలో మీ ప్రేమేయం వున్నట్లు రాయవచ్చా?" అడిగాడు సీనియర్ విలేఖరి నవ్వుతూ.

"ఒద్దు, నా ప్రసక్తి తేవద్దు. మీరు రాయకపోయినా, శత్రువులు నన్ను కనిపెడుతూనే వున్నారు. విజయవాడకమీషనరు గారు, మచిలీపట్టణం సూపరింటెండెంటు గార్ల పర్యవేక్షణలో, సర్కిల్ ఇనస్పెక్టర్ రఘువీర్ ఆధ్వర్యంలో ఇనస్పెక్టర్ నిశ్చల్, ఇనస్పెక్టర్ ప్రసాదులు పరిశోధన చేస్తున్నట్లు రాయండి."

రఘువీర్ ముఖం వికసించింది. విలేఖర్లు సాహితికి, రఘువీర్, ప్రసాదులకు బై చెప్పి వెళ్ళిపోయారు.

మర్నాడే తను పిలిచిన నలుగురు విలేఖర్ల తాలుకూ పేపర్లలో, "చిక్కుముడి పడిన జంట హత్యల కేసు!" అంటూ ఒకదాన్లో, "ఇంకా విడని జనార్ధను హత్య కేసు" అని మరొక దాన్లో, ఇలా వేర్వేరు హెడ్డింగులతో, అనుకున్న విధంగా న్యూసు రావడం చూసి,"ఓకే" అనుకుంది సాహితి. మరొక పేపరు తీసి చూసింది. "నలుగురు పార్టనర్స్ మరణాల మిస్టరీ." అంటూ హెడ్డింగ్ పెట్టి, "పార్టనర్సు అందరూ చనిపోయారు. సదానందం వాటా వాళ్ళ తమ్ముడికి ఎలా చేరుతుంది? అసలతను బతికే వున్నాడా, లేక అతను కూడా యాక్సిడెంటులో చనిపోయాడా? వేణు మాధవ్ ను చంపటానికి పన్నాగం పన్నింది ఎం.ఎల్.ఏ. సుదర్శన్ మనుషులేనా?" అంటూ వేణు మాధవ్ మరణం మీద ఎక్కువ రాశాడు. ఇతనెవరో తను పిలిచినతను కాదు. కొంచెం డిఫరెంటుగా రాశాడు అనుకుంది సాహితి.

పొద్దున్నే ఫోను చేసింది రాగిణి. "ఆయన ఆఫీసు పని మీద ఎక్కడికో వెడుతున్నారట."

"అవును రాగిణీ, నాతో చెప్పాడు. నిన్ను మా ఇంట్లో దింప మన్నాను. ఇక్కడ నీకేం భయం లేదు. హాయిగా నాల్గు రోజులు రెస్టు తీసుకుందువుగానీ." చెప్పింది సాహితి.

"అమ్మో, నాలుగు రోజులే!" కంగారుగా అనేసింది రాగిణి.

"మరేం పరవాలేదులే. నేనుంటానుగా. ఇది నీ ఇల్లే అనుకో. ఇద్దరం హాయిగా సినిమాలు చూస్తూ గడిపేద్దాం."

ప్రసాదు రాగిణిని సాహితి ఇంట్లో దింపేసి వెళ్ళిపోయాడు.

నాలుగో రోజు సాయంత్రం ప్రసాదు వచ్చేసరికి రాగిణి "అమ్మయ్య" అని ఊపిరి పీల్చుకుంది.

ప్రసాదు చెప్పింది విని, "ఇప్పుడు కథ మళ్ళీ మొదటి కొచ్చింది. ఈ కేసులో ఒకదానికొకటి లింకు వున్నట్లు తెలుస్తోంది. కానీ, ఎక్కడిక్కడ చిక్కుముడి పడిపోతోంది. ఎక్కడో మనమే కొన్ని పాయింట్లు మర్చిపోయామేమో. లేదా, ఏవైనా క్లూలు వదిలేశా మేమో, ప్రశాంతంగా కూర్చుని ఆలోచించాలి. రాత్రి ఆపని చేద్దాం. మీ ఇద్దరూ రాత్రి భోజనం చేశాక వెళ్ళండి. ఇప్పుడు ఇంటికెళ్ళి రాగిణీ అవస్థ పడడం ఎందుకు?" చెప్పింది సాహితి.

భోజనం చేశాక, సాహితి కేసుకు సంబంధించి రివ్యూ మొదలు పెట్టింది. ప్రసాదు, రాగిణి వింటూ కూర్చున్నారు.

"మొదట వేణు మాధవ్ అనే అతను రాఘవరావు అనే మారు పేరుతో, బీదలకు అన్నదానం చేస్తూ చనిపోవడంతో మన కేసు మొదలైంది. ఇతనికి సంబంధించి ఒక డైరీ అందులో సీక్రెట్ కోడ్ లో లాకర్ 112 అన్న ఒక మాట తప్ప ఏమీ క్లూ దొరకలేదు. పోస్ట్ మార్టం రిపోర్టులో అతను హార్ట్ ఎటాక్ వల్ల మరణించినట్లు నిర్ధారించారు. కనుక, హంతకుడికి ఈ మరణంతో సంబంధం లేదు. అంటే, అతను చంపలేదు. ఎందుకని? అతనెక్కడున్నాడో తెలియకా? లేక, అతను హంతకుడి పక్షాన వున్నాడనా? నలుగురి పార్టనర్సులో అతను చనిపోయినట్లు మిగతా వారికి తెలియదా? తెలిసినా, తెలియనట్లు ఊరుకున్నారా? ఇక అతని డైరీ ఎవరు, ఎందుకు ఎత్తుకు పోయారు? లాకరు 112 అనే కోడ్ తెలిసిన వాళ్ళు జనార్ధన రావు, రాఘవరావు–ఈ ఇద్దరే కనుక వాళ్ళలో ఎవరో డైరీ దొంగతనం చేయించి ఉండాలి. వాళ్ళిద్దరూ చనిపోయారు కనుక, డైరీలో అంతకంటే ముఖ్యమైన విషయాలు లేవు కనుక, దాని సంగతి వదిలేద్దాం.

సదానందు యాక్సిడెంటులో చనిపోయినట్లు మహారాష్ట్ర పోలీసులు నిర్ధారించారు. అతని తమ్ముడని అనుకుంటున్న సుధీరు తీవ్ర గాయాలతో హాస్పిటల్లో చేరాడని మనకు ఆలశ్యంగా నైనా తెలిసింది. ఈ యాక్సిడెంటులో జనార్ధనరావు పాత్ర ఏమైనా వున్నదా?

తర్వాత జరిగింది జనార్ధనరావు హత్య. చనిపోయింది అతనేని నిర్ధారించిన వాళ్ళు అతని కొడుకు, భార్యా. ఇంట్లో అందరి దగ్గరా వాంగ్మూలం తీసుకున్నారా? అతనింట్లో అప్పుడు ఎంతమంది వున్నారు? వీళ్ళంతా నమ్మదగ్గ వాళ్ళేనా?మూడవ లెటర్ వచ్చినప్పుడు ఆయన ఎందుకు కంగారు పడ్డాడు? పోలీసులకు మళ్ళీ ఎందుకు రిపోర్టు చెయ్యలేదు? లాకర్ ఎందుకు మార్చాడు? బెదిరింపు ఉత్తరాల గురించి రాఘవరావుకు ఎందుకు చెప్పలేదు? లాకరులో ఆయన దాచిన రహస్యం ఏమిటి?

ఇక చివరగా జరిగినది రాఘవరావు హత్య. కారులో ఉన్నది అతనొక్కడే. అంటే, అతనే డ్రైవ్ చేస్తూ వస్తున్నాడా? మరి అక్కడ హత్యా స్థలంలో ఎందుకాగినట్లు? ఎవరన్నా కారు ఆపారా? రిపోర్టులో హత్య జరిగిన తీరు వర్ణించడం అంత క్లియర్ గా లేదు. బహుశా అతన్ని హాస్పిటలుకు తీసుకెళ్ళే హడావుడిలో హత్యాస్థలం పరిశీలించినట్లు రాయలేదు. అప్పుడే వెతికితే ఏవైనా క్లూలు దొరికేవేమో? ఈయన తన లాకరు ఎందుకు మార్చలేదు? తనకు ప్రమాదం ఉందేమోనని అనుమానం రాలేదా? ఇక ఇతని ఇంట్లో వాళ్ళను అందరినీ విచారించడం జరిగిందా? కొత్త వాళ్ళు ఎవరైనా ఆ ఇంట్లో వున్నారా?

వీళ్ళ కంపనీలో పనిచేసిన ఉద్యోగులు ఏమైనారు? వాళ్ళలో ఎవరికైనా ఈ హత్యలతో సంబంధం ఉందా?

అసలు ఈ హత్యలు డబ్బు కోసమే జరిగాయా? ఈ హత్యలు చేసింది ఒకరేనా, లేక అంతకంటే ఎక్కువమంది వున్నారా?

ప్రసాద్! ముందు హంతకుడు ఎవరై ఉండవచ్చో ఒక లిస్టు తయారు చేద్దాం. వరుసగా అన్ని పేర్లూ రాసుకుందాం. అందులోంచి ఒకొక్కరిని ఎలిమినేట్ చేద్దాము. ఫైనల్ గా ఎందరు మిగులుతారో చూద్దాం.

1. హత్య చేయబడ్డ నలుగురు పార్టనర్స్ లో ఒకరు
2. సదానందు తమ్ముడు
3. మూసేసిన కంపెనీలో ఉద్యోగులు
4. బయటి వ్యక్తులు.

హతులు నలుగురిలో వేణు ముందరే చనిపోయాడు. అతని వంటిపై ఉన్న పుట్టు మచ్చబట్టి, అతని డైరీని బట్టీ, మరణించింది వేణు అని నిర్ధారణ అవుతోంది. కనుక అతని పేరు కొట్టేయవచ్చు. ఇక జనార్ధనరావు, రాఘవరావుల బాడీలను వాళ్ళ కుటుంబ సభ్యులు గుర్తించడమే కాకుండా పోస్టుమార్టం రిపోర్టులు ధృవీ కరిస్తున్నాయి. వాళ్ళిద్దరి పేర్లు తీసెయ్యవచ్చు.

చివరి వ్యక్తి సదానందు. ఇతను కారు యాక్సిడెంటులో చనిపోయినట్లు మనకు రిపోర్టులో పేర్కొన్నారు. ఇతన్ని చంపే అవకాశం ఒక్క జనర్ధనుగారికే వుంది. అదాలావుంచి, నిజంగా సదానందం చనిపోకపోతే, ఇతనే మిగతా ఇద్దర్ని చంపి ఉంటాడా? అభిప్రాయ బేధం, ఆ ఇద్దరి మీద కోపం కూడా ఉండే వుంటుంది. కనుక కారణమైతే వుంది. కానీ నాకు అది నమ్మశక్యంగా లేదు. ఇతన్ని కూడా కాసేపు పక్కన పెడదాం.

సదానందు తమ్ముడు. ఇతను ఇంకా హాస్పిటల్లోనే వున్నాడు. ఒకవేళ చంపితే సదానందుని మాత్రమే చంపి ఉండాలి. మిగతా వారి హత్యలతో అతనికి ప్రమేయం ఉండే ఆస్కారమే లేదు. ఎందుకంటే, అతను హాస్పిటల్లో వుండగా జనార్దను, రాఘవరావు, ఇద్దరూ హత్య చేయబడ్డారు.

మూసేసిన కంపెనీలో ఉద్యోగులు– కంపెనీ మూసేసి చాలా సంవత్సరాలు కావడంతో వీళ్ళ వివరాలు మనకు దొరకడం లేదు. వాళ్ళకు ఈ హత్యలు చెయ్యాల్సిన కారణాలు ఏవీ కనపడటం లేదు. వీళ్ళను కూడా ప్రస్తుతం పక్కన పెడదాం.

చివరగా బయటి వ్యక్తులు– అంటే, హతుల ఇళ్ళలో కొత్తగా ఎవరైనా పనిలోకి చేరడం, లేదా చుట్టరికంతో వచ్చి ఉండటం –లాంటివి ఏమైనా జరిగాయా? మనకు ఇప్పటి వరకూ అందిన రిపోర్టులలో ఈ విషయం పై క్లారిటీ లేదు.

మనం ఇప్పుడు చివరి నుంచీ నరుక్కొద్దాం.

ప్రసాద్, మనం పొద్దున్నే బయల్దేరి, ముందు రాఘవ రావు గారింటికి, తర్వాత జనార్ధనరావు గారింటికి వెళ్ళి, ఈ కోణంలో విచారణ చెయ్యాలి. మరొక విషయం మనం మర్చిపోయాం. హతుల ఇళ్ళలో డబ్బు, దస్కం ఏమైనా పోయాయా? ఇవి కూడా తెలుసుకోవాలి.

రాగిణీ, మళ్ళీ మేము వచ్చేదాకా నువ్వు ఇక్కడే వుండు. నీకు తోడుగా మా అబ్బాయి ఉంటాడు. వంట మనిషి అన్నీ చూసుకుంటుంది. నువ్వేం చెయ్యమంటావో చెబితే చాలు.” సాహితి మాట విని రాగిణి ఇబ్బందిగా భర్త వైపు చూసింది.

“చూడు, నువ్వు నాకు చెల్లెలివి అనుకో. అక్క ఇంట్లో నాలుగు రోజులుండటం తప్పుకాదుగా” ప్రేమగా చెప్పింది.

రాగిణి “థాంక్యూ అక్కా” అంది చిలిపిగా.

“గుడ్! అది, అట్లా ఉండాలి నా చెల్లెలంటే! ఓకే, పడుకోండి ప్రసాద్! మనం పొద్దున్నే లేవాలి” చెప్పింది సాహితి.

జనార్ధనరావు గారింటికి వెళ్లేసరికి ఇంట్లో ఏదో హడావుడి పడటం కనిపించింది. సెక్యూరిటీగా ఉన్న కానిస్టేబుల్సు, ప్రసాదు, సాహితిలను చూడగానే, సాల్యూట్ చేశారు.

“ఏం జరిగింది?” అడిగాడు ప్రసాదు లోపల నుంచీ వచ్చిన విశాల్ ను.

“సార్, అదీ...” సందేహిస్తున్న విశాల్ ను “చెప్పండి, ఏం జరిగిందో చెబితే, మీ నాన్నగారి హత్యకు కారణం ఏమిటో క్లూ మాకు దొరికే అవకాశం వుంది”చెప్పింది సాహితి.

“నాన్న గారు కొద్ది రోజుల క్రితం విల్లు రాశారు మేడం. అది కనిపించలేదు. అంతే కాదు, నాన్నగారి మంచంలో ఒక రహస్య అర వుంది. అది నాకూ, అమ్మకే తెలుసు. అందులో నాన్న గారు ఒక యాభై లక్షల రూపాయలు దాచారు. విల్లు కూడా అందులోనే దాచారు. నాన్న గారు పోయాక ఇంతవరకూ మేమెవరం ఆ గదిలోకి వెళ్ళలేదు. ఇవాళ అది తీసి చూస్తే, ఆ అరలో డబ్బు మాయం అయ్యింది, విల్లూ కనిపించలేదు.”

“మీ ఇంట్లో పనిచేసే వాళ్ళు ఎవరైనా తీసి ఉంటారా?” అడిగింది సాహితి.

“లేదు మేడం, అందరూ నమ్మకస్తులే. ఎప్పటి నుంచో మా ఇంట్లో పనిచేస్తున్నారు.” అన్నాడు విశాల్.

“అయినా, మేము ఎంక్వయిరీ చెయ్యాలి తప్పదు. మీరు అందర్నీ పిలవండి” చెప్పాడు ప్రసాదు.

విశాల్ ఒకొక్కరినే పరిచయం చెయ్యసాగాడు.

“ఈవిడ విజయ, మా వంట మనిషి. దాదాపు ఏడెనిమిదేళ్ళ నుంచీ మా ఇంట్లో పనిచేస్తోంది. ఒంటరి మనిషి. మా ఇంట్లోనే ఉంటుంది”.

సాహితి ఆమెను నిశితంగా పరిశీలించింది. ఆమెకు సుమారు యాభై ఏళ్ళుంటాయి. మనిషి శుభ్రంగా,చక్కగా తయారై ఉంది.

నిశ్చల్ రాసిన రిపోర్టులోని ఆమె వాగ్మూలం మరొక మారు చదివి ఉండటంతో, సాహితి ఆమెను ప్రశ్నించలేదు.

“ఇతను మా తోటమాలి యేసు. పొద్దున్న ఎనిమిదింటికల్లా వస్తాడు. మొక్కలకు నీళ్ళుపోసి, అవసరమైన మందు జల్లి పదింటికి వెళ్ళిపోతాడు”.

కూలీ నాలి చేసుకునే పనివాడు అతను.

“మిగిలిన సమయంలో ఏం చేస్తావు?” అడిగాడు ప్రసాదు.

“తాపీ పని చేస్తానండి! అదిగూడ ఏదైనా పని దొరికినప్పుడే. అప్పుడు మరికాస్త పొద్దున్నేలేచి, ఇక్కడ పని చూసుకున్న తర్వాత తాపీ పనికి వెడతాను. ఏ పనీ దొరక్కపోతే, ఇక్కడే వుండి అయ్యగారు చెప్పే పన్లు చేస్తుంటాను” చెప్పాడు.

సాహితి అతన్ని పంపించేసింది.

“ఇతను మా వాచ్ మన్ భద్రయ్య. మా ఇంట్లో సుమారు పదిహేనేళ్ళ నుండీ పనిచేస్తున్నాడు”

“మీ నాన్నగారి హత్య జరిగిన రోజు ఇతనెక్క దున్నాడు?” ప్రశ్నించింది సాహితి. నిశ్చల్ విచారణ చేసినప్పుడు ఇతన్ని చాలా సేపు ఇంటరాగేట్ చేశాడు. ఆ రిపోర్టు చూసికూడా కావాలనే అడిగింది.

“మా తమ్ముడి కూతురి పెళ్ళికి మా ఊరికి వెళ్ళనమ్మా. మా తమ్ముడు చనిపోవడంతో, నేనే దగ్గరుండి పెళ్ళి చెయ్యాల్సి వచ్చింది. పెళ్ళి గురించి చెప్పి, ఒక పది రోజులు సెలవు కావాలని అయ్యగారిని అడిగితే, అయ్యగారు ఇరవై వేలు ఇచ్చి పంపారమ్మా. అల్లాంటి గొప్ప మనిషిని ఎవరో పొట్టన పెట్టుకున్నారు” కళ్ళనీళ్ళ పర్యంతమైన అతన్ని విశాల్ ఓదార్పుగా భుజంపై తట్టాడు.

“ఈమె పేరు అభ. మా ఇంట్లో మొత్తం పనంతా ఈమే చూసుకుంటుంది. అమ్మ అనారోగ్యం మూలంగా దదాపు ఇరవై ఏళ్ళ నుంచీ ఇంట్లోనే ఉండి, అన్నీ తనే చూసుకుంటోంది”.

ఆమెను పరీక్షగా చూసింది సాహితి. సుమారు యాభై ఏళ్ళ వయసు ఉంటుంది ఆమెకు. అయినా అందంగా, హుందాగా వుంది. సాహితి పరీక్షగా చూడటం గమనించి ఆమె తల దించుకుంది.

“ఈమె కెవరూ లేరా?” అడిగాడు ప్రసాదు.

"ఒక కొడుకున్నాడు. అతను నాన్నగారి దగ్గరే సహాయంగా  ఉండేవాడు. కొన్నాళ్ళ క్రితం ఇక్కడ తనకు నచ్చలేదంటూ తమ ఊరు వెళ్ళిపోయాడు".

"ఏ ఊరు మీది?" ప్రశ్నించింది సాహితి.

"కొట్టాయం" మెల్లగా చెప్పింది అభ.

"అతని పేరేంటి? ఈ మధ్య ఎప్పుడన్నా వచ్చాడా?"   మళ్ళీ అడిగాడు ప్రసాదు.

"అతని పేరు శంకర పిళ్ళై. నాన్నగారు చనిపోయే ముందు   రెండ్రోజుల క్రితం వచ్చి, డబ్బు అడిగాలని  వచ్చాడు. ఆయన ఏదో చికాకులో వుండి, కేకలేశారు. వెళ్ళిపోతున్న అతన్ని నేనే వెనక్కి పిలిచి, విషయమేమిటని  అడిగాను. తనేదో బిజినెస్ చేద్దామని నాన్నగార్ని సహాయం అడగటానికి వచ్చాడు. అంతక్రితం కూడా ఆయన సహాయం అడిగితే, కాదనకుండా ఇచ్చారు. ఈసారి  గట్టిగా మందలించారు. నేనే జాలిపడి, నాదగ్గర ఇరవై వేలు ఉంటే, ఇచ్చి పంపాను. మళ్ళీ రాలేదు. వాళ్ళ ఊళ్ళోనే ఏదో బిజినెస్ చేసుకుంటున్నా డనుకుంటాను."

"అతని ఫోటో ఏదైనా వుందా?" అడిగింది సాహితి అభాను పరీక్షగా చూస్తూ.

అభ తడబడింది."నా దగ్గర ఏమీ లేవండి" చెప్పింది.

"విడిగా అతని ఫోటో ఏది లేదుగానీ, మేమందరం క్రిందటేడు దీపావళి టపాకాయలు కాలుస్తున్నప్పుడు, మా అందరితో దిగిన ఫోటో ఉండాలి" చెప్పాడు విశాల్.

"నాకు అది కావాలి" అడిగింది సాహితి.

"అమ్మా, మా వాడ్ని అనుమానిస్తునట్లున్నారు. వాడు అట్లాంటి వాడు కాదమ్మా. ఏదో కాస్త కోపస్వభావం కలవాడైనా, అయ్యగార్ని చంపేటంత దుర్మార్గుడు కాదమ్మా" కంగారుగా చెప్పింది అభ.

"సరే, చూద్దాం. ఇంకా ఎవరున్నారు?" అభాను పంపేసి అడిగింది సాహితి  విశాల్ ను.

"వేలు పిళ్ళై అని నాన్నగారికి అకౌంట్స్ చూస్తాడు. బయటకు వెళ్ళేటప్పుడు సాధారణంగా నాన్నగారు, రాఘవరావు గారు కూడా అతన్ని తీసుకెళ్ళేవారు. నాన్న గారు చనిపోయాక, అతను రాఘవ రావు గారింట్లో ఎక్కువగా ఉంటున్నాడు. అతను కూడా మా అభ వాళ్ళ వూరి వాడే." చెప్పాడు.

"ఈ ఇద్దరిలో డానిష్ భాష ఎవరికి తెలుసు?" సడెన్ గా  అడిగింది సాహితి.

"బహుశా ఇద్దరికీ తెలిసి ఉండొచ్చు మేడం. ఎందుకంటే, నాన్నగారు తరచు బిజినెస్ పనిమీద డెన్మార్క్ వెళ్ళేవారు. ఈ ఇద్దరూ ఆయన వెంట వెళ్ళేవారు."

సాహితి తలపంకించింది. ఆమె మరొక మారు ఫోటో విషయం గుర్తు చేసే సరికి, విశాల్ ఇంట్లోకి వెళ్ళి, ఫోటో ఆల్బం తీసుకు వచ్చాడు. ఆల్బం పేజీలు తిరగేసి సాహితి, "ఏది, ఇందులో మీరు చెప్పిన ఆ ఫోటో చూపించండి" అంటూ ఆల్బం విశాల్ చేతికి ఇచ్చింది.

విశాల్ ఆల్బం పేజీలన్నీ తిప్పి చూశాడు. ఫోటో కనబడక పోయేసరికి, ఒక్కో పేజీ నిదానంగా తీసి చూశాడు.

"లేదు, మేడం ఎక్కడో పడిపోయిందనుకుంటాను" చెప్పాడు విశాల్.

"సరే, మేము ఇక వెడతాం" అంటూ లేచింది సాహితి.

"కొంచెం కాఫీ తాగి వెడుదురు గాని, మేడం" అంటూ విజయను కేకేసి కాఫీ తెమ్మని చెప్పాడు.

బయటకు రాగానే కమీషనర్ ఆఫీసుకు ఫోన్ చేసింది సాహితి. .

"అభే ఫోటో దాచేసినట్లుంది, తన కొడుకును పట్టుకుంటామని. ఈ హత్యలు ఆ శంకర పిళ్ళైనే చేసి ఉంటాడు" అన్నాడు ప్రసాదు.

"ముందు రాఘవరావుగారింటికి కూడా వెడదాం. అక్కడ కూడా ఎంక్వయిరీ చేశాక, మనం ఒక నిర్ణయానికి రాగలమేమో చూద్దాం" చెప్పింది సాహితి.

"అది సరే, అంత డబ్బు ఇంట్లో దాచారంటే, అది బ్లాక్ మనీ అయ్యుండాలి. మనం ఈ దొంగతనం కేసు అఫీషియల్ గా రిపోర్టు చెయ్యద్దా?" అడిగాడు ప్రసాదు.

"దానికి తొందరేం లేదు. అది నీ స్టేషన్ పరిధిలోకి రాదు. ముందు హంతకుడిని పట్టుకోవాలి. అతనెవరో పట్టుబడ్డాక అన్నీవిషయాలు అప్పుడు అవే బయటకు వస్తాయి. దొంగతనం గురించి రిపోర్టు వాళ్ళే చేసుకుంటారు" సాహితి చెబుతుండగానే ఆమె సెల్ ఫోను మోగింది.

ఆన్ చేసి,"చెప్పు విశాల్!" అన్నది. విశాల్ చెప్పింది విని, "థాంక్స్, పర్సనల్ విషయమైనా నాకు ఉపయోగపడే సంగతి చెప్పావు. నా దృష్టి అంతా ముందు హంతకుడిని పట్టుకోవడం మీదే. నువ్వు ఇప్పుడే పోలీసు రిపోర్టు ఇవ్వడం సరైన పద్ధతి. నిజాయితీగా మీకు చెందాల్సిందేదో మీకు అందుతుంది. డబ్బు విషయం తర్వాతైనా బయట పడుతుంది. ముందే రిపోర్టు ఇవ్వడం వల్ల, తర్వాత ఏ ఇబ్బందులు రావు. ఎంక్వయిరీ అఫీషియల్ గా, తొందరగా జరుగుతుంది" చెప్పింది.

రాఘవరావు గారింట్లో విచారణలో వేలు పిళ్ళై, వాళ్ళ ఊరు మధ్యాన్నమే వెళ్ళిపోయాడని తెలిసింది. మిగిలిన అందర్నీ విచారించినా, కొత్త విషయాలేమి తెలియలేదు.

***

రెండ్రోజుల తర్వాత విజయవాడ కమీషనరు గారి ఆఫీసులో ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయబడింది. దానికి బందరు నుంచీ పోలీసు అధికారులు కూడా వచ్చారు.

కమీషనర్ గారు ఉపోద్ఘాతంగా ఆ ఇద్దరు ప్రముఖుల హత్యలు రాష్ట్రంలో ఎంత అలజడి సృష్టించాయో వివరించి, ఈ కేసును పరిష్కరించడంలో తమ పోలీసులు పడిన కష్టం, సాహితి చూపిన చాతుర్యం మెచ్చుకున్నారు. వివరాలు చెప్పమని సాహితిని కోరారు.

విలేఖరులంతా ఆతురతో వుండడం గమనించి సాహితి చిరునవ్వు నవ్వింది.

"మీ కందరికీ ఈ కేసు పూర్వాపరాలు తెలుసు. పార్టనర్స్ నలుగురూ చనిపోవడం, ముఖ్యంగా సదానందం తమ్ముడి ఆచూకీ తొందరగా దొరక్కపోవడం, లాకరు నెంబరు 112- ఇవన్నీ మమ్మల్ని చాలా కన్ఫ్యూజన్ లో పడేశాయి. అక్కడక్కడా కోడ్ భాషలలో రాసిన విషయాలు, ఎక్కడికక్కడ చిక్కుముడులు పడటం- మా పోలీసువారిని సవాలు చేశాయి. మా డిపార్ట్ మెంటు వారు కొన్ని చిక్కుముడులు పరిష్కరించ డానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. నా మిత్రులు ప్రసాద్, నిశ్చల్, రఘువీర్- వీరందరి చొరవా, మా గురుతుల్యులు బందరు సూపరింటెండెంట్ రమణారావు గారు, అంతకంటే ఎక్కువగా నా మీద నమ్మకంతో నాకీ కేసు అప్పగించిన, మా కమీషనరు సిన్హా గార్లు, వారి సహకారం నాకు అడుగడుగునా అందించకపోతే, ఈ కేసు ఇంత తొందరగా పరిష్కరించగలిగే వారం కాదు. అందుకు నేను వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఇక ఈ కేసు విషయానికి వస్తే, ఆ నలుగురు భాగస్వాములు తమ తమ భాగాలను పంచుకుని, సదానందు భాగం మాత్రం ఒక జాయింటు అకౌంటులో వేసి, అది సదానందుకు, లేదా అతని తమ్ముడికో చెందేటట్లు రాసుకున్నారు. అంటే, ఒకరిపై మరొకరికి నమ్మకం పోవడంతో, వేణు మాధవ్ ఈ ఏర్పాటు చేశాడు. ఈ అకౌంటు వివరాలు - పాస్ బుక్కు , తాము రాసిన అగ్రిమెంటు, ఇవన్నీ లాకరు 112 లో దాచడం జరిగింది. అందరూ ఎందుకు అదే నెంబరు లాకరు తీసుకున్నారాని ఆలోచిస్తే, నాకు తట్టిన సమాధానం ఇదీ- 112 అంటే మన దేశంలోనూ, చాలా దేశాల్లో కూడా ఎమర్జెన్సీని తెలిపే టెలిఫోను నెంబరు. అకౌంటు ముగ్గురూ జాయింటుగా ఆపరేట్ చేసేది కనుక, ఎవరికే ప్రాణాపాయం వచ్చినా, మిగతా వారికి తెలిసేలా, ప్రస్ఫుటంగా ప్రకటించాలని ముగ్గురూ అనుకుని, అదే నెంబరు అందరూ సెలెక్ట్ చేసుకోవడం జరిగింది. అందుకే వేణు తన డైరీలో కోడ్ భాషలో లాకరు నెంబరు మాత్రం రాసి ఉంచాడు.

నిజానికి జనార్దనురావు గారికి కానీ, రాఘవరావు గారికి కానీ సదానందు యాక్సిడెంటుతో సంబంధం లేదు. అది ప్రమాద వశాత్తు జరిగినదే. అతను జనార్దను గారిని కలుసుకుని వెడుతుండగా జరిగింది కనుక, అందులో జనార్దను గారి ప్రమేయం ఏమైనా ఉందేమోనని మేము కూడా కాస్త అనుమానించాల్సి వచ్చింది.

ఇక జనార్ధనురావు, రాఘవరావు గార్ల హత్యలు- ఇక్కడా మమల్ని అడుగడుగునా తప్పుదోవ పట్టించే ప్రయత్నమే జరిగింది. వేరే మనుషులెవరో ఈ హత్యలు చేసినట్లు మమ్మల్ని నమ్మించే ప్రయత్నాలు జరిగాయి. నన్ను ప్రతి చోటా ఫాలో అవుతూ వచ్చారు."

"మీరు హంతకుడెవరో చెప్పకుండా సస్పెన్సు లో పెడుతున్నారు మేడం" సస్పెన్సు భరించలేక అడిగాడొక జర్నలిస్ట్.

సాహితి నవ్వింది, "ఆ విషయానికే వస్తున్నాను. జనార్ధనరావు గారు వ్యాపారవేత్తని మనకు తెలుసు. ఆయన వ్యాపార నిమిత్తం మన దేశంలో కేరళా, తమిళనాడు రాష్ట్రాలకు, ఆ తర్వాత డెన్మార్క్, సింగపూర్ దేశాలకూ తరచూ వెడుతుండే వాడు. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం ఆయనకు కేరళలో అభతో అనుకోకుండా సంబంధం ఏర్పడింది. అప్పుడు వారికి పుట్టిన అబ్బాయే శంకర పిళ్ళై. అభకు అంతకుముందే పెళ్ళి అయ్యింది. ఆమె భర్త రైలు యాక్సిడెంటులో చనిపోవడంతో, ఆమె రైల్వే టికెటు రిజర్వేషన్ చేసే ఒక ఫర్మ్ లో పనిచేస్తుండేది.

జనార్ధనరావు గారు జబ్బుతో ఉన్న తన భార్యకు తోడుగా ఉంటుందని ఆమెకు ఆశ్రయం ఇచ్చి, ఇంట్లో పెట్టుకున్నాడు. అభ మొదటి భర్తకు పుట్టిన అబ్బాయి వేలుపిల్లై. రాఘవరావు గారు అతన్ని కూడా తీసుకొచ్చి, కామర్సు డిగ్రీ చదివించి తన దగ్గరే, లెక్కలు చూడడానికి వుంచుకున్నాడు. రాఘవరావు గారి కొడుకు విశాల్ కు ఇది నచ్చలేదు. తన తల్లిని మోసం చేస్తున్నాడని తండ్రిపై ద్వేషం పెంచుకున్నాడు. దానికి తోడు, బిజినెస్ చేసుకుంటానని వచ్చిన శంకర పిళ్ళైకు తండ్రి రెండు మూడు సార్లు డబ్బు ఇచ్చి పంపడం, వేలుపిళ్ళైనీ, శంకర పిళ్ళైనీ తనతో సమానంగా చూడడం కూడా అతనికి కంటగింపు అయ్యింది. కానీ, తండ్రి దగ్గర ఏమాత్రం బయటపడలేదు. బయటపడితే, తనకు తెలియకుండానే వాళ్లకు మరింత సహాయం అందుతుందని అతని అనుమానం. అందుకే, ఎవరో రాసినట్లు రాసి, మూడు బెదిరింపు ఉత్తరాలు రాశాడు. జనార్ధనరావు గారు మొదట రెండు ఉత్తరాలనూ లెక్కపెట్టక పోయినా, డానిష్ భాషలో రాసిన ఉత్తరం చూశాక, సదానందం, లేదా అతని తమ్ముడు సుదీర్ ఇంకా బతికేవున్నారేమోనని అనుమానం వచ్చిఉంటుంది. అందుకే, లాకరు నెంబరు మార్చి, కొడుకు పేర లాకరు తీసుకున్నాడు. రాఘవరావు గారు అభ కొడుకులిద్దర్నీ ప్రేమగా చూసుకున్నాడు. తనకోసం, జబ్బు పడిన తన భార్య కోసం, అభ జీవితమంతా సేవచేస్తూ ఉన్నదనే సానుభూతి ఆయనలో వుంది. అందుకే, శంకర పిళ్ళై బిజినెస్ చేసుకుంటానని డబ్బు కోసం వచ్చినప్పుడు ఆయన అతనికి మూడు లక్షలు డబ్బిచ్చి పంపాడు. శంకర పిళ్ళై, వేలు పిళ్ళైలకిద్దరికీ డానిష్ భాష వచ్చనీ, డబ్బు కోసం వచ్చిన శంకర పిళ్ళైని తండ్రి కేకలేశారనీ, తనే ఇరవై వేలిచ్చి పంపానని చెప్పి, విశాల్ మమ్మల్ని తప్పుదోవ పట్టిద్దామని చూశాడు. అది నిజం కాదు. ఇక్కడే విశాల్ పప్పులో కాలేశాడు. మాకు అనుమానం వచ్చి, విశాల్ గురించి కాలేజిలో విచారించాము. ధనవంతుల పిల్లలు ఎలా పెరుగుతారో, అంతకన్నా ఎక్కువ గారాబంగా, అహంకారంతో పెరిగాడు విశాల్. వేలు పిళ్ళై నిదానస్తుడు. జనార్ధనరావు గారు మరణించాక, వేలు ఇతని అధారిటి భరించలేక, రాఘవరావు గారింటికి వెళ్ళి, ఆయన దగ్గర ఉంటున్నాడు. అభ మీద, ఆమె కొడుకుల మీద అనుమానం మళ్ళించడానికి, ఆల్బంలో వాళ్ళ ఫోటో వుండాలని చెప్పి, తనే దాచేశాడు. అభ కంగారు పడి వేలుకు ఫోన్ చేసి, వెంటనే వెళ్ళిపొమ్మని చెప్పేలా చేశాడు. కొడుకు మీద అనుమానం లేని జనార్ధన రావు గారు, హత్యకు ముందురోజు అభ కొడుకులిద్దరికీ వాటా ఇస్తూ, విల్లు రాసిన సంగతి చెప్పేసరికి, విశాల్ రాక్షసుడు అయిపోయాడు. తండ్రి విల్లు రిజిస్టర్ చేస్తే, తనకు మాత్రమే దక్కాల్సిన మొత్తం ఆస్థిలో కొంత భాగమే తనకు మిగులుతుందని భయపడ్డాడు. తనకు తెలిసిన లోకల్ గూడాలతో బేరం కుదుర్చుకుని, తండ్రిని అంతం చేశాడు. విల్లు, డబ్బు పోయాయని నాతో అబద్ధం చెప్పాడు. రాఘవరావు గార్ని చంపిన హంతకులను కూడా పట్టుకున్నాం".

"మేడం, మీ మాటకు అడ్డు వస్తున్నందుకు ఏమీ అనుకోవద్దు. మరి రాఘవరావు గార్ని హత్య చేసింది ఎవరు?ఇంతకూ విశాల్ ని అరెస్టు చేశారా?" అడిగాడు మరొక జర్నలిస్ట్.

"రాఘవరావు గార్ని హత్య చేసింది కూడా విశాలే. సరిగా చదువుకోకుండా, విచ్చలవిడిగా తిరుగుతాడని మొదటి నుంచీ రాఘవరావు గారికి ఇతనిపై సదభిప్రాయం లేదు. అయితే, జనార్ధనరావు గారితో స్నేహం వల్ల, ఆయన కూతురు ఇతన్ని ప్రేమించి ఇతన్నే చేసుకుంటానని చెప్పడంతో, తప్పనిసరై ఒప్పుకున్నాడు. జనార్ధనరావు గారి హత్య జరిగిన తర్వాత, రాఘవరావుగారు విశాల్ కిచ్చి పెళ్ళిచేసే ఉద్దేశ్యం లేదని తన కూతురు శ్రీ దేవికి స్పష్టంగా చెప్పడమే కాకుండా, అసలు జనార్ధన రావుగారి హత్యకు విశాలే కారకుడేమోననే అనుమానం కూడా వెలిబుచ్చాడు. విశాల్ ని ఏమాత్రం అనుమానించని శ్రీ దేవి, ఆ విషయం అతనికి చెప్పింది. ఇంకా ఆలశ్యం చేస్తే, అసలుకే మోసం వచ్చేటట్లుందని విశాల్ గ్రహించాడు. రాఘవరావు గారు ఒక్కరే కమీషనర్ ఆఫీసుకు వెళ్ళారని తెలుసుకుని, తిరుగు ప్రయాణంలో ఆయన్ను చంపేశాడు".

ఇంతలో సాహితి ఫోను రింగయ్యింది. ఫోను తీసి మాట్లాడుతూనే సాహితి లేచి, కమీషనర్ గారితో ఏదో చెప్పి, వెంటనే కారెక్కింది.

జర్నలిస్టులు ఆమె హడావుడిగా బయల్దేరడం చూసి, "ఏమైంది మేడం, ఏం జరిగింది?" అడిగారు.

"మావాళ్ళు, జనార్ధనరావు గారి అబ్బాయి విశాల్ ను అరెస్టు చెయ్యడానికి వెళ్ళారు. ఎంత పిలిచినా అతను గదిలోంచి రాకపోయేసరికి, అనుమానం వచ్చి తలుపులు బద్దలుకొట్టా రట. గదిలో విషం తాగి చనిపోయాడు. బహుశా తనని అనుమానిస్తున్నామని గ్రహించినట్లున్నాడు, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్ ఫెలో! తల్లిదండ్రులు చేసే తప్పిదాలు ఒకోసారి ఎన్ని అనర్ధాలకు దారి తీస్తాయో, పిల్లల జీవితాలు ఎలా దారి తప్పుతాయో, అతి గారాబం పిల్లలను ఎలా పాడు చేస్తుందో చెప్పడానికి ఈ కేసు ఒక ఉదాహరణగా నిలిచిపోతుంది".

"మేడం, మీరు వేణు మాధవును చంపినదెవరో, ఆ కేసు ఏమైందో చెప్పలేదు" అడిగాడో విలేఖరి.

"సెక్రటరీ సుబ్రహ్మణ్యం కేసు హైకోర్టులో అప్పీల్ చేశారు. అతన్ని విడుదల చేసేందుకు కావాల్సిన సాక్ష్యాధారాలు కోర్టులో సబ్మిట్ చేశారు. ఇకపై కోర్టువారి ఆదేశాలననుసరించి, మా పోలీసువారు నడుచుకుంటారు."

"ఓకే, మేడం, థాంక్స్! అయితే, ఒక్క విషయం. మీకు విశాల్ ఈ రోజు ఆత్మహత్య చేసుకున్నాడని ముందే తెలుసు. బహుశా కాసేపు మమ్మల్నిఆపేందుకు ఇక్కడ మీటింగు అరేంజ్ చేశారనిపిస్తోంది" అడిగాడు సీనియర్ జర్నలిస్టు.

సాహితి సమాధానం చెప్పకుండా, చిరునవ్వు నవ్వి కారు స్టార్టు చేసింది.

జర్నలిస్టులు తమ మోటార్ సైకిళ్ళు స్టార్ట్ చేసి, జనార్ధనరావు గారింటికి బయల్దేరారు.